దగ్ధమవుతున్న వాహనాలు

PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 100 | విజయవాడ, మంగళవారం 11 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 11 November 2025 | Rs

భీతావహంగా మారిన ఘటనా స్థలం

పేలుడుతో వ్యాపించిన మంటలు

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో
భారీ పేలుడు
9 మంది మృతి, 24 మందికి గాయాలు

- మెట్రో స్టేషన్ వద్ద కారులో విస్ఫోటనం
- బ్లాస్టింగ్ ధాటికి ఛిద్రమైన శరీరాలు, పలు వాహనాలు దగ్ధం
- ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా హై అలర్ట్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ పేలుడుతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలో పార్క్ చేసిన కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 24 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి పలువురి శరీరాలు ఛిద్రమయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో భీతావహ దృశ్యాలు అక్కడివారిని కలిచివేశాయి. మరోపక్క మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి), ఫోరెన్సిక్ (ఎఫ్ఎస్ఎల్) బృందాలు చేరుకుని దర్యాప్తు ప్రారంభించాయి.. ఎర్రకోట చాందినీచౌక్ దారులను మూసివేసినట్టు ఢిల్లీ పోలీసు కమిషనర్ వెల్లడించారు. విమానాశ్రయాలు, మెట్రో, చారిత్రక కట్టడాలు, ప్రభుత్వ భవనాలతో సహా ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) దేశ వ్యాప్తంగా హై అలెర్ట్ జారీ చేసింది..

ఏం జరిగింది..?

ఢిల్లీ మెట్రోస్టేషన్ గేట్ నెంబర్-1 వద్ద వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. సాయంత్రం 6.52 గంటల సమయంలో నెమ్మదిగా వెళ్తున్న ఒక కారు రెడ్‌లైట్ వద్ద ఆపినప్పుడు ఆ కారులో అమర్చిన పేలుడు పదార్థాలు భారీ శబ్దాలతో మిగతా 7లో

'అసైన్డ్'కు మళ్లీ సవరణ!

- ఆర్డినెన్స్ జారీ చేయనున్న ప్రభుత్వం
- 99 ఏళ్ల లీజుకు అవకాశం
- ఉండవల్లి వద్ద రెండో పంపింగ్ స్టేషన్
- ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష
- కేబినెట్ నిర్ణయాలు


కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేద ప్రజలకు ఎంతోకొంత ఆసరాగా ఉండే అసైన్డ్ భూములను మాయమాటలతో వారి వద్ద నుండి గుంజుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అసైన్డ్‌భూముల బదిలీలను నిషేధిస్తూ 1977లో రూపొందించిన చట్ట స్ఫూర్తిని నీరుగారుస్తూ ఇప్పటికే కొన్ని సవరణలు జరగ్గా, తాజాగా మరో సవరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యవసరం కావడంతో ఈ మేరకు ఆర్డినెన్స్ జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. వాస్తవానికి ఈ మేరకు రూపొందించిన బిల్లు గత అసెంబ్లీ సమాశాల ముందుకు వచ్చింది. అయితే, బిల్లు ఆమోదం పొందకముందే ఉభయసభలు వాయిదా పడటంతో తాజాగా ఆర్డినెన్స్ జారీ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ సవరణతో అసైన్డ్ భూములను 99 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడానికి అవకాశం కలుగుతుందని మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వివరించిన పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. ప్రభుత్వం 'లీజు' అని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఈ నిర్ణయం ఎవరికి మేలు చేస్తోందో, 99 ఏళ్ల తరువాత భూములపై అధికారం ఎవరి వద్ద ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. క్లీన్ ఎనర్జీపాలసీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో లక్ష కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందని. అమరావతిలో క్వాంటంపాలసీ. నైబర్‌హుడ్ వర్క్‌ప్లేస్ పాలసీలకు ఆమోదం తెలిపినట్లు ఆయన వివరించారు. ఎపి నైబర్‌హుడ్ పాలసీతో ప్రతి మండలంలో 20నుంచి 30 వర్క్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని అన్నారు. విశాఖలో రియాల్టీ లిమిటెడ్ ఐటి పార్కు, రహేజా సంస్థ పరిశ్రమల ఏర్పాటు, రుషికొండ, కాపులుప్పలపాడులో పరిశ్రమల ఏర్పా టుకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రూ.1863 కోట్లతో అమరావతి లో ఇంటర్నల్ రోడ్లు

అమరావతి క్యాపిటల్ సిటీ, ల్యాండ్ పూలింగ్ ప్రాంతాల్లో ముఖ్యంగా కృష్ణయ్యపాలెం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక, మిగతా 7లో

మోడీ దిగ్భ్రాంతి

ఘటనా స్థలిలో భద్రతా సిబ్బంది సహాయక చర్యలు

ఢిల్లీ : ఢిల్లీ పేలుడు సంఘటన పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో మృతులకు ప్రధాని సంతాపం ప్రకటించారు. బాధితులకు సాయం అందుతుందని మోడీ తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హోం మంత్రి అమిత్ షా, ఇతర అధికారులతోనూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

అండగా ఉంటాం : రాహుల్

పేలుడు ఘటన బాధాకరమని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి తన సంతాపాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు..

బాధితులను ఆదుకోండి : ఎం.ఎ బేబి

ఢిల్లీ పేలుడు వార్త తీవ్ర షాక్‌కు గురిచేసింది. బాధిత కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. గాయాలైన వారందరికి తక్షణం వైద్యం, తగిన ఆహారం, సహాయ సహకారాలు ప్రభుత్వం అందించాలి. ఈ ఘటనపై వేగంగా విచారణ జరపాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

ఎస్ఐఆర్‌ను నిలిపివేయండి
సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను రాష్ట్రంలో అమలు చేయడాన్ని నిలిపేయాలని సిపిఎం డిమాండ్ చేసింది ఈ మేరకు కె. లోకనాథం అధ్యక్షతన సోమవారం జరిగిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఒక తీర్మానం చేసింది. ఎస్ఐఆర్ రాష్ట్రంలో అమలు చేయడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో పలు పార్టీలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక సమగ్ర సవరణను రాష్ట్రంలో నిలిపేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై వెంటనే రాజకీయ పార్టీల సమావేశం జరపాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరును డిమాండ్ చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర సవరణ చేయాలని ఆదేశాలిచ్చిన 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిక ప్రాంతాల్లో రాష్ట్రాన్ని పేర్కొనకపోయినా రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలు చేయాలనుకోవడం గర్హనీయమని పేర్కొంది. బీహార్లో ప్రత్యేక సమగ్ర సవరణ చేసిన సందర్భంలో దేశవ్యాప్తంగా అనేక అభ్యంతరాలు వచ్చాయని, సుప్రీం కోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ కేంద్ర ఎన్నికల కమిషన్ లెక్క చేయలేదని తెలిపింది. బిజెపి కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా వ్యతిరేకించిన పౌరసత్వ చట్ట సవరణను, జాతీయ పౌరచట్ట రిజిస్టర్ చట్టాలను దొడ్డిదారిన కేంద్ర ఎన్నికల కమిషన్ ద్వారా అమలు చేయడానికి పూనుకుంటోందని విమర్శించింది. తెలుగుదేశం పార్టీ గతంలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించినా ఇప్పుడు రాష్ట్రంలో అమలుకు పూనుకుంటోందని తెలిపింది. అలాగే రాష్ట్రంలో ప్రతిపక్ష వైసిపి కూడా ఎస్ఐఆర్‌పై తన వైఖరిని స్పష్టం చేయాలని కోరింది. ఎస్ఐఆర్‌ను అమలు చేయడాన్ని రాష్ట్రంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు వ్యతిరేకించాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

వ్యయ బిల్లుకు సెనెట్ ఆమోదం

- త్వరలో ముగియనున్న షట్‌డౌన్
- అనుకూలంగా ఓటేసిన 8 మంది డెమొక్రాట్లు
- ఆరోగ్య సబ్సిడీల కొనసాగింపుపై ప్రభుత్వం హామీ ఇవ్వకపోయినా సమర్ధన
- దీనిపై వచ్చే నెలలో ఓటింగ్
- డెమొక్రాట్ల శిబిరంలో దుమారం

7

జమ్మూకాశ్మీర్‌లో భారీగా ఐఇడి స్వాధీనం

- ఇద్దరు వైద్యులతో సహా ఏడుగురు అరెస్టు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ పోలీసులు ఆది, సోమవారాల్లో వివిధ ప్రదేశాల్లో జరిపిన సోదాల్లో 2,900 కేజీల ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి) తయారు చేసే మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వైద్యులుసహా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారికి ఉగ్రవాద సంస్థలు జైష్-ఎ-మొహమ్మద్ (జెఎం), అన్సార్ ఘజ్వత్-ఉల్- హింద్ (ఎజియుహెచ్)తో సంబంధాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. శ్రీనగర్, అనంతనాగ్, గండర్‌బాల్, షోపియన్‌ల్లో జమ్మూకాశ్మీర్ పోలీసులు సోదాలు జరపగా, హర్యానా పోలీసులతో కలిసి ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కలిసి సహరాన్‌పూర్‌లో సోదాలు జరిపారు. అరెస్టు చేసిన వైద్యులను పుల్వామాలోని కోయిల్‌కు చెందిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై అలియాస్ ముసాయిబ్, కుల్గాంలోని వాన్‌పోరాకు చెందిన డాక్టర్ అదీల్‌గా గుర్తించారు.

మొంథాతో రూ.6,384 కోట్ల నష్టం

తక్షణ సాయం రూ.901 కోట్ల నిధులిచ్చి ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో తుపాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను రాష్ట్రంలో అంచనాలకు మించి అపార నష్టం కలిగించిందని, కేంద్ర ప్రభుత్వం ఉదారతతో ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర బృందాన్ని కోరింది. తుపాను నష్టం పరిశీలనకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందం తొలుత వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి సోమవారం ఉదయం చేరుకుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీబసు, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంచాలకులు కె పొన్నుస్వామి నేతృత్వంలో 8 మంది అధికారులు ఈ బృందంలో ఉన్నారు. ఆర్‌టిజిఎస్‌లో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) జి జయలక్ష్మి, ఆర్‌టిజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్ తుపాను నష్టాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి రూ.6,384 కోట్ల నష్టం వాటిల్లిందని, రూ.901.40 కోట్లు తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. మొంథా తుపాను రాష్ట్రంలో 24 జిల్లాల్లో విధ్వంసం సృష్టించిందని, అంచనాలకు మించి అపార నష్టం కలిగించిందని సిసిఎల్ఎ జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ రంగానికి తుపాను తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కోత దశకు వచ్చిన పంటలను తుపాను ముంచెత్తిందని, దానివల్ల రైతులు జీవనాధారమైన పంటలు నీట మునిగిపోయాయని, దీంతో వారిని కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. 1.61 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. 6,250 హెక్టార్లలో ఉద్యాన పంటలు, 17.72 హెక్టార్లలో మల్బరీ తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ తుపాను కారణంగా మత్స్యకారులు బాగా దెబ్బతిన్నారని చెప్పారు. 3,063 హెక్టార్లలో మిగతా 7లో

క్షేత్ర స్థాయిలో కేంద్ర బృందం పర్యటన

- మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటల పరిశీలన

2



అందెశ్రీ కన్నుమూత

- నేడు ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. సోమవారం తెల్లవారు జామున ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆపస్మారక స్థితిలో ఉన్న అందెశ్రీని కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు గాంధీ వైద్యులు తెలిపారు. దీంతో, భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు తొలుత లాలాపేటలోని ఇంటికి, అనంతరం అభిమానుల సందర్శనార్థం జిహెచ్ఎంసి ఇండోర్ స్టేడియంకు తరలించారు. మంగళవారం ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందెశ్రీ మృతికి ప్రధాని నరేంద్ర మోడీ, తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం ప్రకటించారు.

మాటలు కాదు... చేతలు కావాలి!

- కాప్30 ప్రారంభ కార్యక్రమంలో బ్రెజిల్
- హాజరైన 200 దేశాల ప్రతినిధులు
- అమెరికా గైర్హాజరు
- ధనిక దేశాల వైఖరి మారాలంటూ పర్యావరణవేత్తల నిరసనలు

బెలెం : 'ఇప్పటిదాకా చాలా మాటలు చెప్పాం... ఇప్పుడు అవి చాలవు.. ఇది చేతల్లో చూపించే సమయం. అందుకే దీనిని ఆచరణ సదస్సుగా, నిజాల సదస్సుగా మేం పిలుస్తున్నాం. సభ్య దేశాలు కూడా ఆ దిశలో చొరవ చూపాలి.' అమెజాన్ గేట్‌వే నగరం బెలెంలో 30వ ప్రపంచ వాతావరణ సదస్సు (కాన్ఫడరేషన్ ఆఫ్ పార్టీస్- కాప్ 30) ప్రారంభం సందర్భంగా బ్రెజిల్ చేసిన ప్రకటన ఇది! భారతీయ కాలమాన ప్రకారం సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ సదస్సు ప్రారంభమైంది. కాప్-30 అధ్యక్షుడు, బ్రెజిల్ దేశ వాతావరణ రాయబారి ఆంద్రే కొరియా డి లాగో ఈ సమావేశాలు ప్రారంభమైనట్లు అధికారికంగా ప్రకటించారు. అంతకుముందు అజర్‌బైజాన్ పర్యావరణ మంత్రి, గత కాప్ అధ్యక్షుడు ముఖ్తార్ బబాయేవ్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్‌కు అప్పగించారు. బాధ్యతలను స్వీకరించిన వెంటనే ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య

డి లాగో కాప్ 30 ప్రారంభమైనట్లు ప్రకటించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 200 దేశాల నుండి ప్రతినిధులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. అమెరికా అధికారికంగా ఈ సదస్సుకు హాజరు కాలేదు.

అయితే, ఆ దేశానికి చెందిన పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కనిపించారు. ఒకవైపు సదస్సు ప్రారంభ సమావేశం జరుగుతుండగా, మరోవైపు సమావేశ ప్రాంగణానికి బయట వివిధ దేశాల నుండి తరలివచ్చిన పర్యావరణ వేత్తలు, ఎన్‌జిఓలు ధనిక దేశాల వైఖరిని నిరసిస్తూ ప్రదర్శనలు చేశారు. ఇంధనం మీద ఆధిపత్యం కోసమే పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ యుద్ధంచేసిందని పేర్కొంటూ కొన్ని ప్రదర్శనలు జరిగాయి. ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహును పర్యారణానికి శత్రువుఅని, ఆ దేశాన్ని వాతావరణ చర్చల నుండి బహిష్కరించాలని వీరు డిమాండ్ చేశారు. సమావేశాన్ని ప్రారంభించిన డి లాగో వాతావరణ అంశాలను అర్థిక వ్యవస్థలో, ఉపాధి సృష్టి కార్యక్రాల్లో అనుసంధానం చేయాలని సూచించారు. వాతావరణ మార్పు చర్చలు మరింత వేగంగా మిగతా 7లో

అధ్యక్షులు జి.రమణకుమారి

ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

కోశాధికారి ఎ.కమల

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
రమణకుమారి, ధనలక్ష్మి
53 మందితో రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.రమణకుమారి, కె.ధనలక్ష్మి, కోశాధికారిగా ఎ.కమల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 23 మంది ఆఫీస్ బేరర్లు, 30 మంది కమిటీ సభ్యులు మొత్తం 53 మందితో రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా బి.సుధారాణి, వి.సత్యవతి, డి.అన్నపూర్ణ, పి.ధనశ్రీ, జి.అమరావతి, ఎం.శివాని, కె.కల్పన, ఎస్.పద్మ, ఎం.నాగమణి, సహాయ కార్యదర్శులుగా ఎం.వాణిశ్రీ, కె.పోశమ్మ, ఎన్.సౌభాగ్య, సుభాషిని, ఎం.వెంకటేశ్వరమ్మ, కె.లక్ష్మి, సిహెచ్ లక్ష్మి, ఎం.రత్నకుమారి, కో ఆప్షన్‌గా తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎన్నికయ్యారు.

పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 25 జిల్లాల నుంచి 270 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

వందేమాతరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

'150 వసంతాల వందేమాతరం'లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - విజయవాడ : వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా స్థానిక తుమ్మలపల్లికళాక్షేత్రంలో 150 వసంతాల వందేమాతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన తలకించారు. అనంతరం వందేమాతర గేయ రచయిత బక్రించంద్ర ఛటర్జీ, తెలుగులో మొదటి నిఘంటువు సృష్టి కర్త సిపి బ్రౌన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జునరావు రచించిన వందేమాతరం పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రజలతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... వందేమాతరం గేయం అందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, స్వాంతంత్ర్యోద్యమ సంగ్రామంలో జాతీయ భావాన్ని రగిలించిందన్నారు. విశిష్టమైన ఈ గేయాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

ఓ వైపు మేకిన్ ఇండియా కార్యక్రమాలు, మరోవైపు యోగా వంటి కార్యక్రమాలు దేశ కీర్తిని ప్రపంచం మొత్తం చాటాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తామని తెలిపారు. దేశం తనకేమి ఇచ్చిందని కాకుండా దేశానికి తానేం చేశానని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎపి సృజనాత్మకత సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినీ, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ ఆర్‌డిఓ కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి యాక్షన్ ప్లాను

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీకాకుళం నుండి కోనసీమ వరకు ఉన్న విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి యాక్షన్ ప్లాను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో విశాఖ ఎకనామిక్ రీజియన్(విఇఆర్) అభివృద్ధిపై సోమవారం సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన పాలసీలను రూపొందించాలని సూచించారు. విఈఆర్‌ను రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దాలంటూ పలు సూచనలు చేశారు. స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై మాస్టర్‌ప్లాను తయారు చేయాలన్నారు. పోర్టుల ద్వారా కార్గో హ్యాండ్లింగ్‌తో పెద్దఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందని అన్నారు. మూలపేట పోర్టు నుండి దుగరాజపట్నం పోర్టు వరకూ ఫిష్ బల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఉత్తర దక్షిణాది రాష్ట్రాలను కలుపుతున్న రాష్ట్రం ఇక ఈస్ట్ వెస్ట్ కారిడార్‌గా మారాలని తెలిపారు. 12 నుండి 15 మ్యానుఫ్యాక్చరింగ్ నోడ్స్ కలిగిన ప్రాంతంగా విశాఖ ఎకనామిక్ రీజియన్ మారుతుందని అన్నారు. రీజియన్ పరిధిలో క్లీన్, గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సిఎం సూచించారు. విశాఖ లాంటి ప్రాంతాలు నెక్స్‌జెన్ ఐటిడేటా సెంటర్, ఎఐ ఇన్నోవేషన్‌గా మారుతున్నాయని, ఈ రీజియన్‌లో ఇతర ప్రాంతాలు, జాతీయ, అంతర్జాతీయ హెల్త్‌కేర్ హబ్‌గా మార్చాల్సి ఉందని అన్నారు. ప్రణాళికాబద్ధంగా పట్టణీకరణ హౌసింగ్ ప్రాజెక్టులు రావాల్సి ఉందని అన్నారు. విఇఆర్ ప్రాంతంలో 100 నుండి 115 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉందని సిఎం అన్నారు. ప్రస్తుతం త్వరలో ప్రస్తుతం ఉన్న రైల్వేలైనును నాలుగులైన్లుగా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత

- కొందరు ఎమ్మెల్యేలపై చంద్రబాబు మళ్లీ ఫైర్
- వచ్చే కేబినెట్‌లోగా వారిని సెట్ చేయాలని సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కొందరు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి ఫైర్ అయినట్లు సమాచారం. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో అధికారులు వెళ్లిపోయిన తరువాత మంత్రులతో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. వారిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదేనని తేల్చిచెప్పారు. కూటమిలోని ఏ పార్టీకి చెందిన ఎమ్మెల్యే తప్పుచేసినా ఇన్‌ఛార్జ్ మంత్రి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా జోక్యం చేసుకుంటూ మంత్రులకు ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. గత ఎన్నికల్లో 50 వేల మెజార్టీ వచ్చిందని నిర్లక్ష్యంగా ఉంటే ఈసారి పది వేలు కూడా రాదని ఎమ్మెల్యేలనుద్దేశించి సిఎం అన్నట్లు తెలిసింది. వచ్చే మంత్రివర్గ భేటీనాటికి ఎమ్మెల్యేలను సెట్ చేయాలని చంద్రబాబు సూచించారు.

ఏడాదిలో అందరికీ ఇళ్ళు

ఇళ్లపై జరిగిన చర్చలో పేదలందరికీ ఇళ్ల అందించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకునేలా చూడాలని చంద్రబాబు సూచించారు. నివాస స్థలం లేని వారితో ఒక అర్హుల జాబితాను రూపొందించాలన్నారు. ఏడాదిలోగా అర్హులకు లబ్ధి జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనిని ఒక అజెండాగా ఇన్‌ఛార్జ్ మంత్రులు పెట్టుకోవాలన్నారు. జనసేన పార్టీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని ఆ పార్టీకి చెందిన మంత్రి కందుల దుర్గేష్ కోరగా, అది విధానపరమైన నిర్ణయంగా మరో మంత్రి నాదెండ్ల వ్యాఖ్యానించారు. అయితే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ నిబంధనల మేరకు పార్టీ కార్యాల యాల నిర్మాణం చేసుకోవాలని సూచించారు.

పెద్దిరెడ్డి అక్రమాలపై వీడియోలు

ఎర్రచందనంపై జరిగిన చర్చలో పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలపై పూర్తి స్థాయి వీడియోలు తీయించానని వివరించారు. ఎర్రచందనం డిపో సందర్శన వివరాలు కూడా ఇతర మంత్రులతో ఆయన పంచుకున్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల తో వివిధ రకాల పరికరాలు తయారు చేయించాలని, తద్వారా ఆదా యం కూడా పెరుగుతుందని పవన్ సూచించగా.. చంద్రబాబు సానుకూలంగా స్పందిం చి ప్రతిపాదనలు పరిశీలిద్దామని హామీనిచ్చారు.

భాగస్వామ్య సదస్సుపై అవగాహన

విశాఖలో 14, 15 తేదీల్లో నిర్వహించే భాగస్వా మ్య సదస్సును విజయవంతంగా నిర్వహించాలని మంత్రులకు చంద్రబాబు సూచించారు. ఇదే సదస్సుపై యువతలో అవగాహన పెంచేలా చూడాలన్నారు. విద్యార్థులకు కూడా అర్థమయ్యేలా చూడాలన్నారు. సదస్సులో జరిగిన ఒప్పందాల వివరాలు వారికి చేరేలా చూడాలని సూచించారు.

పెత్తందారులకు అనుకూలంగా అసైన్డ్ చట్ట సవరణ : వ్యకాస

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెత్తందారులకు అనుకూలంగా మంత్రివర్గ సమావేశం 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరించిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విమర్శించింది. దళితులు, బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న పెత్తందారులకు దొడ్డిదారిన 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికే ఈ సవరణ అని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన 13 లక్షల అసైన్డ్ భూములను 99 ఏళ్లపాటు పెద్దలకు కట్టబెట్టేందుకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోలు చేయొద్దని, రిజిస్ట్రేషన్ కూడా చేయకూడదని టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ హోల్డ్‌పై నిషేధాన్ని విధించిందన్నారు. ఇప్పుడు దీనిని ఎత్తివేస్తూ ఆక్రమణదారులకే భూములు కట్టబెట్టేందుకు పూనుకుందని ఆగ్రహించారు. దీనివల్ల లక్షలాది దళిత, బలహీన వర్గాల కుటుంబాలు భూములు కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గోదావరి పుష్కరాల నిర్వహణకు కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గోదావరి పుష్కరాలు (2027) కోసం కార్యదర్శుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 11 శాఖల కార్యదర్శులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దేవాదాయ, జలవనరుల, హోమ్, పురపాలక, రెవెన్యూ, పర్యాటక, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, ఇంధన, ఆర్థికశాఖ కార్యదర్శులు ఈ కమిటీలో ఉంటారని వెల్లడించింది. మంత్రుల బృందం తీసుకున్న నిర్ణయాల ప్రకారం, రాబోయే గోదావరి పుష్కరాలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడానికి వీరు విధానాలు, వ్యూహాలు రూపొందిస్తారని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్‌ను గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సిఎస్ విజయానంద్ ఉత్తర్వులిచ్చారు.

10 కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 10 కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్లను కూటమి వెల్లడించింది. ఎపి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డుకు 13 మంది, ఎస్‌సి కమిషన్ సభ్యులుగా ఐదుగురిని, మైనార్టీ కమిషన్ సభ్యులుగా ముగ్గురిని, లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్లుగా 11 మందిని, కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా 15 మందికి, కళింగకోమటి/కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డులో 15 మంది, దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీలో 15 మంది, ముదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 15 మంది, నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 15 మంది, సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 15 మంది చొప్పున ప్రకటించింది.

ఉద్యోగం లేదని ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార (విశాఖపట్నం)

సూసైడ్ నోట్ రాసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విశాఖపట్నం మధురానగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. దీనికి సంబంధించి ద్వారకా పోలీసుస్టేషన్ ఎస్ఐ ధర్మేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొర్ల గ్రామానికి చెందిన సంపత్ కుమార్ (31) ఉద్యోగం కోసం కొన్ని రోజుల కిందట విశాఖ వచ్చి మధురానగర్‌లో ఉంటున్నారు. ఎంబిఎ చేసినప్పటికీ ఉద్యోగం రాక, డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో సంపత్ కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. దీంతో స్నేహితుడు పోలీసులకు సమాచారం అందించారు. ద్వారక సిఐ డివి రమణ, ఎస్ఐ ధర్మేంద్ర ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉద్యోగం రాలేదని మనస్తాపంతో చనిపోతున్నట్టు మృతుడు రాసుకున్న సూసైడ్ నోట్‌ను గుర్తించారు.

విశాఖ భాగస్వామ్య సదస్సు

అజెండా ఖరారు

- టెక్నాలజీ, ఏఐ, విజన్-47, మెడిసిన్, డిఫెన్స్‌లపై చర్చలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి, గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సు ప్రాథమిక అజెండాను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. గురువారం ఉదయం 10.30 గంటలకు ఈ సదస్సు ప్రారంభం కానుంది. అనంతరం రెండు రోజులపాటు నిర్వహించే పలు కార్యక్రమాల వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. తొలి కార్యక్రమంలో రాష్ట్రంలో జిఎస్‌డిపి వృద్ధి, అభివృద్ధికి ఉన్న అవకాశాలు వంటి వాటిపై వివరిస్తారు. అనంతరం వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై పారిశ్రామిక వేత్తలతో చర్చిస్తారు. రెండు రోజుల సదస్సుకోసం ప్రధాన వేదికతోపాటు మూడు సమావేశ మందిరాలను ఏర్పాటుచేస్తున్నారు. ఒకేసారి వివిధ వేదికల్లో భేటీలు, చర్చలు జరుగుతాయి. తొలి రోజు రెండో వేదికలో సాంకేతికత, జియో ఎకనామిక్ అంశాలపై ఒకటో వేదికలో టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాలపైనా సదస్సులు జరుగుతాయి. భోజన విరామం అనంతరం ప్రధాన వేదికలో వికసిత్ భారత్‌కోసం ఏఐ రోడ్‌మ్యాప్, రెండో వేదికలో ఓపెన్ మైక్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఒకటో వేదికలో విజన్ 2047లో యువత అంశంపై, మూడో వేదికలో జపాన్‌కు చెందిన అభివృద్ధి అంశాలపై సదస్సులు జరుగుతాయి. ఇవి కాకుండా ఇండియా-జపాన్ విధానాలు, యుఏఇ, సౌదీ అరేబియా వంటి దేశాలతో పారిశ్రామిక అవగాహన వంటి అంశాలు చర్చకు వస్తాయి. ఇదే సమయంలో పలు వేదికల్లో పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడులు, ఒప్పందాలు వంటివి కూడా కొనసాగుతాయి. చివరిగా శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ముగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో భారత ఉప రాష్ట్రపతితోపాటు, పలువరు కేంద్ర మంత్రులు, సిఐఐ అధికారులు పాల్గొననున్నారు.

తొలిసారి ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించాలి

- కేబినెట్‌కు ముందు మంత్రులతో లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తొలిసారి గెలిచిన కొంత మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, వీరికి అవగాహన కల్పించాలని మంత్రులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. మంత్రివర్గ సమావేశానికి ముందు ఉండవల్లిలోని తన నివాసంలో ఉదయం సమావేశం నిర్వహించారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంచి, చెడు తెలియడం లేదన్నారు. అవగాహన రాహిత్యంగా ఉంటున్నారని, నియోజకవర్గాల్లో నేతలందరినీ సమన్వయం చేసుకోవడం లేదని చెప్పారు. సీనియర్ ఎమ్మెల్యేలతో వీరికి అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్త ఎమ్మెల్యేలు వరుస విజయాలు కొనసాగించాలంటే సీనియర్ల అనుభవాలు నేర్చుకోవాలని చెప్పారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని అంచనా వేశారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రతి మంత్రి తమ శాఖల పరిధి ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని వీలైనంత త్వరగా నెరవేర్చాలని ఆకాంక్షించారు.

ప్రధాని, రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీ సత్యసాయి శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తికి ఈ నెల 19న ప్రధాని మోడీ, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకలు నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సూచించారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. సత్యసాయి మహా సమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ నడపనున్నట్లు తెలిపారు. సమీక్షలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటల నివారణపై ఫోకస్

రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్ని ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఎస్‌ఓపిలు సిద్ధం చేసి వారం రోజుల్లోగా అందివ్వాలని ఆదేశించారు. ఆర్‌టిజిఎస్‌పై సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని చెప్పారు. నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించిన తర్వాతే చలానా విధించే అంశాన్ని పరిశీలించాలని అధికారులు ప్రతిపాదనలకు ఆయన సమాధానం చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని ఫోన్లకు సందేశాలు పంపాలని సూచించారు. ఆ తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘిస్తుంటే చలానాలు వేయాలని సూచించారు. ఈ విషయంలో కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు, డ్రెయినేజీలు, నీటి నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి కల్పన, పంటలకు మద్దతు ధర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి పార్థసారధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధక శాఖలో ఖాళీ యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఎహెచ్ఎ) పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సోమవారం ధర్నా జరిగింది. విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. దేశంలోనే పశుసంపదలో, పశుపోషణలో ముందున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. పశువులను రక్షించే విషయంలో అదేస్థాయిలో చొరవచూపాలని డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ పెరుగుతోన్న నిరుద్యోగం.. ప్రభుత్వం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి మంత్రివర్గ సమావేశంలో కార్పొరేట్లకు భూములను ధారాదత్తం చేయడానికి తప్ప నిరుద్యోగులకు అనుకూలంగా జిఓలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎహెచ్ఎ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని, లేదంటే పెద్దయెత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె రమేష్, విజయవాడ నగర అధ్యక్షులు శివ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన ప్రజాగొంతుక : సాహితీ స్రవంతి

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజాపాటకు పట్టంగట్టిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో ప్రజాగొంతుక మూగబోయిందని సాహితీ స్రవంతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్ పేర్కొన్నారు. పోరుపాటలతో ఊపిరిపోశారని, ఆయన మరణం పూడ్చలేనిదని పేర్కొన్నారు. అందె శ్రీ మరణం సాహితీ ప్రపంచాన్ని దుఃఖ సాగరంలో ముంచిందని పేర్కొన్నారు. పోరుపాటలతో ప్రజాఉద్యమాలకు ఊపిరిపోసిన మహాకవి అందెశ్రీని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విలేకరిపై దాడి చేసిన టిడిపి నాయకులపై కేసు నమోదు

- కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి - అనంతపురం యంత్రాంగం

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసిన టిడిపి నాయకులు నాగరాజు యాదవ్, అతని కుమారుడు హరీష్‌యాదవ్‌పై కేసు నమోదైంది. 118/1,126/2,351/2, రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద చిలమత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, విలేకరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పుట్టపర్తి, చిలమత్తూరు, పెనుకొండ, పరిగి, కొత్తచెరువు, నల్లచెరువు, లేపాక్షి, కదిరి, నంబులపూలకుంట, గాండ్లపెంట తదితర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. పుట్టపర్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాశక్తి జిల్లా ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. చిలమత్తూరులో తహశీల్దార్, పెనుకొండలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఆయా మండలాల్లో విలేకరులు నిరసనలు చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... విలేకరులపై దాడులు దారుణమన్నారు. ప్రజా సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలికితీసే విలేకరులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్షేత్ర స్థాయిలో కేంద్ర బృందం పర్యటన

మొంథా తుపాను వల్ల నష్టపోయిన పంటల పరిశీలన

ప్రజాశక్తి- యంత్రాంగం

మొంథా తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ప్రకాశం, కృష్ణా, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. రైతులను, అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొన్నుస్వామి నేతృత్వంలో సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీనివాస్‌బాల్రి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ అర్తీసింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా బృందం పర్యటించింది. పంట నష్టాలపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది.

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో కంకిపాడు-ఉప్పులూరు ప్రధాన రహదారి పక్కన కౌలు రైతులు పిడిగిడి భరత్ బాబు, తూముల శ్రీనివాసరావు సాగు చేసి ఎంటియు 1318 వరి రకం పంటను పరిశీలించింది. తాను 30 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేశానని, 80 శాతానికిపైగా పంట నష్టం వాటిల్లిందని కేంద్ర బృందం దృష్టికి తూముల శ్రీనివాసరావు తీసుకెళ్లారు. అనంతరం కేంద్ర బృందం గన్నవరం ఎంపిడిఒ కార్యాలయంలో మొంథా తుపాను నష్టాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను పరిశీలించింది. నష్టం వివరాలను కలెక్టర్ డికె.బాలాజీ కేంద్ర బృందానికి వివరించారు.

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామంలో కేంద్ర బృందం పర్యటించి రైతులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుంది. మండలంలో 860.73 ఎకరాల్లో వరి, 511.20 ఎకరాల్లో మినుము పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖాధికారులు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు రూ.1.20 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు.

ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం నారాయణపురంలో కుళ్లిపోయి, ఎండిపోతున్న వరి పంటను కేంద్ర బృందం పరిశీలించారు. రంగు మారిన ధాన్యాన్ని ఎలా కొనుగోలు చేస్తారు, ఎంతమేరకు తీసుకుంటారని పౌరసరఫరాల శాఖాధికారులను కేంద్ర బృందం ఆరా తీసింది.

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. మండలంలోని వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఎకరానికి రైతులు ఈ పాటికే రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారని, ఆ పంటలు దేనికీ పనికిరావని కేంద్రబందానికి కలెక్టర్ రాజాబాబు వివరించారు. కొత్తపట్నం మండలం, అల్లూరు గ్రామంలోనూ కేంద్ర బృందం పర్యటించింది. అల్లూరు గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించింది.

నిబంధనలు సడలించి బాధిత రైతులను ఆదుకోవాలి : మాజీ మంత్రి వడ్డే

తుపాను బాధిత రైతులను నిబంధనలను సడలించి ఆదుకోవాలని, దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో పర్యటించిన కేంద్ర బృందానికి ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

మొంథా తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

-వరికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి

కేంద్ర బృందానికి రైతు, కౌలు రైతు సంఘాల నేతల వినతి

మొంథా తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఎపి కౌలు రైతు, రైతు సంఘాల నేతలు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా పునాదిపాడు గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందానికి ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వినతిపత్రాలు అందజేశారు. 19 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ఐదు లక్షల మంది రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ఈ నేపథ్యంలో వరికి ఎకరానికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు కనీసం రూ.50 వేల చొప్పున సష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ మహాసభ

- వంద తీర్మానాలు ఆమోదం
- మూడోసారి అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా రవికుమార్

సంబరాలు చేసుకుంటున్న ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభ ఈ నెల 8వ తేదీన ప్రారంభమై సోమవారం ముగిసింది. చివరిరోజు ట్రెజరర్ రిపోర్టు ప్రవేశపెట్టారు. మూడేళ్ల సభ్యుల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఆర్థిక క్రమశిక్షణ పట్ల సభ్యులందరూ అభినందనలు తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. బ్యాంకు అధికారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి వంద తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించారు. ఈ తీర్మానాలను బ్యాంకు యజమాన్యంతో చర్చించి సఫలీకృతం చేయడానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ మాట్లాడుతూ ఎఐ టెక్నాలజీ తీసుకురానున్న మార్పులకు సిద్ధం కావాలని, తగు విధంగా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అసోసియేషన్‌లో క్రమశిక్షణ, కెనరా బ్యాంక్‌లో అభివృద్ధి తమ విధానమన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. తన పట్ల నమ్మకం ఉంచిన 50 వేల మంది సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నంలో ఇంత పెద్ద జాతీయ మహాసభ మూడు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించినందుకు రిసెప్షన్ కమిటీ చైర్మన్ రమాప్రసాద్‌ను, కమిటీ సభ్యులను అభినందించారు.

నూతన కార్యవర్గం

అసోసియేషన్ చైర్మన్‌గా జాకబ్, అధ్యక్షునిగా రాజీవ్ నిగం, జనరల్ సెక్రటరీగా కె రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవికుమార్‌కు సభ్యులందరూ అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

నటుడు జోష్ రవి తండ్రి మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పశ్చిమగోదావరి జిల్లా పెనమంట్ర మండలం మార్టేరుకు చెందిన టాలీవుడ్ నటుడు జోష్ రవి తండ్రి వడగం నాని పంతులు (66) సోమవారం ఉదయం గుండెపోటుతో తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పౌరోహిత్యం చేసే నాని పంతులుకు ఏకైక కుమారుడు రవి. నాని పంతులు మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

అదుపు తప్పిన ట్రావెల్స్ బస్సు

ప్రజాశక్తి - రాజుపాలెం (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం రెడ్డిగూడెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి బాపట్ల వెళ్తున్న మార్నింగ్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌తో పాటు ట్రావెల్ బస్సును రాజుపాలెం స్టేషన్‌కు తరలించారు. నిర్లక్ష్యం, అతివేగంతో బస్సు నడపడం వల్ల జరిగిన ప్రమాదం పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వలస కార్మికుని మృతదేహం వెలికితీత

- మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి పరిధిలోని రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణా నదిలో గల్లంతైన ఇద్దరు వలస కార్మికుల్లో నాగులపల్లి పవన్ గణేశ్వరరావు (22) మృతదేహాన్ని సోమవారం వెలికి తీశారు. మరో వలస కార్మికుడు పమిడిమర్రి దినేష్ ఆచూకీ కోసం ఎన్‌ఆర్‌డిఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. ఆదివారం సాయంత్రం పవన్ గణేశ్వరరావు, దినేష్ మరో ఇద్దరితో కలిసి రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగారు. వీరిలో ఇద్దరు గల్లంతవ్వగా, ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన వారి కోసం అప్పటి నుంచి గాలింపు చేపట్టగా పవన్ గణేశ్వరరావు మృతదేహాన్ని సోమవారం వెలికితీశారు. మృతునిది తూర్పుగోదావరి జిల్లా ఉప్పాలగుప్త మండలం చల్లపల్లి గ్రామం. దినేష్‌ది ప్రకాశం జిల్లా గిద్దలూరు. వీరు రాజధాని ప్రాంతం శాఖమూరు వద్ద హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్ నిర్మాణంలో కార్మికులుగా పనులు చేస్తున్నారు.

బస్సు నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్ దుర్మరణం

- బస్సును నిలిపేయడంతో విద్యార్థులు సురక్షితం

ప్రజాశక్తి - ఆలమూరు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

నారాయణరాజు ఫైల్

కళాశాల బస్సును నడుపుతుండగా గుండెపోటుకు గురై డ్రైవర్ మృతి చెందారు. బస్సును నిలిపేయడంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) రాజమహేంద్రవరంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలానే సోమవారం ఉదయం కొత్తపేట మండలంలోని గంటి గ్రామం వద్ద విద్యార్థులను ఎక్కించుకుని కళాశాలకు బయలుదేరారు. బస్సులో 50 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఈ క్రమంలో డ్రైవర్ గుండెపోటుకు గురయ్యారు. డ్రైవర్ వెంటనే బస్సు వేగాన్ని తగ్గించి రోడ్డుపైన నిలిపేసి స్టీరింగ్‌పై వాలిపోయారు. గుర్తించిన విద్యార్థులు హైవే పెట్రోలింగ్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గ మధ్యలోనే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఎడారిగా మారినా పట్టదా..?

- పాలకుల తీరుపై ఎంఎ గఫూర్ ఆగ్రహం
- ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం మహాధర్నా

కర్నూలు జిల్లా ఆదోనిలో భారీ ప్రదర్శన అగ్రభాగాన ఎంఎ గఫూర్, గౌస్ దేశాయ్ తదితరులు

ప్రజాశక్తి-ఆదోని

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఎడారిగా మారినా పాలకుల్లో చలనం లేదని సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ గఫూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదోని ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రజలు ఉద్యమించాలని, పాలకుల వైఖరిని ప్రశ్నించాలని, అప్పుడే కళ్లు తెరుస్తారన్నారు. పశ్చిమ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు పాదయాత్రలు, జీపుజాతాలు నిర్వహించారు. సోమవారం భీమాస్ హోటల్ నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోక వలసలకు కేంద్రంగా మారిందన్నారు. ఒకప్పుడు రెండో బొంబాయిగా నిత్యం కార్మికులతో కళకళలాడిన ఆదోని ప్రస్తుతం తన ఉనికి కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న పరిశ్రమలు మూతపడడమే కానీ కొత్తగా రావడం లేదన్నారు. ఆలూరు, హోళగుంద, చిప్పగిరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, ఆస్పరి, ఆదోని మండలాల ప్రజలు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వందల టిఎంసిల నీళ్లు వృథాగా సముద్రం పాలవుతున్నా పాలకుల్లో చలనం రావడం లేదని విమర్శించారు. హగరి నదిపై వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నాలుగు టిఎంసిలతో 80 వేల ఎకరాలకు సాగునీరు, 200 గ్రామాలకు పైగా తాగునీరు అందించడానికి అవకాశం ఉందన్నారు. నగరడోనా రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎందుకు పూర్తి చేయడం లేదని నిలదీశారు. కౌతాళం మండలం మేలిగనూరు నుంచి తుంగభద్ర నది ద్వారా వరద కాలువ నిర్మిస్తే సాగు, తాగునీటికి నీటిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం సర్వేలకే పరిమితమైందన్నారు.

ఈ ప్రాంతంలో సాగునీరు ప్రాజెక్టులు లేక, ఉపాధి లేక ప్రతేడాది దాదాపు ఐదు లక్షల మంది వలస వెళ్తున్నారని తెలిపారు. పాలకుల వైఫల్యమే ఇందుకు కారణమన్నారు. ప్రభుత్వ నిరాధారణతో ఆదోనిలో జిన్నింగ్, ప్రెస్సింగ్, ఆయిల్ మిల్లులు మూతపడి కార్మికులు వీధుల పాలయ్యారని తెలిపారు. దేశంలోనే నాణ్యమైన ఉల్లి, టమోటా పండించే భూమి, రైతులు ఈ ప్రాంతంలో ఉన్నారని, వారు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పెట్టిన ఖర్చు కూడా రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, నారాయణ, అంజిబాబు, సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

యూరియా కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి- మునగపాక (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రం మునగపాకలో యూరియా కోసం రైతులు రోజంతా నిరీక్షించాల్సి వచ్చింది. 220 బస్తాల వరకు యూరియా రావడంతో స్థానిక సచివాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున రైతులు, మహిళలు బారులు తీరారు. కంప్యూటర్ మొరాయించడంతో రైతులకు యూరియా పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. సుమారు 200 మంది రైతులు యూరియా కోసం క్యూ లైన్‌లో నిలబడగా, సాయంత్రానికి 100 మందికి మాత్రమే అందింది. మిగిలిన వారు సాయంత్రం వరకు వేచి చూచి వెనుదిరిగి వెళ్లిపోయారు. మంగళవారం మిగతా యూరియాను అందిస్తామని సచివాలయ అధికారులు తెలిపారు.

వైసిపి నాయకులపై వేధింపులు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నేతలను వేధించడమే ఏకైక అజెండాతో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏదో జరిగిపోతుందనే భావన కలిగించేలా ప్రచారం చేస్తున్నారని అన్నారు. కొంతమందిని పట్టుకుని వారిని బెదిరించి వైసిపి నాయకుల పేర్లు చెప్పిస్తున్నారని తెలిపారు. తిరుమతి లడ్డూ కల్తీ అయిందని తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. జంతువులు కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేశారని పేర్కొన్నారు. చిన్న అప్పన్న అనే వ్యక్తి వైవి సుబ్బారెడ్డి దగ్గర, అనంతరం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి వద్ద కూడా పనిచేశాడని పేర్కొన్నారు. వారందరినీ వదిలేసి సుబ్బారెడ్డిని టార్గెట్ చేశారని విమర్శించారు.

గోదాములను సిద్ధం చేసుకోండి

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు అనంతరం కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) నిల్వ కోసం అవసరమైన గోదాములను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులను పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి సోమవారం సమావేశమయ్యారు. గతేడాది కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడంతోపాటు ధాన్యం కొనుగోలులో చరిత్ర సృష్టించిందన్నారు. ఈ సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 21 లక్షల టన్నులు, ఎఫ్‌సిఐ 14 లక్షల టన్నులు కస్టమ్ మిల్డ్ రైస్ నిల్వ కోసం గోదాములు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. డ్రైయర్లు సౌకర్యాలు ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి గోదాము వద్ద నిరంతర నిఘా ఉండేలా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీ రైస్ మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సమారు 35 బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి ఢిల్లీరావు హాజరవ్వగా, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు, నాయకులు సత్యనారాయణరాజు, వీరయ్య, లలిత శ్రీనివాస్, పట్టాభి శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ సమ్మిట్‌ను డైవర్ట్ చేసేందుకు వైసిపి ధర్నా

- టిడిపి నేత విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు మాజీ సిఎం వైఎస్ జగన్ ప్రయత్నిస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి, బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. ఈ నెల 12న మెడికల్ కళాశాలల పిపిపి విధానంపై ధర్నాకు వైసిపి పిలుపునిచ్చిందని, తద్వారా పెట్టుబడులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఉన్నంతకాలం పెట్టుబడులను అడ్డుకోవడం జగన్ తరం కాదన్నారు. విశాఖ సదస్సులో అందరూ పాల్గొనాలని, పెట్టుబడులు పెట్టేవారిని వీలైతే ఘనంగా స్వాగతించాలని కోరారు.

కల్తీ నెయ్యిని ఉపయోగించి ఇంకా సమర్థించుకుంటారా? : పట్టాభిరామ్

రసాయనాలతో తయారుచేసిన నెయ్యిని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రసాదంలో ఉపయోగించి ఇంకా సమర్థించుకుంటారా? అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్.. వైసిపి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పనిచేసిన వైఎస్ జగన్ కుటుంబ సభ్యులు టిటిడి సొమ్మును దోచుకోవటమే కాకుండా ప్రసాదాన్ని కల్తీ చేశారని విమర్శించారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. పల్నాడు జిల్లా టిడిపి నేతలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు కొట్టేసింది. దీంతో హైకోర్టు ఆదేశాలను పిన్నెల్లి సోదరులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసులో ఇప్పటికే పిన్నెల్లి సోదరులకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది.

'శ్రీచైతన్య' విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పాఠశాల వారే చంపారంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- కుటుంబ సభ్యుల ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన విద్యార్థిని జస్వంతి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె (వైఎస్‌ఆర్‌జిల్లా)

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థిని కుటుంబ సభ్యులు కథనం ప్రకారం... తొండూరు మండలం పాలూరు గ్రామానికి చెందిన కల్లూరు రవిశంకర్‌రెడ్డి కుమార్తె కల్లూరి జస్వంతి హాస్టల్‌లో ఉంటూ శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. రోజుమాదిరిగానే సోమవారం ఉదయం స్టడీ అవర్‌లో 6.30 గంటలకు బాలిక తన హాస్టల్ రూమ్‌కు వెళ్లి గడియ పెట్టుకుంది.

చాలా సేపు తలుపు తీయకపోవడంతో తోటి విద్యార్థిని కిటికీలో నుంచి చూసింది. అప్పటికే రూములో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ జస్వంతి కన్పించడంతో కేర్‌టేకర్‌కు సమాచారం ఇచ్చింది. జస్వంతిని కిందికి దించి వెంటనే ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం తెలియజేసింది.

రిమ్స్ వద్ద ఉద్రిక్తత.. మృతదేహంతో ర్యాలీ

విద్యార్థి జస్వంతి మృతిపై ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యమే తమ బిడ్డను చంపిందంటూ తండ్రి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. జస్వంతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు స్ట్రెక్చర్‌పై మోసుకుని రిమ్స్ మెయిన్ రోడ్డుపై ర్యాలీగా వస్తుండగా మార్గ మధ్యలో పోలీసులు అడ్డుకుని వారిని నచ్చజెప్పి తిరిగి మృతదేహాన్ని మార్చురీకి తిరిగి పంపారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులను, బంధువులను పాఠశాల వద్దకు పోలీసులను తీసుకెళ్లి సిసి పుటేజ్‌ను పరిశీలించారు. సిసి పుటేజ్‌లో విద్యార్థిని ఉరేసుకుని చనిపోయినట్లు లేకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సిఐ బాల మద్దిలేటి తెలిపారు. పాఠశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

విద్యార్థిని మృతికి కారకులైన శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసలైన దోషులను పట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

జంట హత్యల కలకలం

- తల్లిని, తమ్ముడిని కత్తితో నరికి చంపిన వైనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో జంట హత్యలు కలకలం సృష్టించాయి. కన్న కొడుకే తల్లిని, తమ్ముడిని నిద్రలోనే నరికి చంపడం, ఆపై తానే పోలీసులకు ఫోన్ చేసి చెప్పడం తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకరపద్దయ్య వీధిలో గునుపూడి మహాలక్ష్మి (60), ఆమె కుమారులు శ్రీనివాస్, రవితేజ (33) నివాసముంటున్నారు. కరోనా సమయంలో మహాలక్ష్మి భర్త మృతి చెందారు. ఆ క్రమంలో వారు చేసే ఫైనాన్స్ వ్యాపారం దెబ్బతినడం, ఇతర కారణాల రీత్యా శ్రీనివాస్, రవితేజకు వివాహం కాలేదు. ఇటీవల శ్రీనివాస్ బయటకు వెళ్లినప్పుడల్లా ఎవరోకరితో గొడవ పెట్టుకుని రావడం పరిపాటిగా మారింది. దీంతో ఆయనను ఇంటిలో నుంచి బయటకు వెళ్లనీయడం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక గాఢ నిద్రలో ఉన్న తల్లి, తమ్ముడిపై శ్రీనివాస్ పైశాచికంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ విషయాన్ని సోమవారం తెల్లవారుజామున శ్రీనివాసే పోలీసులకు ఫోన్ చేసి తెలపడంతో బాహ్యప్రపంచానికి విషయం తెలిసింది. హత్యలు జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ సందర్శించారు. క్లూస్ టీం, పోలీస్ జాగిలం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ కరోనా సమయంలో తండ్రి చనిపోయిన తర్వాత శ్రీనివాస్ మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు ప్రాథమిక అంచనాకొచ్చినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి జైసూర్య, సిఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

13 నుంచి 15 వరకు ఎయు ఇంజనీరింగ్ తరగతుల రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ - 2025 నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం నుంచి 15వ తేదీ వరకు ఎయు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు తరగతులను రద్దు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె రాంబాబు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక అనుమతి ఇస్తున్నామని, వారు తమ గుర్తింపు కార్డులను చూపి బయటకు వెళ్లవచ్చని తెలిపారు. విద్యార్థినులు మద్దిలపాలెం గేటు గుండా బయటకు వెళ్లాలని, విద్యార్థులు పోలమాంబ ఆలయం పక్కన ఉన్న గేటు ద్వారా తమ గుర్తింపు కార్డులు చూపి బయటకు వెళ్లవచ్చని చెప్పారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులను విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విధులు నిర్వహించే సమయంలో ధరించాలని రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గుర్తింపు కార్డులు ధరించని వారిని వర్సిటీ ప్రాంగణంలోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎయు క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు తమ పరిధిలోని వారు తప్పనిసరిగా గుర్తింపు కార్డులను ధరించేలా చూడాలని రిజిస్ట్రార్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

హైకోర్టును ఆశ్రయించండి

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కెఎ పాల్‌కు సుప్రీం సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై హైకోర్టును ఆశ్రయించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్‌కు సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కెఎ పాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై హైకోర్టును ఆశ్రయించాలని ఈ సందర్భంగా కెఎ పాల్‌కు ధర్మాసనం సూచించింది. మీడియాలో ప్రచారం కోసం పిటిషన్లు దాఖలు చేస్తున్నారని కెఎ పాల్‌పై జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు.

యుఎస్ నుంచి పెరుగుతోన్న చమురు దిగుమతులు

- ట్రంప్‌నకు మోడీ దాసోహం
- హెచ్‌పిసిఎల్, ఎంఆర్‌పిఎల్ భారీగా దిగుమతి

న్యూఢిల్లీ : అమెరికా నుంచి భారత చమురు దిగుమతులు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలకు బెదిరి ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లను పెంచేలా చమురు కంపెనీలపై ఒత్తిడి తెచ్చారని ఇటీవలి వరుస గణంకాలు స్పష్టం చేస్తోన్నాయి. చౌకగా లభించే రష్యా చమురును తగ్గించుకోవడంతో పాటు యుఎస్ నుంచి దిగుమతులను పెంచేశారు. ప్రభుత్వ రంగ రిఫైనరీ సంస్థలైన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్), మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పిఎల్) సంస్థలు ఇటీవల 50 లక్షల బ్యారెళ్ల చమురును అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి కొనుగోలు చేశాయని రాయిటర్స్ వెల్లడించింది.

ఎంఆర్‌పిఎల్ జనవరి 1-7 కాలానికి గాను 10 లక్షల బ్యారెళ్ల చమురుకు ఆర్డర్ పెట్టింది. యుఎస్ వెస్ట్ టెక్సాస్, అబుదాబీ నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును హెచ్‌పిసిఎల్ కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ అమెరికా నుంచి భారత్‌కు గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని గరిష్ట స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో యుఎస్ వాటా 12 శాతానికి పెరిగింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 4.5 శాతంగా ఉంది. డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో యుఎస్ నుంచి భారత్ రోజుకు సగటున 5,68,000 బ్యారెల్స్ ముడి చమురును దిగుమతి జరిగింది. 2021 మార్చి తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరులో దిగుమతులైన 2,07,000 బ్యారెల్స్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ కావడం ఆందోళనకరం. ఇది ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గిందనడానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.

జియోకు బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్...!

- ఇంట్రా సర్కిల్ రోమింగ్‌కు ఒప్పందం

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్‌తో రిలయన్స్ జియో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జియో కవరేజీ లేని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోనుంది. ఈ ఇంట్రా సర్కిల్ రోమింగ్‌ను ప్రస్తుతానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వినియోగదారులకు జియో అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం జియో ఇంట్రా సర్కిల్ రోమింగ్ (ఐసిఆర్) రీఛార్జి ప్లాన్లను ప్రవేశపెట్టింది. 28 రోజుల గడువుతో వస్తున్న ఈ ప్లాన్ల ధరలను రూ.396, రూ.196గా నిర్ణయించింది. ఈ ప్లాన్లు జియో సిగ్నల్ పూర్తిగా లేని సందర్భంలో బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ను ఎంచుకున్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. ఇతర ప్రాంతాల్లోనూ ఈ ఐసిఆర్ సేవలను అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సిగ్నల్ సమస్యకు పరిష్కారంగా ఈ ఏడాది జనవరిలో ట్రాయ్ ఇంట్రా సర్కిల్ రోమింగ్ సదుపాయాన్ని ప్రకటించింది. దీంతో జియో, ఎయిర్‌టెల్, బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు తమ సొంత సెల్యులార్ టవర్ల పరిధిలో లేనప్పటికీ ఇతర టెలికం నెట్‌వర్క్‌లను వినియోగించుకోవడానికి వీలుంటుంది.

13 నుంచి టెన్త్ ఫీజు చెల్లింపు

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు ఈ నెల 13 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించే అవకాశం ఉందని వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు రాసే విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులలోపు రాసేవారు రూ.110 చెల్లించాలని తెలిపారు. వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలని పేర్కొన్నారు. వయసు మినహాయింపు కోసం రూ.300 చెల్లించాలని వెల్లడించారు. ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 3వ తేదీ వరకు, 10వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో, 15వ తేదీ వరకు అపరాధ రుసుం రూ.500లతో చెల్లించే అవకాశం ఉందని వివరించారు.

సాంకేతిక విజ్ఞానంతో పరిశోధనల్లో ప్రగతి

- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంకేతిక విజ్ఞానాన్ని సరైన విధానంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశోధన రంగంలో ప్రగతిని సాధించొచ్చని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 'ఫ్యాకల్టీ కోసం ల్యాబొరేటరీ పరికరాల ఆపరేషన్, మెయింటెనెన్స్'పై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డిపి ప్రోగ్రాం)-2025 డిసెంబరు 15 నుంచి 19 వరకు జరగనుంది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్రం, ముంబయిలోని వెస్టర్న్ రీజనల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ (డబ్ల్యూఆర్‌ఐసి), ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మధుమూర్తి ఉన్నత విద్యామండలి కార్యాలయంలో వైస్ ఛైర్మన్ విజయభాస్కరరావుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మధుమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోట్ల విలువ చేసే పరిశోధన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని విద్యా సంస్థల్లో ఉన్న ఖరీదైన పరికరాలు చిన్నపాటి లోపాల కారణంగా వాడుకలో ఉండటం లేదని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, సాంకేతిక సిబ్బందికి పరికరాల ఆపరేషన్, కాలిబ్రేషన్, నిర్వహణ, మరమ్మతులపై సమగ్ర శిక్షణ లభిస్తుందన్నారు. విజయభాస్కరరావు మాట్లాడుతూ.. ల్యాబొరేటరీ పరికరాల వినియోగ సామర్థ్యం, నిలకడతనం పెరుగుతాయని చెప్పారు. దీని ఫలితంగా శాస్త్రీయ విద్య, పరిశోధన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ దేవప్రసాద్‌రాజు, కో-ఆర్డినేటర్లు, పి చంద్రశేఖర్, పి చెంగయ్య, ఎం హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

SRIKAKULAM MUNICIPAL CORPORATION

Rc. No. 35/2025/E1 **Dt.11-11-2025**

Inviting Expression-of-Interest from the consultancies/agencies regarding Designs, Drawings and Preparation of DPR for the following work

Construction of modern building for Srikakulam Municipal Corporation office in Srikakulam town with commercial complex in ground floor and municipal administration office for two floors (FF + SF) with solar rooftop.

For any kind of queries, please contact the Municipal Engineer, O/o Srikakulam Municipal Corporation. **(Ph: 9000902338).**

Last date for submission of proposals/quotations from interested consultancies/agencies is on/before 20-11-2025 05:00 PM

Sd/- Commissioner
Srikakulam Municipal Corporation.

సంపాదకీయం

విదిలింపులతో సరి!

కేంద్రంలో బిజెపి సంకీర్ణం, రాష్ట్రంలో టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వాలు ఏర్పడితే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధిని మునుపెన్నడూ లేని విధంగా పరుగులు పెట్టిస్తామనగా, గడచిన ఏడ్నర్ధంలో ఆ హామీల ఆచరణ మచ్చుకైనా కనిపించదు. రాష్ట్ర అభివృద్ధి మాటలతోనో గాలిలో మేడలు కడితేనో జరిగిపోదు. అభివృద్ధి 'కల" సాకారం కావాలంటే విత్తం, చిత్తం.. రెండూ కావాలి. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధుల్లో భారీ కోతలు గోచరిస్తున్నాయి. కేంద్ర గ్రాంట్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.34,701 కోట్లు లభించగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో 30,333 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. సవరించిన బడ్జెట్‌లో 21,966 కోట్లకు తగ్గించారు. అంతకంటే తక్కువ 20 వేల కోట్లే వచ్చాయి. ఇక 2025-26 లో 32,234 కోట్లు వస్తాయని అంచనా వేయగా, రెండు త్రైమాసికాలకు కలిపి ఈ ఏడాది సెప్టెంబర్ చివరాఖరికి రాష్ట్రానికి అందినవి కేవలం 4 వేల కోట్లు. ఆర్నెల్లకు 50 శాతం గ్రాంట్లు రావాల్సి ఉండగా 12 శాతమే వచ్చాయి. కేంద్ర పన్నుల్లో వాటా విషయానికొస్తే 2023-24లో 45,710 కోట్లు అందినట్లు తుదిలెక్కల్లో తేలింది. 2024-25 బడ్జెట్‌లో తొలుత 50,474 కోట్లుగా అంచనా వేసి 52 వేల కోట్లకు సవరించారు. రూ.36,869 కోట్లు వచ్చాయి. ఇంకా తుది లెక్కలు రావాల్సి ఉంది. ఈ ఏడాది 57,566 కోట్లు వస్తాయని అతి అంచనా వేశారు. గతానుభవం రీత్యా అన్నేసి నిధులు కేంద్రం వదులుతుందా అనే సందేహం వస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరుల్లో కీలకమైనవి కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, పన్నుల్లో వాటా. రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొనే ఆదాయంలో గ్రాంట్ల వాటా 15 శాతం కాగా కేంద్ర పన్నుల్లో వాటా 26 శాతం వరకు ఉంటోంది. వీటిని పూర్తి స్థాయిలో రాష్ట్రానికి ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం బిగబడితే వీళ్లు చెబుతున్న 2047 నాటికి వికసిత భారత్, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలు ఏ విధంగా సిద్ధిస్తాయో ఈ ఆర్థిక మేధావులే సెలవివ్వాలి. కేంద్రం నుంచి నిధులు రాకపోవడం వలన ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఆగిపోతున్నాయి. చివరికి ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాల పంపిణీ నెలల పర్యంతం నిలిచిపోతోంది. కేంద్రం వైఖరితో రోజువారీ ఖర్చులు, ప్రభుత్వ నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం అప్పులకేసి, ప్రతి మంగళవారం ఆర్‌బిఐకేసి పరిగెత్తాల్సిన దుస్థితి నెలకొంది. రెవెన్యూ లోటు భారీగా పెరుగుతోంది. బడ్జెట్‌లో ఏడాది మొత్తమ్మీద అప్పుల ద్వారా రూ.80 వేల కోట్లు సమీకరించుకోవాలని అంచనా వేయగా అర్థ సంవత్సరంలోనే 63 వేల కోట్ల అప్పులు చేసింది. ఈ వాస్తవాలను కూటమి ప్రభుత్వం రాజకీయ విమర్శలతో కప్పెట్టేందుకు ఎంతగా ప్రయత్నించినా దాగేది కాదు.

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. రాష్ట్రంలో జనసేన, బిజెపి పార్టనర్స్‌గా టిడిపి కూటమి సర్కారే నడుస్తోంది. టిడిపి ఎంపీల మద్దతుపైనే ఎన్‌డిఎ సర్కార్ నిలబడిన పరిస్థితుల్లో ఎందుకు ఆ పార్టీ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కేంద్ర గ్రాంట్లు, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలు, పన్నుల్లో వాటా నిధులను మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి విదిలిస్తున్నా కూటమి పార్టీలు మౌనం పాటిస్తున్నాయి. కేంద్రం పోలవరానికి పూచీ పడకపోయినా, అమరావతికి బడ్జెట్ నిధులివ్వకుండా రుణాల వైపు ఎగదోలినా, విభజన హామీలపై తొండాట ఆడుతున్నా టిడిపి, జనసేన నోరు మెదపట్లేదు సరి కదా మోడీని, బిజెపిని ఆకాశానికెత్తి భుజకీర్తులు తగిలించడం నమ్మి ఓట్లేసిన ప్రజలను దగా చేయడమే అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయాలంటే విద్యుత్ సంస్కరణలు, ఇతర ఆంక్షలను మోడీ ప్రభుత్వం విధించినా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మారుమాట్లాడడంలేదు. రాష్ట్రాన్ని మొంథా తుపాన్ అతలాకుతలం చేసింది. రూ.6,500 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్రం నివేదిక ఇచ్చింది. తక్షణ సాయంగా 900 కోట్లిమ్మని ప్రాధేయపడింది. అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదు. కేంద్ర బృందాల పర్యటనల తర్వాత ఎంతిస్తుందో ఏమిస్తుందో ఎప్పటికిస్తుందో తెలీదు. బుడమేరు వరదలకు ఎంత అడిగితే ఎంతిచ్చిందో సంవత్సరం దాటినా పజిల్‌గా మిగిలిపోయింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపి కూటమి ప్రభుత్వం, ఎంపీలు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు మోడీ సర్కార్‌పై ఒత్తిడి చేసి నిధులు సాధించాలి.

మహనీయుల మాట



డబ్బుతో పరిష్కరించలేని సమస్యలు చాలా వున్నాయి. మనం పరిష్కరించాల్సిన సమస్యలు జీవితానికి, మానవాళి మనుగడకు సంబంధించినవి. ఈనాడు పుడమితల్లి ఎదుర్కొంటున్న సమస్యను మనం పరిష్కరించాలి. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయాలి.

- ఇవో మొరేల్స్,
బొలీవియా పూర్వ అధ్యక్షుడు.

మోడీ ప్రభుత్వం గారడీ - జిఎస్‌టి రేట్ల సవరణ



ప్రభాత్ పట్నాయక్

వస్తు, సేవల ఆధారిత పన్ను (జిఎస్‌టి) రేట్లలో చేసిన సవరణల గురించి మోడీ ప్రభుత్వం చాలా గొప్పలు పోయింది. ప్రభుత్వం ప్రదర్శించిన దయాగుణం గురించి దాని ప్రచార యంత్రాంగం ఓవర్‌టైం చేసి మరీ తెగ ప్రచారం చేసింది. సామాన్యుడికి చాలా అవసరం అయిన సమయం లోనే, అంటే పండుగల సీజన్ లోనే, అతగాడిమీద భారాన్ని మోడీ ప్రభుత్వం తగ్గించి ఏవిధంగా ఊరట కల్పించిందో వివరించే ప్రకటనలను గుప్పించింది. జిఎస్‌టి రేట్ల సవరణ వలన 390కి పైగా సరుకులు ఏవిధంగా చౌకగా లభిస్తున్నాయో తెలియజేస్తూ రకరకాల ప్రకటనలను ఢిల్లీ మెట్రో లోని ప్రతీ రైలు బోగీ ప్రదర్శించింది. ఆ ప్రకటనల మీద ప్రధాని మోడీ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాల చిత్రాలు ప్రముఖంగా కనిపించాయని వేరే చెప్పనక్కరలేదు. ఇక కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దీపావళి అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి ఏవిధంగా కనిపిస్తోందో పదే పదే ప్రకటిస్తూనే వచ్చారు. జిఎస్‌టి రేట్ల సవరణ వలన మోటారు వాహనాల ధరలు తగ్గిపోయి ఏయే బ్రాండ్ల కార్ల అమ్మకాలు ఎంతెంత పెరిగాయో వార్తాపత్రికలు కథనాలమీద కథనాలు గుప్పించాయి.

మహా అయితే, ఇదంతా పరిస్థితిని ఒకవైపు నుంచి చూపించే ప్రయత్నం మాత్రమే. దీనికి వున్న రెండో వైపును చాలా జాగ్రత్తగా కనపడనివ్వకుండా చూసుకుంటున్నారు. జిఎస్‌టి సవరణల ఫలితంగా ప్రభుత్వానికి తగ్గే పన్ను ఆదాయం గురించి, దాని పర్యవసానాల గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. కొంతమంది ప్రభుత్వ ఆర్థికవేత్తలైతే రేట్లు సవరించినందువలన జిఎస్‌టి ద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో తగ్గుదల పెద్దగా ఉండబోదని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. రేట్లు తగ్గినందువలన సరుకుల అమ్మకాలు పెరుగుతాయని, రేటు తగ్గినందువల్ల తగ్గే ఆదాయం కాస్తా అమ్మకాలు పెరగడం ద్వారా భర్తీ అయిపోతుందని వారు ప్రకటిస్తున్నారు. ఇది సాధ్యం కాదని దిగువ వివరణ స్పష్టం చేస్తుంది:

జిఎస్‌టి రేట్లు తగ్గించక ముందు ఒకానొక వస్తువు ధర రూ.100 ఉందని, దానిమీద 28 శాతం జిఎస్‌టి ఉండేదని అనుకుందాం. జిఎస్‌టి రేట్లు 28 నుంచి 18 శాతానికి తగ్గించినందువలన దాని అమ్మకం రేటు రూ.128 నుంచి రూ.118కి తగ్గుతుంది. అంటే 8 శాతం తగ్గింది. దీనివలన ప్రభుత్వానికి తగ్గిపోయే పన్ను ఆదాయం అమ్మకాలు పెరగడం ద్వారా భర్తీ కావాలంటే ఆ వస్తువు అమ్మకాలు 56 శాతం పెరగాలి. అలా పెరగాలంటే ఆ వస్తువుకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ 56 శాతం పెరగాలి. అంత మేరకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడం అనేది అసాధ్యం. అందుచేత ప్రభుత్వ ఆదాయంలో గణనీయంగా తగ్గుదల ఉండబోతుంది అన్నది ఎవరూ నిరాకరించలేని సత్యం.

ఒకవేళ పన్ను రేట్లు తగ్గినది ఎక్కువమంది ప్రజలు తరచూ కొనుగోలు చేసే వస్తువుల మీద అయివుంటే అప్పుడు పరిస్థితి వేరుగా ఉండే అవకాశం ఉండేది. ధరలు తగ్గినట్లు ప్రకటించగానే, ఆ సరుకులను అనేకమంది ఒక్కసారి అదనంగా కొనుగోలు చేస్తారు. అప్పుడు వాటి అమ్మకాలు పెరిగి ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయంలో "వెంటనే" తగ్గుదల ఉండదు. కాని ఒక్కసారి కొన్నప్పటికీ ఆ వస్తువులను ఉపయోగించడానికి కొంత సమయం పడుతుంది గనుక రేట్లు తగ్గిన వెంటనే జరిగిన స్థాయిలో వాటి అమ్మకాలు ఆ తర్వాత కాలంలో అదే స్థాయిలో కొనసాగవు. అప్పుడు ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుంది. అయితే ఈ తగ్గుదల వెంటనే కనిపించదు.

ప్రస్తుతం మోటారు వాహనాల అమ్మకాలు పెరిగినందువలన ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గకుండా యథాతథంగా కొనసాగుతుందన్న వాదన పూర్తిగా తప్పు. ప్రతీ ఏడూ వాటి అమ్మకాలలో పెరుగుదల రేటు ఇదే స్థాయిలో కొనసాగడం అసాధ్యం.

ప్రభుత్వానికి పన్ను ఆదాయం తగ్గినందువలన కలిగిన లోటును కేంద్రం, రాష్ట్రాలు పంచుకోవాల్సి వుంటుంది. దీనిగురించి తర్వాత చర్చిద్దాం. ప్రభుత్వానికి ఆదాయంలో కలిగే లోటును భర్తీ చేయడానికి అదనపు వనరులను కేంద్ర ప్రభుత్వం వెతుక్కోవాలి. సంపన్నుల మీద అదనంగా పన్ను విధించవచ్చు. కాని ఈ ప్రభుత్వం ఎంతసేపూ ఆ సంపన్నుల వల్లే "అభివృద్ధి" సాధ్యం అంటూ వల్లిస్తూ వాళ్ళని అన్ని రకాలుగానూ వెనకేసుకు వస్తుంది. అందుచేత ఆ సంపన్నుల మీద అదనపు పన్ను విధించే ఆలోచనే దానికి లేదు. ఇక మిగిలినది శ్రామిక ప్రజలు. వాళ్ళమీద అదనపు పన్నుల భారాన్ని మోపడం అంటే అప్పుడు జిఎస్‌టి రేట్ల సవరణ ఫలితంగా ప్రజల మీద భారం తగ్గిందని చేసుకుంటున్న ప్రచారం కాస్తా వొట్టి బూటకం అని తేలిపోతుంది. ఏది ఏమైనా ప్రస్తుతం ప్రభుత్వం శ్రామిక ప్రజలమీద అదనపు పన్ను భారం మోపే ప్రతిపాదన ఏదీ చేయలేదు.

ఇక ద్రవ్యలోటును పెంచే అవకాశం కూడా లేదు. కేంద్రమే కాదు, రాష్ట్రాలకూ అటువంటి అవకాశం లేదు. నిజానికి కేంద్రం ప్రస్తుతం తన ద్రవ్యలోటును ఇప్పుడున్న స్థాయికన్నా ఇంకా దిగువకు తగ్గించే ప్రయత్నంలో ఉంది. కనుక జిఎస్‌టి రేట్ల మార్పుల ఫలితంగా ప్రభుత్వం ఆదాయం తగ్గడం, దాని ఫలితంగా ప్రభుత్వం చేసే వ్యయం తగ్గడం అనివార్యం.

ప్రభుత్వ వ్యయంలో తగ్గుదల ఎక్కడెక్కడ ఉండే అవకాశం ఉంది? ప్రజా వైద్య సేవలకు, ప్రభుత్వ విద్యకు చేసే ఖర్చు తగ్గిపోయే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ రెండు రంగాలలోనూ పెద్ద స్థాయిలో ప్రైవేటీకరణ జరిగింది. ప్రభుత్వం ఈ రెండు రంగాలమీద చేసే ఖర్చు కూడా తగ్గింది. రాబోయే కాలంలో ఇది మరింత తగ్గుతుంది. అప్పుడు శ్రామిక ప్రజానీకం మరింత ఎక్కువగా ప్రైవేటు విద్య మీద, ప్రైవేటు వైద్యం మీద ఎక్కువ ఖర్చు చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది. దాని ఫలితంగా వారి కొనుగోలుశక్తి బాగా పడిపోతుంది. అంటే జిఎస్‌టి రేట్ల తగ్గింపు చేసి ప్రభుత్వం ప్రజలకు కుడి చేత్తో ఇచ్చినది కాస్తా ఎడం చేత్తో లాగేసుకుంటుందన్నమాట.

అంతటితో అయిపోలేదు. ఇప్పుడు జిఎస్‌టి రేట్ల తగ్గింపు వలన ప్రయోజనం లభించేది కేవలం సామాన్యులకు మాత్రమేనా? ఎంతమాత్రం కాదు. సంపన్న వర్గాలకూ ప్రయోజనం లభిస్తుంది. ఇప్పుడు మోటారు వాహనాల అమ్మకాలు బాగా పెరిగాయంటే ఆ ప్రయోజనం సంపన్నులకే వచ్చిందని కనిపిస్తోంది. కాని, అనివార్యంగా తగ్గనున్న ప్రభుత్వ వ్యయం వలన ఎక్కువగా దెబ్బ తినేది మాత్రం శ్రామిక ప్రజలే. వాళ్ళకి ప్రస్తుతం కాస్తంతగానైనా విద్య, వైద్య రంగాల్లో లభిస్తున్న ప్రభుత్వ సేవలు ఇంకా తగ్గిపోయి ప్రైవేటు సేవలను కొనుగోలు చేయలేని స్థితిలో పడిపోతారు. ఈ రెండు రంగాలే కాదు. పెన్షన్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు చెల్లించవలసిన కూలీ ఇప్పటికే బకాయి పడుతోంది. ఇకముందు ఇంకా ఎక్కువ బకాయి పడనుంది. అంటే జిఎస్‌టి రేట్లు సవరించినందు వలన శ్రామిక ప్రజానీకానికి ఒరిగిన ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ. ఇది సమాజంలో నెలకొన్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది.

జిఎస్‌టి రేట్లను తగ్గించినందువలన కొన్ని సరుకుల రేట్లు వెంటనే తగ్గుతాయి. దానిని ప్రజలకు చూపించవచ్చు. తన ఘనతగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవచ్చు. ప్రభుత్వ వ్యయం తగ్గిపోయి ప్రజల ఇబ్బందులు పెరిగేది దీని ఫలితంగానే అయినా దాని ఫలితంగా తలెత్తే వ్యతిరేకత వెంటనే కనిపించదు. ఒకవైపు సంపద అసమానతలను, పేదరికాన్ని పెంచే దిశగా జిఎస్‌టి రేట్లను తగ్గిస్తూనే...దానివలన నష్టపోయే పేదలకే ఏదో మహోపకారం చేస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అదే మోడీ ప్రభుత్వం చేస్తున్న గారడీ.

అయితే, మనం జిఎస్‌టి రేట్ల తగ్గింపును తప్పుబట్టాలా? అక్కరలేదు. కాని మనం నొక్కి చెప్పవలసిన విషయం ఇక్కడ ఒకటి ఉంది. జిఎస్‌టి రేట్ల తగ్గింపు వలన ప్రభుత్వానికి ఎంత ఆదాయం తగ్గనుందో, అంతే మోతాదులో సంపన్నుల మీద ఏదో విధంగా భారం పెంచి వారి నుంచి అదనంగా వసూలు చేయాలి. అప్పుడే జిఎస్‌టి తగ్గింపు వలన సామాన్యులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ నిర్ణయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదే. అటువంటి నిర్ణయం చేసే పరిస్థితి ఈ కేంద్ర ప్రభుత్వానికి లేదు. ఒకవేళ ఏమైనా పన్ను పెంచినా దానిని రాష్ట్రాలతో పంచుకునే పరిస్థితే లేదు.

అందువలన జిఎస్‌టి రేట్ల తగ్గింపు ఫలితంగా రాష్ట్రాల ఆదాయాలు మరింతగా తగ్గిపోతాయి. అంతేగాక విద్య, వైద్యం, పెన్షన్లు వగైరా సేవలకు పడే కోతలను ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకంగానే పరిగణిస్తారు. తమ రాష్ట్రాల బడ్జెట్‌ల ద్రవ్యలోటును పెంచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకి లేకుండా చేశారు. దీనంతటి పర్యవసానంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుంది.

జిఎస్‌టి రేట్ల సవరణ ప్రహసనాన్ని మొత్తంగా పరిశీలిస్తే రేట్లు తగ్గించిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కితే, ఆర్థిక అసమానతలు పెరిగి, సంక్షేమంలో కోత ప్రజలకు మిగులుతుంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతాయి. (స్వేచ్ఛానుసరణ)

జిఎస్‌టి రేట్లను తగ్గించినందువలన కొన్ని సరుకుల రేట్లు వెంటనే తగ్గుతాయి. దానిని ప్రజలకు చూపించవచ్చు. తన ఘనతగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవచ్చు. ప్రభుత్వ వ్యయం తగ్గిపోయి ప్రజల ఇబ్బందులు పెరిగేది దీని ఫలితంగానే అయినా దాని ఫలితంగా తలెత్తే వ్యతిరేకత వెంటనే కనిపించదు. ఒకవైపు సంపద అసమానతలను, పేదరికాన్ని పెంచే దిశగా జిఎస్‌టి రేట్లను తగ్గిస్తూనే... దానివలన నష్టపోయే పేదలకే ఏదో మహోపకారం చేస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అదే మోడీ ప్రభుత్వం చేస్తున్న గారడీ.

అయితే, మనం జిఎస్‌టి రేట్ల తగ్గింపును తప్పుబట్టాలా? అక్కరలేదు. కాని మనం నొక్కి చెప్పవలసిన విషయం ఇక్కడ ఒకటి ఉంది. జిఎస్‌టి రేట్ల తగ్గింపు వలన ప్రభుత్వానికి ఎంత ఆదాయం తగ్గనుందో, అంతే మోతాదులో సంపన్నుల మీద ఏదో విధంగా భారం పెంచి వారి నుంచి అదనంగా వసూలు చేయాలి. అప్పుడే జిఎస్‌టి తగ్గింపు వలన సామాన్యులకు ప్రయోజనం కలుగుతుంది.

నివాళి

మాయమైపోయిన అందెశ్రీ

అందెశ్రీ....
అక్షరం రాని వాడు
అక్షరాన్ని ఆయుధంగా చేసి
పాటని ప్రపంచీకరణపై తూటాలా పేల్చిన
యోధుడు

తెలుగునాట అక్షరాలు ఆయుధాలుగా
పేమి
తెలంగాణ వీణపై మ్రోగించిన
పోరాట పాటైనాడు అందెశ్రీ

కష్టజీవులు కడగండ్లను
కళ్ళారా చూసిన అందెశ్రీ
తెగువ చూపమన్నాడు
తేటతెనుగై నిలిచాడు.

మట్టిలో కవిత్వాన్ని సృష్టించి
చెమట పరిమళాన్ని అద్దినాడు
ప్రజల గొంతులో చైతన్య గానమై
శ్రమజీవుల గుండెల్లో దీపమై వెలిగినాడు
అందెశ్రీ...

గలగల పారే కృష్ణా...గోదావరి
ప్రాణవాయువులై పరిఢవిల్లాలని
పచ్చని పంటలతో తెలంగాణ
పల్లె కన్నీరు తుడవ కలగన్నాడు
ప్రజల కష్టాలు తొలగాలన్నాడు

మాయమైపోతున్న మనిషిని
తట్టిలేపాడు అందెశ్రీ...
సాహిత్య శిఖరమై వెలిశాడు
జై జైహే తెలంగాణ
జై జనని తెలంగాణ
గీతమై నిలిచాడు అందెశ్రీ...

- రెడ్డి శంకరరావు
సెల్ : 9494333511
విజయనగరం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

అభిప్రాయం

ప్రజలతో ఉన్నవారికే పగ్గాలు

న్యూయార్క్ నగరానికి పిన్నవయస్కుడైన జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం చాలా కోణాల్లో శుభ సంకేతం. అంతే కాదు. ఒక కొత్త చరిత్ర. వందేళ్ల తర్వాత అతి తక్కువ వయసులో ఎన్నికైన 34 ఏళ్ల ఆ యువకుడు ట్రంప్ విధానాలకు వ్యతిరేకం. దక్షిణాసియా మూలాలు, ఇంకా చెప్పాలంటే భారత మూలాలు కలిగి ఆ నగరంలో అత్యున్నత పదవికి ఎన్నికైన మొదటి వ్యక్తి. అక్కడి వాళ్లు ద్వేషించక పోయినా, అంతగా ఇష్టపడని మతానికి చెందిన వ్యక్తి. సంపన్నులు, పెట్టుబడిదారులు శాసించే రాజకీయ రంగంలో నిలదొక్కుకున్న సాధారణ పౌరుడు...వారికి రుచించని సామ్యవాద భావాలు కలిగిన, ప్రచారం చేసిన యువకుడు. ఇన్ని విశేషాలతో గెలవడమే కాదు 'ఆయన ఎన్నికైతే ఫెడరల్ నిధుల్ని న్యూయార్క్‌కు అందనివ్వనని' ప్రస్తుత అధ్యక్షుడు, ప్రత్యర్థి పార్టీ పెద్ద, ట్రంప్ నేరుగా భయపెట్టినప్పటికీ ప్రజామోదం పొందిన నాయకుడు. ఆయన గెలుపుతో అమెరికా పౌర సమాజం ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పదనాన్ని మరో మారు చాటింది. కొత్త తరహా రాజకీయాలకు, చైతన్యవంతులైన యువతకు ప్రజాస్వామ్య విధానంలో ఎప్పుడూ చోటు తగ్గదని నిరూపించింది. అత్యంత శక్తివంతుడైన అధ్యక్షుడు తన స్థాయి తగ్గించుకుని బెదిరింపులకు పాల్పడ్డా, ప్రజల ఆదరణ ముందు అవి తాటాకు చప్పుళ్ళుగానే మిగిలాయి. జోహ్రాన్ ప్రజలకు అవసరమైన విషయాలే ప్రచారంలో మాట్లాడాడు. ఎక్కువ మందికి తిండి, గూడు, ప్రజా రవాణా చార్జీలు తడిసి మోపెడైనందున, వాటిపై స్పష్టమైన హామీలిచ్చాడు. అందరినీ కలుపుకుపోయే ధోరణి చూపించాడు. ప్రత్యర్థి తప్పులెంచి వాదించాడు తప్ప అనవసర ప్రసంగాలు చెయ్యలేదు. నిధుల లేమి వల్ల ప్రచారంలో వెనకబడి పోకుండా, సామాజిక మాధ్యమాల్ని, నేరుగా ఓటర్లను కలిసే మార్గాల్ని ఎంచుకున్నాడు. వీటితో బాటు ప్రజలు కూడా డిసైడ్ అయ్యారు ట్రంప్‌కి హితబోధ అవసరం పడిందని. ఆయన విధానాల వల్ల పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఫెడరల్ షట్‌డౌన్ లు ప్రభావం చూపాయి. ఒక రకంగా స్థానికమైనా ఈ ఎన్నికలు ఆయనకి రెఫరెండం. మిగతా నగరాల్లో కూడా ఇదే తరహాలో ఎన్నికల ఫలితాలు ట్రంప్ పార్టీకి వ్యతిరేకంగానే ఉన్నాయి. పెట్టుబడిదారీ సమాజంలో సామ్యవాద భావాల యువకుడు గెలిచాడని పత్రికలు రాస్తున్నాయి. ప్రజల బాధలు వినే వాడే నాయకుడు. కొంచెం భరోసా ఇస్తే పట్టం కడతారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలోని అందం కూడా అదే.

-డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

'మిట్టల్'కు రాయితీలు - నిర్వాసితులపై నిర్బంధాలు

జి. కోటేశ్వరరావు

విశాఖ నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం విపరీత ప్రచారం చేసుకుంటోంది. తానోదే చేయబోతున్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తోంది. పెట్టుబడులు వరదలా ప్రవహిస్తున్నాయని చెప్పడానికి వివిధ రూపాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. చూపరులకు అందమైన నగరమనే చిత్రాన్ని చూపించేందుకు రహదారుల పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొని బతుకుతున్న వారి షాపులను తొలగించింది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్న విద్యా సంస్థలు, రియల్టర్లపై, పలుకుబడి కల్గిన పెద్దల ఆక్రమణలపై దయచూపి వదిలేసింది. ఈ ప్రేమ, కనికరం పరిశ్రమల భూసేకరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల పట్ల లేదు. పరిశ్రమాధిపతులను ఆకర్షించడడానికి, వారికి ఆర్థిక ప్రయోజనం కల్పించడానికి వేల కోట్ల విలువైన రాయితీలు ప్రకటించి, సదుపాయాలు కల్పిస్తోంది. పెట్టుబడిదారులను మెప్పించేందుకు తాజాగా కార్మికుల పనిగంటలను 8 నుంచి 10కి పెంచింది.

ఈ భాగస్వామ్య సదస్సులో కొత్త ఒప్పందాలు జరగనున్నాయి. ఇందులో ఎన్ని ఒప్పందాలు, ఎన్ని సంవత్సరాలకు కార్యరూపం దాల్చుతాయనే దానికి సమాధానం దొరకదు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు పనిలో పనిగా ఈ భాగస్వామ్య సదస్సు సందర్భంగా శంకుస్థాపన చేయనున్నారు.

రెండు దశల్లో రూ. 1,35,964 కోట్ల పెట్టుబడులతో 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల్గిన కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు మిట్టల్ ప్రకటించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మిట్టల్‌కు తొలి దశలో 7.3 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన కంపెనీ ఏర్పాటుకు 2,200 ఎకరాలు కేటాయించింది. రెండో దశలో మరో 3,800 ఎకరాలు ఇవ్వనుంది. నక్కపల్లి మండలం, పెదతీనార్ల, సిహెచ్‌ఎల్ పురం, ఉపమాక, రాజయ్యపేట, నర్సాపురం, ఎస్.రాయవరం మండలం గుడివాడలో బల్క్ డ్రగ్ పార్కుకు 1270.80 ఎకరాలు కేటాయించింది. వీటికి కేటాయించిన భూమి హక్కుదారులకు, యజమానులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించలేదు. అంతేకాదు, విశ్వవ్యాపితంగా కీర్తి సంపాదించిన ప్రభుత్వ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడానికి ముందుకురాని ప్రభుత్వం, ప్రైవేటు మిట్టల్ స్టీల్‌కు కోట్ల రూపాయల రాయితీలు ప్రకటించి, గనులు కేటాయించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

ఇవేగాక స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించింది. పదేళ్ల వరకు కిలో లీటర్ నీరు రూ.50 చొప్పున సరఫరా చేయడానికి అంగీకరించింది. 15 ఏళ్ల వరకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇ.డి) మినహాయింపు, కంపెనీ నిర్మాణ సామాగ్రి, అమ్మకాలపై వంద శాతం ఎస్‌జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ యూనిట్‌కు రూపాయి చొప్పున సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం 2024 అక్టోబర్ 18న జిఓ 76 విడుదల చేసింది. ఇవి కాకుండా మిట్టల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేందుకు పెట్టిన షరతులన్నింటికీ తలూపింది. మిట్టల్‌కు కేటాయించిన భూమిలో స్టీల్ కంపెనీ ఆధారిత యూనిట్లకు లీజుకు ఇచ్చుకొనే అవకాశం కూడా కల్పించింది.

రెండు దశల్లో కంపెనీలో 55 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం, ఆ ఉపాధిలో ఏ తరహా ఉద్యోగాలు ఎన్ని? ఇందులో స్థానికులు, నిర్వాసితులకు ఎన్ని? అనే స్పష్టత లేదు. స్థానికులకు 75 శాతం ఉపాధిపై ఎటువంటి హామీ ఇవ్వలేదు. మిట్టల్ స్టీల్ ఏర్పాటుపై పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ)లో స్థానికుల ఉపాధి ఊసే ఎత్తలేదు. ఇఐఎ నివేదికను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్నట్లు ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఆశ ఏ కోశానా కనిపించడం లేదు. 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల్గిన మిట్టల్ స్టీల్ ఉత్పత్తి దశలో కేవలం 800 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని పేర్కొంది. దీంతో ప్రభుత్వం చెబుతున్న ఉపాధి వట్టిదేనని తేలిపోయింది.

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించిన భూములకు చెందిన యాజమానులు, సాగుదారులకు పరిహారం చెల్లించడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రావడంలేదు. పరిహారం చెల్లించాలని అడిగే అవకాశం లేకుండా నిర్బంధ పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తోంది. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్య నియోజకవర్గం పాయకరావుపేట పరిధిలోని మిట్టల్ స్టీల్, బల్క్ డ్రగ్ పార్కులో భూములు, ఇళ్లు కోల్పోయి బాధపడుతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని గొంతు విప్పి మాట్లాడే హక్కు అక్కడ కరువైంది. ప్రభుత్వం భారీ సంఖ్యలో పోలీసులను దించి భయభ్రాంతులకు గురిజేస్తోంది.

చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్యపేట, అమలాపురం పంచాయతీ మూలపర్రలో ఇళ్ళు, సాగు భూములకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించలేదు. డి ఫారం, సాగు భూముల్లోని తోటలకు నష్టపరహారం జమచేయలేదు. సొసైటీ భూములకు పరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోంది. చెట్లకు నామమాత్రపు పరిహారం చెల్లించింది. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటోందని, ఇప్పటికే హెటిరో కాలుష్యంతో తమ జీవితాలు దెబ్బతిన్నాయని చెబుతున్న రాజయ్యపేట, పరిసర ప్రాంత మత్స్యకారుల గోడు ప్రభుత్వం ఆలకించడంలేదు. ఈ అనుభవాలతో బల్క్ డ్రగ్ పార్కు వద్దని మత్స్యకారులు కోరుతున్నారు. ఆందోళన చేస్తున్నారు. అయినా సాధారణ ప్రజల బతుకులు పట్టని ఈ ప్రభుత్వాలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం చట్టపరమైన నిబంధనలు పట్టించుకోవడంలేదు. పోలీసులను గ్రామాల్లో దించి తమ సమస్యలను బాహ్య ప్రపంచానికి చెప్పుకొనే వీలు లేకుండా ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ఈ పరిస్థితుల్లో నిర్వాసితులు, బాధితులు మరింత పట్టుదలతో ఐక్యతను ప్రదర్శించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకొనేందుకు బలమైన పోరాటాలు నిర్వహించాలి. యువత ఉపాధిపై స్పష్టమైన, లిఖితపూర్వక హామీ పొందాలి. కోల్పోయిన ఆస్తులకు పరిహారం సాధించాలి.

/ వ్యాసకర్త సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి,
సెల్:9490300010

ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మిట్టల్‌కు తొలి దశలో 7.3 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన కంపెనీ ఏర్పాటుకు 2,200 ఎకరాలు కేటాయించింది. రెండో దశలో మరో 3,800 ఎకరాలు ఇవ్వనుంది. నక్కపల్లి మండలం, పెదతీనార్ల, సిహెచ్‌ఎల్ పురం, ఉపమాక, రాజయ్యపేట, నర్సాపురం, ఎస్.రాయవరం మండలం గుడివాడలో బల్క్ డ్రగ్ పార్కుకు 1270.80 ఎకరాలు కేటాయించింది. వీటికి కేటాయించిన భూమి హక్కుదారులకు, యజమానులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించలేదు.

బకాయి జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

బకాయిపడిన ఆరు నెలల జీతాలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కుటుంబాలతో సహా దువ్వాడ విఎస్ఇజెడ్‌లోని సినర్జీస్ కంపెనీ కార్మికులు చేశారు. బకాయి జీతాలు చెల్లించాలని, బోనస్ ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు చట్టపరంగా రావలసిన హక్కుల్ని యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. బకాయి జీతాలు చెల్లిస్తామని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసు వద్ద సమావేశంలో యాజమాన్యం అంగీకరించి కూడా చెల్లించలేదని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక సమ్మిట్‌లు నిర్వహించి కంపెనీలు వస్తాయంటున్నారని, ఉన్న కంపెనీల్లో కార్మికులకు జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాడతామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి దాస్ మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోతే తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ కంపెనీలో 20 సంవత్సరాల పైబడి పని చేస్తోన్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోం దన్నారు. ఈ పోరాటానికి గాజువాక సిఐటియు నాయకులు లోకేష్, రాజు, ఐద్వా నాయకులు లక్ష్మి, కామేశ్వరి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

12వ తేదీకి ఏర్పాట్లు పూర్తి కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ఎయు ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు 12వ తేదీ సాయంత్రానికి పూర్తి కావాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కడా ఎలాంటి సమన్వయ లోపం రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు భాగస్వామ్యం కానున్నారని, పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సదస్సుకు ఈ నెల 12వ తేదీ రాత్రికే ముఖ్యమంత్రి నగరానికి చేరుకుంటారని చెప్పారు. 13న సిఐఐ, రాష్ట్రస్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని, ప్రాథమిక స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని, సాయంత్రం అతిథులతో కలిసి గాలా డిన్నర్‌లో పాల్గొంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకు డెలిగేట్ కిట్లను రిజిస్ట్రేషన్ సమయంలోనే అందజేయాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని స్పష్టం చేశారు. విఐపి, వివిఐపి పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేంజ్-1 డిఐజి గోపానాథ్‌జెట్టీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జివిఎంసి కమిషన్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు.

సెకన్ల వ్యవధిలోనే ఘోరం...

పేలుడుతో బీభత్సంగా మారిన సంఘటనా స్థలం, సహాయక చర్యల్లో పోలీసులు

- ఢిల్లీ బాంబు పేలుడు ఘటనలో ప్రత్యక్ష సాక్షులు

న్యూఢిల్లీ : ఎర్రకోట సమీపంలో కారు పేలుడుతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు ఛిద్రమై.. రోడ్డు, వాహనాలపై చెల్లాచెదురుగా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు తెలిపారు. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయని, సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోని దుకాణాల అద్దాలూ కూడా పగిలిపోయాయని తెలిపారు. ఇదంతా కేవలం సెకన్ల వ్యవధిలోనే జరిగిందని తెలిపారు. అమిత్ ముద్గల్ అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ ఘటన జరిగిన సమయంలో ఓ వ్యక్తితో మాట్లాడుతున్నానని.. అంతలోనే ఓ చేయి భాగం తన వెనుకే పడిందని చెప్పారు.

"ఘటనాస్థలంలో పరిస్థితి నమ్మశక్యంగా అనిపించలేదు. భారీ పేలుడు సంభవించింది. కొన్ని సెకన్లలోనే మంటలు, పొగతో ఈ ప్రాంతం నిండిపోయింది. అందరూ ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెట్టారు" అని ఘటనానంతర క్షణాలను అమిత్ ముద్గల్ గుర్తుచేసుకున్నారు. పలువురు బాధితులను అంబులెన్సుల్లోకి ఎక్కించేందుకు సాయం చేసినట్లు చెప్పారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఓ ఆటో డ్రైవర్ తన భయానక అనుభవాన్ని పంచుకున్నాడు. "నా ఆటో ముందు ఓ కారు ఆగి ఉంది. ఎలా జరిగిందో తెలియదు కానీ.. ఆ వాహనంలో ఏదో అకస్మాత్తుగా పేలింది" అని తెలిపారు. ఈ ఘటనలో అతడి తలకూ గాయమైంది. భారీ భవనాలు కూడా కంపించేంత స్థాయిలో పేలుడు తీవ్రత ఉందని ఓ దుకాణదారుడు తెలిపాడు. తాను నిలబడిన దుకాణం వణికిపోయిందన్నాడు. కిలోమీటరు దూరం నుంచే పేలుడు తీవ్రత అనుభవించినట్లు.. జామా మసీదు సమీపంలో పానీ పూరీ బండి నడుపుతున్న మనోజ్ అనే వ్యక్తి చెప్పారు. మన ఛాతీలోనే పేలుడు సంభవించిందా? అన్న స్థాయిలో చాలా పెద్ద శబ్దం వినిపించిందన్నాడు. ఘటనాస్థలంలో తెగిపోయిన చేతులు, వేళ్లు చూశానని.. ఆ దృశ్యం భయంకరంగా ఉందని మరో ప్రత్యక్ష సాక్షి ఇర్ఫాన్ చెప్పాడు. తోపుడు బళ్లు నడిపేవారు, టాక్సీ డ్రైవర్లు చిక్కుకుపోయినట్లు తెలిపారు. పేలుడు అనంతర దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

పోలీసుల అదుపులో కారు డ్రైవర్

భారీపేలుడు ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పేలుడు చోటు చేసుకున్న కారు పూర్వ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. హర్యానాకు చెందిన నదీమ్‌ఖాన్ పేరుతో ఈ కారు రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. హుండాయ్ ఐ20 కారులో ఈ పేలుడు జరిగినట్లుగా గుర్తించామని ఓ సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. ఘటన సమయంలో కారులో ముగ్గురు ఉన్నట్లు తెలిపారు. అయితే గాయపడిన వారి శరీరంలో ఎలాంటి పెల్లెట్ గుర్తించలేదని పేర్కొన్నారు. బాంబు పేలుడులో ఇది అసాధారణమని పేర్కొన్నారు.

దీనికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హుండాయ్ ఐ20 కారును తొలుత మహ్మద్ సల్మాన్ కొన్నారు. అనంతరం అది నదీమ్‌ఖాన్ అనే వ్యక్తికి విక్రయించినట్లు పోలీసులు చెప్పారు. గురుగ్రామ్ పోలీసులు సల్మాన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే మారుతి స్విఫ్ట్ డిజైర్ కారులో పేలుడు జరిగినట్లు కొంతమంది ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సాయంత్రం 6.52 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలో నిదానంగా వచ్చిన కారు రెడ్‌లైట్ వద్ద ఆగిందని, ఏం జరిగిందో తెలుసుకునేలోగా ఒక్కసారిగా పేలుడు జరిగినట్లు ఢిల్లీ నగర పోలీస్ కమిషనర్ వివరించారు. ఈ ఘటనలో సుమారు 24 మంది గాయపడ్డారు. 22 వాహనాలు ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నిన్న గగన కల్లోలం.. నేడు బాంబు పేలుడు..

న్యూఢిల్లీ : ఇటీవల ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఎటిసి)లో సమస్యలతో దాదాపు 300కు పైగా విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా ఈ ప్రభావం కనిపించింది. ఈ ఘటనను ఇంకా మర్చికపోక ముందే సోమవారం ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ఘటన జరిగింది. గగన కల్లోలానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జిపిఎస్) సిగ్నల్స్ స్పూఫింగ్ జరగడమేనని నిపుణులు ప్రాథమికంగా అంచనా వేసినా.. అధికారికంగా ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. కాగా, దేశ నిఘా వ్యవస్థే జిపిఎస్ స్పూఫింగ్ చేసి ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిజానికి గత కొన్ని రోజులుగా దేశంలో ఏదో ఒక చోట ఉగ్రవాదులు అరెస్టవుతున్నారు. జమ్మూకాశ్మీర్, హర్యానాల్లో ఏకంగా 300 ఆర్డీఎక్స్, 2,900 కిలోల అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థాలను పోలీసులు సీజ్ చేశారు. దీన్ని బట్టి.. ఉగ్రవాద చర్యలపై ముందుగానే నిఘా వర్గాలకు సమాచారం అందిందని, ఆ కుట్రలను భగ్నం చేసేందుకే జిపిఎస్ స్పూఫింగ్ చేపట్టారు. బాంబు పేలుళ్లకు యత్నించే ఉగ్ర మూకలకు జిపిఎస్ స్పూఫింగ్ కారణంగా తమ టార్గెట్ లొకేషన్‌ను ఎంచుకోవడంలో అడ్డుకట్ట వేసినట్లవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాటిలైట్ ఆధారిత జిపిఎస్ సిగ్నల్లను స్పూఫ్ చేయడం దాదాపుగా అసాధ్యమేనని కానీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్(సీఐ సెల్), భారత నిఘా సంస్థ(ఐబీ), మిలటరీ ఇంటెలిజెన్స్ వంటి సంస్థలు జీపీఎస్ స్పూఫింగ్ చేసే అవకాశాలున్నాయి. శత్రుడ డ్రోన్లు, నిఘా విమానాలను తప్పుదోవ పట్టించేందుకు, వాటిని దాడుల నుంచి నిరోధించేందుకు ఈ చర్యలు తీసుకుంటారని నిపుణులు చెబుతున్నారు. యుద్ధాల సమయంలోనే ఇలా స్పూఫింగ్ చేస్తుంటారని తెలుస్తోంది. శత్రు దాడుల నుంచి రక్షణ రంగ సంస్థలను కాపాడేందుకు కూడా ఓపెన్ సోర్స్ ట్రాప్ పేరుతో జిపిఎస్ స్పూఫింగ్ చేస్తారని తెలుస్తోంది.

విశాఖలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనతో విశాఖపట్నంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడానికి నగర పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో విశాఖలో భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో సోమవారం రాత్రి నగర వ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాలు, రద్దీ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో భద్రతను గణనీయంగా పెంచారు. ప్రయాణికుల లగేజీతో సహా అనుమానాస్పద వస్తువులను మెటల్ డిటెక్టర్లు బాంబు/డాగ్ స్క్వాడ్ బృందాల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నగర సరిహద్దులు, ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల వివరాలను పరిశీలించారు.

లాడ్జీలు, కొరియర్ కార్యాలయాలపై నిఘా

భద్రతా చర్యలలో భాగంగా, లాడ్జీలు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కొత్తగా బస చేస్తున్న వారి గుర్తింపు కార్డులు, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్గో సర్వీస్ సెంటర్లు కొరియర్ కార్యాలయాలలో పార్శిళ్ల వివరాలను నమోదు చేసుకొని, నిఘా పెట్టారు. నగర ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఎందుకీ వివక్ష..!

- మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లో జాప్యం ఎందుకు?
- రిజర్వేషన్లు లేకుండా ప్రాతినిధ్యం ఎందుకు ఇవ్వకూడదు?
- నియోజకవర్గాల పునర్విభజన ఎప్పుడు చేస్తారో చెప్పండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు రిజర్వేషన్లు లేకుండా పార్లమెంటులో ఎందుకు ప్రాతినిధ్యం కల్పించరని అడిగింది. దేశంలోనే అతిపెద్ద మైనారిటీలుగా మహిళలు ఉన్నారనీ, వారిపై ఎందుకీ వివక్ష అని నిలదీసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో ఆలస్యం, చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చట్టం అమలులో జాప్యంపై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. 'నారీ శక్తి వందన్ అధినియం'గా పిలవబడే మహిళా రిజర్వేషన్ చట్టం (రాజ్యాంగ 106వ సవరణ చట్టం) అమలులో ఆలస్యం, అందులోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత డాక్టర్ జయా ఠాకూర్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని న్యాయమూర్తి ఆర్.మహాదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. నియోజకవర్గాల పునర్విభజన కోసం ఎదురు చూడకుండా చట్టాన్ని అమలు చేయాలని జయా ఠాకూర్ తన పిల్‌లో కోరారు. ఈ మేరకు కేంద్రం నుంచి స్పందన కోరుతూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

33 శాతం రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలిపినా..

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, ఢిల్లీ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే ఈ చట్టానికి 2023 సెప్టెంబర్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ చట్టం తదుపరి జనగణన, ఆ తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అనంతరమే అమలు కానున్నది. చట్టం అమలును ఎందుకు ఆలస్యం చేస్తున్నారని పిటిషనర్ తరపు సీనియర్ అడ్వొకేట్ శోభా గుప్తా ప్రశ్నించారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా మహిళా ప్రాతినిధ్యం కోసం పిటిషనర్ కోర్టును ఆశ్రయించాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. "ఇది మహిళలకు రాజకీయ న్యాయం కల్పించడానికి ఒక ఉదాహరణ. రాజకీయ న్యాయం కూడా సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయాలతో సమానం, ముఖ్యమైనది. మహిళలు దేశంలోనే అతిపెద్ద మైనారిటీ. దేశ జనాభాలో వీరు 48.44 శాతంగా ఉన్నారు" అని జస్టిస్ బి.వి. నాగరత్న అన్నారు. మహిళా సాధికారతకు ప్రత్యేక చర్యలు, అనుకూలమైన నిబంధనలు తీసుకొచ్చేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(3) ప్రభుత్వానికి అధికారాన్ని కల్పిస్తుందని ఆమె వివరించింది. ఈ మేరకు కేంద్ర హోం, న్యాయ మంత్రిత్వ శాఖల ద్వారా కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

ట్రాన్స్‌జెండర్లు పిల్లలను ఎందుకు దత్తత చేసుకోలేరు !

- కేంద్రాన్ని ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు

చెన్నై : పిల్లలను దత్తత చేసుకోవడానికి ట్రాన్స్‌జెండర్లను (లింగ మార్పిడి చేసుకున్న వ్యక్తులను) ఎందుకు అనుమతించరో వివరించాలని మద్రాసు హైకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనిపై డిసెంబరు 4కల్లా సమాధానాన్ని తెలియచేయాల్సిందిగా కేంద్ర మహిళా, శిశుసంక్షేమ శాఖను ఆదేశించింది. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లను సమాజంలో పూర్తి స్థాయిలో కలుపుకుని పోవాలని, వారికి కూడా సమాజంలో చురుకైన భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వంపై చట్టబద్ధమైన ఒక బాధ్యత వున్న నేపథ్యంలో ఈ పరిస్థితి ఎందుకు వస్తోందో చెప్పాలని కోరింది.

చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాత్సవ, జస్టిస్ జి.అరుల్ మురుగన్‌లతో కూడిన ఫస్ట్ డివిజన్ బెంచ్ ఈ ప్రశ్న లేవనెత్తింది. హిందూ దత్తత, నిర్వహణా చట్టం, 1956లోని సెక్షన్ 7లోని ఫిమేల్ అన్న పదం దగ్గర ట్రాన్స్‌జెండర్ వుమన్ అని కూడా చేర్చాలని చెన్నైకి చెందిన బి.షామా పిటిషన్ వేశారు. పిల్లల దత్తతకు సంబంధించి కేంద్ర మార్గదర్శకాలను కూడా సవరించాలని కోరారు. కేవలం పురుషులు లేదా మహిళలు మాత్రమే పిల్లలను దత్తత తీసుకోవాలని భారతీయ చట్టాలు పేర్కొంటున్నాయని ఆ పిటిషనర్ తన పిటిషన్‌లో ఫిర్యాదు చేశారు. అసలు ఈ దత్తత చట్టాల్లో వారిని ఎందుకు, ఎలా మినహాయించారని చీఫ్ జస్టిస్ విస్మయం వ్యక్తం చేశారు.

హజ్ యాత్రకు 1.75 లక్షల మంది

- భారత్, సౌదీ అరేబియాల మధ్య ఒప్పందం

రియాద్ : భారత్, సౌదీ అరేబియాల మధ్య జిద్దాలో 2026 కోసం ద్వైపాక్షిక హజ్ ఒప్పందం జరిగింది. ఈ హజ్ కోటా కింద భారత్ నుంచి 175,025 మంది యాత్రికుల సంఖ్యను నిర్ధారించారు. సౌదీ అరేబియాకు అధికారిక పర్యటనలో ఉన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సౌదీ హజ్, ఉమ్రా మంత్రి తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్ రబియాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారతీయ యాత్రికుల సంక్షేమం, సౌకర్యాన్ని నిర్ధారించడానికి మిషన్, కాన్సులేట్ బృందాలు సౌదీ అధికారులతో సన్నిహిత సమన్వయంతో చేసిన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. రిజిజుతో పాటు అదనపు కార్యదర్శి (గల్ఫ్) అసీమ్ ఆర్. మహాజన్, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ (హజ్) రామ్ సింగ్‌లతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఉంది.

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923K12010PIC039179 యూనిట్ నం.301-315, 3వ అంతస్తు, ఎ వింగ్, 'కనకియ వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి తూర్పు, ముంబై-400093.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("యంఎహెచ్ఎఫ్ఐయన్")** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా **డిమాండ్ నోటీసు** జారీచేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 9తో చదువుతూ సదరు చట్టం లోని సెక్షన్ 13 (4) క్రింద అతను/ఆమెకి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువసంతకందారు ఇందులో దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా** స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని ఏవేని లావాదేవీలు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లోబడి ఉంటాయని తెలియపరుచుచున్నాము.

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/లోన్ అకౌంట్ నం./శాఖ	సృష్టింబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అసెట్ వివరణ	డిమాండ్ నోటీసు పంపిన తేది మరియు మొత్తం బకాయి	స్వాధీనతా తేది
1	తోట సంధ్యారాణి, తోట రవీంద్ర కుమార్/ MHL00310023668/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్- 521322, కృష్ణా జిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ, గుడివాడ మండలం, తట్టివర్రు గ్రామ పంచాయతీ ప్రాంతం, తట్టివర్రు గ్రామం, ఆర్.ఎస్.నం.281/1బి, ఎల్.పి.నం.1108, డో.నం.1-66, మూల్యాంకనం నం.66 ఆర్‌సిసి డాబా కలిగి ఉన్న రెసిడెన్షియల్ సైట్ పరిధి 145.2 చ.గ.లు. తూర్పు : పంచాయతీ రోడ్డు, పడమర : పాండుల శివకృష్ణ ఆస్తి, దక్షిణం : పంచాయతీ రోడ్డు, ఉత్తరం : దరం బాసవయ్య ఆస్తి.	14-07-2025 & Rs.497365/-	07-11-2025

తేది : 11.11.2025, ప్రదేశం : కృష్ణ — సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

స్వాధీనతా నోటీసు

ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్ : U67100MH2007PLC174759
రీటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం: ఈడెల్‌వీస్ హౌజ్, ఒయఫ్‌యఫ్ సి.ఎస్.టి రోడ్, కలిన, ముంబాయి 400098

అనుబంధం [రూల్-8(1)] స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

అయితే, ఇక్కడ పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ ఆస్తుల పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (చట్టం), 2002 కింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 లోని (నియమం 3) తో చదువుతూ సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని రుణగ్రహీత(లు)కు క్రింద పేర్కొన్న విధంగా డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ తరువాత, ఇక్కడ పేర్కొన్న అసైనర్, ఆర్థిక ఆస్తులను **ఎడెల్వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు** దాని స్వంతంగా/ఇక్కడ పేర్కొన్న ట్రస్ట్ ఆఫ్ ట్రస్టీగా (ఇకపై "ఇఎఆర్‌సి" గా సూచిస్తారు) కేటాయించారు. SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 5 ప్రకారం, **ఇఎఆర్‌సి** అసైనర్ స్థానంలోకి అడుగుపెట్టింది మరియు రుణగ్రహీత పొందిన ఆర్థిక సహాయానికి సంబంధించి ఇఎఆర్‌సి కి ఉన్న ఆర్థిక ఆస్తులు, అంతర్లీన భద్రతా ఆసక్తులు, హామీలు, ప్రతిజ్ఞలకు సంబంధించి అసైనర్ యొక్క అన్ని హక్కులు, శీర్షిక మరియు ఆసక్తులపై అడుగుపెట్టింది మరియు ఇఎఆర్‌సి సెక్యూర్డ్ క్రెడిటర్‌గా దాని అన్ని హక్కులను ఉపయోగిస్తుంది.
రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, క్రింద సంతకం చేసిన **ఎడెల్వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) కింద రూల్ 8 తో చదువుతూ అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి ప్రతి ఆస్తికి వ్యతిరేకంగా పేర్కొన్న తేదీన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది.

క్ర సం	అసైనర్ పేరు	ట్రస్ట్ పేరు	లోన్ ఖాతా నెం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేర్లు	డిమాండ్ నోటీసు మొత్తం మరియు తేది	స్వాధీనతా తేది	స్వాధీనతా స్థితి
3.	హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎసి 483	3067738	1) మెసర్స్ సాయి రైస్ ట్రేడర్స్ "(రుణగ్రహీత") 2) శ్రీ.గుంటుపల్లి రాజేష్ ("సహ-రుణగ్రహీత") 3) శ్రీమతి. గుంటుపల్లి నాగ సిరీషా (సహ-రుణగ్రహీత) 4) శ్రీ. గుంటుపల్లి వెంకటేశ్వరరావు (సహ-రుణగ్రహీత)	10.04.2024 & Rs.68,69,974.51	07.11.2025	భౌతిక స్వాధీనత

ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా బందరుపల్లి గ్రామ పంచాయతీ ప్రాంతం లో బందరుపల్లి గ్రామం డోర్.నం: 432/డి, ఎకరాలు.0-48 సెంట్లు. సైటు యొక్క విస్తీర్ణత 205 చ.గజాలు. డోర్.నం.403/బి, ఎకరాలు.0-26 సెంట్లు. సైటు యొక్క విస్తీర్ణత 91 చ.గజాలు. రెండు డోర్.నంలు భూమి ఆనుకొని ఉంది. ఈ స్థలం మొత్తం 296 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. డోర్.నం: 6-37, ఆర్‌సిసి దాబా ఇంటితో పాటు **సరిహద్దు: తూర్పు:** పాలకూరై బోసు కు విక్రయదారులు అమ్మిన స్థలం-56'-1/2 **దక్షిణం:** ముప్పల కామేశ్వరావు యొక్క సైటు-46'0", **పడమర:** విక్రయదారుల యొక్క మిగిలిన స్థలం:59'-1/2" **ఉత్తరం:** విక్రేతలు వదిలిపెట్టిన 5 అడుగుల వెడల్పు రోడ్డు-46'-0' ఈ సరిహద్దులోని విస్తీర్ణత 296 చ.గ.లు లేదా 257-08 చ.మీ.లు సైటు, అక్కడ వున్న ఆర్‌సిసి దాబా ఇంటితో సహా.

సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆకర్షించడమైనది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణంగా ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి **ఎడెల్వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్** ఛార్జీకి లోబడి ఉంటాయి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేదీ: 11.11.2025
సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

Edelweiss Asset Reconstruction

JM Financial
జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిఫై నంబర్ : U67190MH2007PLC74287
నమోదిత కార్యాలయం : 7వ అంతస్తు, సినెర్జీ, అప్పు సాహెబ్ మారత్ మార్గ్, ప్రభాదేవి, ముంబై-400025
సంప్రదించాల్సిన వ్యక్తి : 1. రమణారావు-984971633, 2. చందన్ సాఖల్కర్- 9820407168, 3. సింధూజ పిళ్లై-022-6224 1676, వెబ్‌సైట్ : www.jmfinancialarc.com

ఇ-వేలం విక్రయ నోటీసు- తదుపరి అమ్మకం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") యొక్క సెక్షన్ 5(1) (బి) క్రింద పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లోన్ పూల్ అసైన్ చేయబడిన (క్రింద పేర్కొన్న లోన్లతో సహా) అంతర్లీనతో కలిపి దానిపై క్రెడిట్ చేయబడిన సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌తో పాటు అన్నీ హక్కులు, టైటిల్ మరియు దానిపై వడ్డీ, జెఎమ్ఎఫ్ ఎఆర్‌సి (జెఎమ్)కి అనుకూలంగా అనుసరించి తేదీ 29 మార్చి, 2023 నాటి వైడ్ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ("అసైన్‌మెంట్ అగ్రిమెంట్") అనుసరించి (ఇక్కడ అసైనీగా సూచిస్తారు) జెఎమ్ఎఫ్ఎఆర్‌సి-అరణ్య-ట్రస్ట్ యొక్క ట్రస్టీ హోదాలో వ్యవహరిసుంది. అసైన్‌మెంట్/సర్వీస్ అగ్రిమెంట్ ప్రకారం అన్ని కార్యాచరణ మరియు విధానాల ప్రక్రియలను సులభతరం చేయడానికి సర్వీస్ ప్రొవైడర్/కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించడానికి పిసిహెచ్ఎఫ్ఎల్‌కి అధికారం ఉందని మరియు నియమించబడిందని తెలియజేయడం.
సర్ఫేసీ యాక్ట్, 2002 క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా ఇక్కడ క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ని రుణగ్రహీత/ల నుండి బకాయిల రికవరీ కొరకు **'ఎక్కడ ఉందో అక్కడే", "ఆధారం ఏమిటి" మరియు "ఏది ఉందో అదే"** ప్రాతిపదికన స్వాధీనం చేసుకోవడం జరిగినది. స్థిరాస్తి కొనుగోలు కొరకు దిగువసంతకందారు ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరాలు దిగువ విధంగా ఉన్నవి :

లోన్ కోడ్/శాఖ/రుణగ్రహీత(లు)/ సహ రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా- ఫైనల్.	రిజర్వు ధర	బయానా మొత్తం (ఇఎమ్‌డి) (10 శాతం ఆర్‌పి)	బకాయి మొత్తం (07.11.2025)
లోన్ కోడ్ నం.: 02400006135 విజయవాడ (శాఖ), జేమ్స్ రంప (రుణగ్రహీత), సుకన్య రంప (సహ రుణగ్రహీత1)	తేది : 29.06.2021, రూ. 29,00,265/- (ఇరవై తొమ్మిది లక్షల రెండు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే)	ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఉన్న పరిధి : షెడ్యూల్ ఆస్తి : కృష్ణాజిల్లా మరియు సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధి, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.559/1 లో కవర్ చేయబడిన "సాయి మహాలక్ష్మి రెసిడెన్సీ" యొక్క రెండవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎస్-1 తో ప్లింత్ ఏరియా 1200 చ.అ.లు. సాధారణ ఏరియా 100 చ.అ.లు. మరియు పార్కింగ్ ఏరియా 100 చ.అ.లు. సైట్ అవిభక్త మరియు పేర్కొనబడని పరిధి 35 చ.గ.లు., బయట 330 చ.గ.లు. ఉన్న హద్దులు : అంశం నం.1 (స్థలం సరిహద్దులు) : తూర్పు : అల్లం నూకాలమ్మ ఫ్లాట్ నం.42 ఆస్తి, దక్షిణం : ఫ్లాట్ నం.50 ఆస్తి, పడమర : వారణసి సురేష్ ఫ్లాట్ నం.44 ఆస్తి, ఉత్తరం : 33 అ.లు. రోడ్డు. అంశం నం.2 (ఫ్లాట్ సరిహద్దులు) : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్, మెట్లకేస్ మరియు లిఫ్ట్. సరిహద్దులు : ఉత్తరం : కామన్ కారిడార్ మరియు మెట్లకేస్, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై	రూ. 27,00,000/- (ఇరవై ఏడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 2,70,000/- (రెండు లక్షల డెబ్బై వేల రూపాయలు మాత్రమే)	రూ. 52,52,873/- (యాభై రెండు లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది : 28.11.2025, ఉ॥11.00గం.ల నుండి మ॥1.00గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో),
బిడ్ సమర్పణకు చివరి తేది : 27.11.2025, సా॥ 4.00గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు, దయచేసి అమ్మకం కొరకు అందించబడిన లింక్ https://www.jmfinancialarc.com/Home/Assetsforsale లేదా https://www.bankauction.in ని చూడండి.
సర్ఫాసీ యాక్ట్ క్రింద రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు చట్టపరమైన 15 రోజుల అమ్మకం నోటీసు
పైన పేర్కొన్న రుణగ్రహీత/హామీదారు సెక్షన్ 13(2) నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని వేలం తేదికి ముందు వరకు వచ్చిన వడ్డీతో పూర్తిగా చెల్లించాలని గమనించగలరు, విఫలమైతే ఏ ఆస్తిని వేలం వేయబడుతుంది/విక్రయం చేయబడుతుంది మరియు బకాయిలు ఏదైనా ఉంటే, రుణగ్రహీత/హామీదారుల నుండి వడ్డీ మరియు ఖర్చుతో తిరిగి పొందబడుతుంది.
తేది : 11 నవంబరు, 2025,
ప్రదేశం : విజయవాడ
సం/- (అధీకృత అధికారి)
(అరణ్య-ట్రస్ట్)

Chola — Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం : "చోలా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
శాఖా కార్యాలయం : డో.నం.59-14-2ఎ, 1వ అంతస్తు, శాంతి ప్లాజా, గాయత్రి నగర్, విజయవాడ-520008.
సంప్రదించాల్సిన నెం.: శ్రీ. తియగరాజన్, మహమ్మద్ రహీస్ , మొబైల్ నం.- 8124000030 / 6374845616

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు. దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టినట్లు సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ తాకట్టు పెట్టిన వారు (లు)కి నోటీసు ఇవ్వబడింది, **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి **భౌతికంగా స్వాధీనం** తీసుకున్న దాన్ని ఇకపై **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా** ఇక్కడ సూచించబడుతుంది. తాకట్టు ఆస్తులు **"ఏది ఉంటే అదే" "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఎక్కడ ఉన్నాయో అక్కడే"** పద్ధతిలో ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి. బహిరంగ ఈ-వేలం ను మేము వెబ్‌సైట్ **https://bankauctions.in/** ద్వారా నిర్వహించబోతున్నామని దీని ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయడం జరిగింది.

క్ర. సం.	అకౌంట్ నం. మరియు రుణగ్రహీత, సహ రుణగ్రహీత, తనఖాదారుల పేరు	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం మరియు తేది	ఆస్తి/ఆస్తుల వివరణ	రిజర్వు ధర / బయానా మొత్తం / బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం
1	లోన్ అకౌంట్ నం.లు.: HE01GUN00000028215 1) రవి రాజ తాళ్లూరి, 2. మోషె తాళ్లూరి, 3. మస్తానమ్మ తాళ్లూరి, 4. రవి తేజ తాళ్లూరి, 5. డి.ఎన్. కన్‌స్ట్రక్షన్స్ అందరి నివాసం : 1-99, మెయిన్ రోడ్డు, పిఠాపురం, మెరికపూడి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522549.	06-12-2024 & Rs.24,50,354/- as on 06-12-2024	నరసరావుపేట ఆర్.డి., ఫిరంగిపురం ఉపజిల్లా, ఫిరంగిపురం మండలం, మెరికపూడి గ్రామ పంచాయతీ, మెరికపూడి గ్రామం, సర్వే డో.నం.40-బి, వార్డు-1 వద్ద ఉన్న బేరింగ్ స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.1-99 విస్తీర్ణం 220-5 చ.గ.లు. **సరిహద్దులు : 160 ఆర్‌సిసి చ.అ.లు. 160 ఎసిసి చ.అ.లు., ఉత్తరం :** బజారు సైట్, **తూర్పు:** తాళ్లూరి కోటయ్య మిగిలిన సైట్, **దక్షిణం :** ప్రత్తిపాటి మారియకుమరియమ్మ, **పడమర :** తాళ్లూరి శశాంక (భౌతిక స్వాధీనత)	Rs.24,10,000/- / Rs.2,41,000/- / Rs.50,000/-
2	లోన్ అకౌంట్ నం.లు.: HE01GUN00000046327 1) వెంకటేశ్వర్లు నాగండ్ల, 2. వెంకటరమణ నాగెండ్ల, ఇరువురి నివాసం : డో.నం.1-149-4, రేంజర్ గారి బజారు, రెంట చింతల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421. 3. శ్రీ లక్ష్మి గణపతి సిమెంట్స్, డో.నం.10-125, మెయిన్ రోడ్డు, రెంటచింతల, రెంటచింతల మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522421.	08-10-2024 & Rs.37,84,517/- as on 08-10-2024	నరసరావుపేట ఆర్.డి., గురజాల ఉపజిల్లా, రెంటచింతల గ్రామ పంచాయతీ, రెంటచింతల గ్రామం, సర్వే డో.నం.357/ఏ/2బి, బ్లాక్ 1 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగాలు మరియు పార్శిల్ డో.నం.1-149/4 ఖాళీ సైట్ పరిధి 142-9 చ.గ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు. **హద్దులు : తూర్పు :** బజారు 16-09 అ.లు., **దక్షిణం :** దొరనాల అనంతరావమ్మ లోగిలి 70-03 అ.లు., **పడమర :** కొమ్మారెడ్డి చలమరెడ్డి సైట్ 19-03 అ.లు., **ఉత్తరం :** చాపరపు శ్రీనివాసరెడ్డి లోగిలి 72-6 అ.లు. (భౌతిక స్వాధీనత)	Rs.35,90,000/- / Rs.3,59,000/- / Rs.50,000/-

ఇ వేలం తేది మరియు సమయం : 28.11.2025, ఉ.11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (ఒక్కొక్కటి 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది : 27.11.2025 (సా.5.30గం.ల వరకు) తనిఖీ తేది : 24.11.2025 మరియు 25.11.2025 (ఉ.10.00గం.ల నుండి మ. 1.00గం.ల వరకు)

1.ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ వెబ్‌సైట్ https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices ను సందర్శించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. ఇ-వేలం వివరాలు, సహాయం, ప్రక్రియ మరియు ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డర్లు సంప్రదించవచ్చు సంప్రదించాల్సిన వ్యక్తి : శ్రీ. మహమ్మద్ రహీస్- ఫోన్ నం.8124000030/ 6374845616, మెసర్స్.4 క్లోజర్.; రేఖ, ఫోన్ నెం.8142000062, ఇ మెయిల్ : CholaAuctionLAP@chola.murugappa.com.
2. నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం ఇ-వేలంలో పాల్గొనడానికి https://bankauctions.in & www.cholamandalam.com/news/auction-notices ని దయచేసి సందర్శించండి.
సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద ఇది చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు కూడా

తేది : 11.11.2025, ప్రదేశం : గుంటూరు జిల్లా — సం/- అధీకృత అధికారి, చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

జలవనరుల పరిరక్షణకు కృషి

- వర్షపు నీటిని ఒడిసి పట్టి ప్రజల జీవనాధారం పెంచాలి
- వాటర్‌షెడ్ మహోత్సవ్ సదస్సులో కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

సమావేశంలో ప్రసంగిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో జలనరుల పరిరక్షణకు అన్ని స్థాయిల్లో కృషి జరగాలని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న వాటర్ షెడ్ మహోత్సవ్ మూడవ జాతీయ సదస్సును గుంటూరు వెల్కమ్ గ్రాండ్ హోటల్లో సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ.. వాటర్ షెడ్ పథకాల అమలు ప్రాధాన్యతను నొక్కి చెపుతూ కరువు తాండవించే ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యత అవసరమన్నారు. ప్రతి ఏడాది కనీసం 25 వేల వరకు చెరువులు పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, అవగాహనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, జీవనోపాధులకు బాటలు వేయవచ్చని వివరించారు. దేశంలో జులై నుంచి సెప్టెంబర్ వరకు మంచి వర్షాలు కురుస్తాయని, ఆ వర్షపు నీటిని ఒడిసి పట్టి అభివృద్ధికి, జీవనోపాధికి అడుగులు వేయాలని సూచించారు. ప్రతి ఏడాది 1700 క్యూబిక్ మీటర్ల నీటి అవసరం ఉందని గుర్తించామని, అంతకంటే తక్కువ నీరు ఉంటే నీటి కొరతగా పరిగణిస్తామని తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవడం వల్ల వివిధ రంగాల్లో ఆరు రెట్ల ఉత్పాదకత సాధించవచ్చని వివరించారు. రెండు, మూడు పంటలు వేసుకునే అవకాశం ఉందని, భూగర్భ జలాలు కనీసం మూడు మీటర్ల పెరుగుదల ఉంటుందని అన్నారు. 2021 నుంచి 2026 వరకు వాటర్ షెడ్ 2.0ను రూ.13 వేల కోట్లతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం సమీకృత విధానంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు మేధో మదనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ సంస్కరణల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్ కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణ తేజ తదితరులు పాల్గొన్నారు.

మీడియా రిలేషన్ పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

రెండేళ్ల కాలానికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

- మీడియా రిలేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026-27 సంవత్సరాలకు అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను సచివాలయంలో సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ప్రారంభించారు. గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో నూతన అక్రిడిటేషన్లు జారీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐఅండ్‌పిఆర్ కమిషనరు విశ్వనాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్‌కు అర్హులైన మీడియా ప్రతినిధులందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్‌లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలను మంగళవారం విడుదల చేస్తామన్నారు.

రాష్ట్రంలో 'ఆర్‌వైఎస్'

- భూమి కేటాయించాలని కేంద్రం లేఖ : మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 'అపెక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి (ఆర్‌వైఎస్)ను కేంద్రం ఏర్పాటు చేయనుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రూ.750 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇన్‌స్టిట్యూట్‌కు 40 ఎకరాలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రానికి లేఖ రాసిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం ద్వారానే ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ యోగా అండ్ నేచురోపతి (మినిస్టరీ ఆఫ్ ఆయుష్) ద్వారా ఏర్పాటుకానున్న ఈ ప్రముఖ విద్యా సంస్థలో యుజి (బ్యాచ్‌లర్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగా సర్జరీ)లో తొలి ఏడాది వంద సీట్లు, పిజిలో 20 సీట్ల చొప్పున భర్తీ అవుతాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా 450 పడకలతో అన్ని రకాల వసతులతో నేచురోపతి ఆస్పత్రి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, నడింపాలెం సమీపంలో రూ.100 కోట్లతో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, నేచురోపతి సంస్థను ఏర్పాటు చేయబోతుందని తెలిపారు.

కాఫీ కార్మికుల సమస్యలపై చర్చలు విఫలం

- కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి- చింతపల్లి (అల్లూరి జిల్లా)

కాఫీ కార్మికుల సమస్యలపై సోమవారం చర్చలు విఫలమయ్యాయి. దీంతో, సమ్మె కొనసాగుతుందని యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. కాఫీ కార్మికుల సమస్యలపై పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గత నెల పదిన సంస్థ యాజమాన్యానికి కార్మికులు అందజేశారు. దీనిపై ఎటువంటి స్పందనా లేకపోవడంతో ఈ నెలలో సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో సోమవారం యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. చర్చల్లో యూనియన్ ప్రతినిధులు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. మూడు నెలల్లోపు కిందస్థాయి సిబ్బందిని నియమిస్తామని గత సంవత్సరం ఆర్‌ఎం సమక్షంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నియామకాలు జరగకపోవడం విచారకరమన్నారు. ఈ అంశం ఎమ్‌డి దృష్టిలో ఉందని చెప్పడం తప్ప యాజమాన్యం ఏ చర్యా తీసుకోలేదని విమర్శించారు. కింద స్థాయి ఉద్యోగులను నియమించకపోతే సంస్థ పరిరక్షణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. విడిఎ కరువు భత్యం పాయింట్లకు అనుగుణంగా రోజుకూలి రేట్లు, కేజీ పండ్ల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై యాజమాన్యం జిఒ వచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటామనే తీరుతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్మినెంట్ క్వార్టర్ల మరమ్మతులు కేవలం ప్రతిపాదనలే ఉన్నాయని, ఎక్కడా అమలు జరగలేదని యూనియన్ నేతలు ఆక్షేపించారు. సంస్థ రక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారమే తమ సమ్మె లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఎపిఎఫ్‌డిసి డివిజనల్ మేనేజర్ (పాడేరు) కృష్ణబాబు, చింతపల్లి డివిజనల్ మేనేజర్ రత్న దీపిక, త్రిమూర్తులరెడ్డి (ఆర్వీ నగర్), సత్యం (నర్సీపట్నం), పూర్వ డిఎం మహేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, కాఫీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎల్. సుందరరావు, జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, కాఫీ కార్మిక సంఘం నాయకులు రాజు, మోరి వెంకటగిరి, హెల్పర్ల సంఘం ప్రతినిధులు రాజారావు, ఆర్ముగం, కనకవల్లి, కాంతమ్మ, వెంకటేష్, సింహాచలం, బాలకృష్ణ, సుందర్ కుమార్ పాల్గొన్నారు.

బిసిలకు ప్రాధాన్యత : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసిలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని అమరావతి కురుమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రాన్ని సంఘం నాయకులు అందజేశారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. త్వరలో అమలు చేయనున్న ఆదరణ 3.0లో కురుమలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యాన స్వయం ఉపాధి పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నామని, ఈ అంశంలోనూ కురుమలకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు మర్రి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సేవలపై ఐటిడిఎలో కంట్రోల్‌రూం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వైద్య ఆరోగ్య సేవలకు ఎలాంటి సమస్యనైనా ఫిర్యాదు చేయడానికి ఐటిడిఎ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గిరిజన గ్రామంలోనైనా అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందడానికి, గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులు ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడానికి కంట్రోల్ రూం సూచనలు చేస్తుందని చెప్పారు. వైద్య సేవలపై సలహాలు పొందడానికి కంట్రోల్ రూం నెంబర్ 9491472982కి ఫోన్ చేయాలని కోరారు.

లెక్కాలేదు..జమాలేదు

- పనులెక్కడో తెలియదు.. డబ్బులు మింగేశారు
- ఒక్క పంచాయతీలోనే రూ.71 లక్షలు స్వాహా
- చనిపోయిన వారి పేరున బిల్లులు
- సామాజిక తనిఖీల్లో వెలుగులోకి 'ఉపాధి' అవినీతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కూలీలు, నిరుపేదల కష్టార్జితానికి దక్కాల్సిన డబ్బులను కొంత మంది ఉద్యోగులు, వారి వెనకున్న నేతలు కలసి దోచేసుకుంటున్నారు. దోపిడీకి లెక్కా లేదు జమ లేదు. ఎంత వీలు పడితే అంత మేసేసే కార్యక్రమం ఉపాధి హామీ పథకంలో జరుగుతుండటం గమనార్హం. ఈ అవినీతి బాగోతాలు సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది జరిగిన సామాజిక తనిఖీలను పరిశీలించినప్పుడు రెండు పంచాయతీల పరిధిలోనే లక్షల రూపాయల్లో అవినీతి జరిగిందన్నది స్పష్టమైంది. శెట్టూరు మండలం కనుకూరు, గుమ్మగట్ట మండలం బేలోడులో జరిగిన సామాజిక తనిఖీల్లోని వెలుగులోకి వచ్చిన అవినీతి బాగోతాలు ఈ విధంగానున్నాయి.

రూ.71 లక్షలు మింగేశారు

శెట్టూరు మండలం కునుకూరు గ్రామంలో ఈ ఏడాది సెప్టెంబరు మాసంలో సామాజిక తనిఖీ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ గ్రామం పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ బృందం పరిశీలించింది. ఇందులో చూస్తే మొత్తం రూ.2.19 కోట్ల విలువైన పనులు ఆ ఏడాదిలో జరిగాయి. ఇందులో మొత్తం 305 పనులు జరిగాయి. అయితే ఇందులో 40 పనులు మాత్రం ఎక్కడ జరిగాయో పని చేయించిన వారికి కూడా తెలియదు. పనిచేసినట్టు మాత్రం ఎంబుక్‌లో రికార్డు చేశారు. ఎవరు... ఎక్కడ పనిచేసారన్న వివరాలు కూడా లేకుండానే ఎంబుక్ రికార్డు చేసి రూ.71.5 లక్షలు బిల్లు చేశారు. ఇక పనిచేసినట్టు నాటే బోర్డు ఏర్పాటు చేసినట్టు చూపించి రూ.2.30 లక్షలు కాజేశారు. అటువంటి బోర్డు ఏదీ ఆ ప్రాంతంలో కనబడడనట్లు సామాజిక తనిఖీలో తేలింది. ఇక మామిడి మొక్కలు ఇచ్చినవి తక్కువ... బిల్లులు చేసినవి ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ రకంగా ఈ ఒక్క పంచాయతీ పరిధిలోనే దాదాపు సగం డబ్బులకు లెక్క జమలేకుండా ఉన్నట్టు తేలింది.

చనిపోయిన వ్యక్తి పేరున డబ్బులు డ్రా

ఇక శెట్టూరు మండలం బేలుడోలో మరిన్ని చిత్రాలున్నాయి. ఈ గ్రామంలో చనిపోయిన వ్యక్తి ఉపాధి హామీ పనికొచ్చి ఆయనకు బిల్లులు ఇచ్చినట్టు రికార్డుల్లో చూపించారు. ఆయన పేరు మీద రూ.3300 డ్రా చేశారు. ఇక ఇంకుడు గుంత నిర్మించామని రికార్డుల్లో నమోదు చేసి రూ.4.93 లక్షలు కాజేశారు.

వారు నమోదు చేసిన ప్రాంతంలో ఇంకుడు గుంత ఆనవాళ్లు కూడా కనిపంచకపోవడం గమనార్హం. తిప్పేస్వామి అనే రైతు పొలంలో ఫారం పాండ్ తవ్వామని రూ.26256 డబ్బులు కాజేశారు. యల్లప్ప అనే రైతు పొలంలో రూ.31 వేలు, లక్ష్మిరెడ్డి పొలంలో రూ.27 వేలు ఇలా రైతుల పొలాల్లో పారం పాండ్ తవ్వినట్టు చూపించారు. అక్కడ అటువంటి ఆనవాళ్లులేవు. ఇక ఈ గ్రామంలో చేసిన పనికంటే నమోదు అధికంగా ఉంది. ఈ రకంగా ఈ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షల వరకు అదనపు చెల్లింపులు జరిపినట్టు సామాజిక తనిఖీల్లో తేలింది. ఇంకా కొన్ని మండలాల్లోనే సామాజిక తనిఖీ జరిగింది. ఇంకా అనేక మండలాల్లోనూ, పంచాయతీల్లోనూ జరగాల్సి ఉంది. ఇవన్నీ జరిగితే ఏ మేరకు అవినీతి బండారం బయటకు వస్తుందో చూడాల్సి ఉంది.

జాతీయ రహదారుల భద్రతకు నూతన టెక్నాలజీ

- ఎపి నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ వి.రామచంద్ర

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారుల భద్రతే లక్ష్యంగా వినూత్నప్రయోగంగా డాన్స్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించామని ఏపీ నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ వి.రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం వెంకటగారి పల్లి క్రాస్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోతులు లేని రహదారుల నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. తొలిసారి రాష్ట్రంలో రహదారులపై డానిష్ ఫైబర్ టెక్నాలజీతో పనులు చేపట్టారన్నారు. పుట్టపర్తి వద్ద కోడూరు వరకు నిర్మాణ దశలో ఉన్న ఎన్ హెచ్ - 342 నాలుగు వరుసల రహదారిపై అధికార యంత్రాంగం ప్రయోగాత్మకంగా ఈ టెక్నాలజీ ద్వారా రోడ్డు వేయడం జరిగిందన్నారు. డెన్మార్క్ దేశం నుంచి రెండు రకాల ఫైబర్ తెప్పించి రోడ్ల నాణ్యత పెంచేందుకు ఈ ప్రయోగం చేస్తున్నామన్నారు. సాధారణ రోడ్లు 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేయాల్సి వస్తే ఈ డానిష్ ఫైబర్ టెక్నాలజీతో వేసిన రోడ్లు 8 నుంచి 10 ఏళ్ల తర్వాత రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. రోడ్ల నాణ్యత పెంచేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జూలై 4న నంద్యాలలో ఈ ప్రయోగం చేశామని, తొలిసారి జాతీయ రహదారులకు ఇక్కడ ఈ ప్రయోగం చేస్తున్నామని తెలిపారు. భారీ వాహనాలు రోడ్లపైకి వచ్చినప్పటికీ పాట్‌హోల్స్ పడకుండా పదేళ్ల వరకు ఈ టెక్నాలజీతో రోడ్లు వేస్తే మన్నికగా ఉంటాయని ఇక్కడ ప్రయోగాత్మకంగా చేపట్టిన పని సక్సెస్ అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని రోడ్లకు దీనిని అనుసరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి రిటైర్డ్ నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ నయీముల్లా, డెన్మార్క్ విదేశీయుడు జోష్ సెబాస్టియన్, మైక్ గ్లోవర్, ఆర్ అండ్ బి ఈఈ సంజీవయ్య, నేషనల్ హైవే డీఈఈ గిడ్డయ్య, ఆర్ అండ్ బి ఏఈఈ కావ్య, డీఈ నాగ పుల్లమరావు, ఏఈఈ హారిక, రేసిడెంట్ ఇంజనీర్ రవి, ఎన్ఎస్ పిఆర్ కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపెస్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకట్ ఎన్నిక

ప్రజాశక్తి- గోపాలపురం (తూర్పుగోదావరి జిల్లా)

ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటస్టిక్స్ సబార్డినేట్ అసోసియేషన్ (అపెస్సా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం విజయవాడ గొల్లపూడిలో అపెస్సా ఎన్నికలు జరిగాయన్నారు. అధ్యక్షులుగా బి.మనోహర్, అసోసియేట్ అధ్యక్షులుగా జివి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ముని కృష్ణయ్య, పురుషోత్తమ నాయుడు, భగవాన్‌దాస్, సంయుక్త కార్యదర్శులుగా మెహబూబ్ బాషా, వీరభద్రరావు, మహేందర్ రెడ్డి, మహిళా కార్యదర్శిగా మాధవి, ట్రెజరర్‌గా నాగరాజు ఎన్నికయ్యారని తెలిపారు. కట్టా శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారని తెలిపారు.

బాలిక కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి- అమలాపురం

పట్టణంలో సోమవారం బాలిక కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. స్థానిక ఐమైండ్స్ పాఠశాలలో చదువుతున్న కముజు నిషిత (10)ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, ముంగండకు చెందిన బాలిక దూరపు బంధువు మట్టపర్తి మీరాసత్యమూర్తి (చంటి) బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. కిడ్నాపర్ చంటి కాకినాడలోని ఓ మొబైల్ దుకాణంలో మొబైల్ ఫోన్ కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో ఆ బాలిక ఏడవడంతో చంటి మొబైల్ ఫోన్, సిమ్ కార్డును అక్కడే వదిలి పాపను తీసుకుని పరారైనట్లు తెలిపారు. అమలాపురం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు ప్రారంభించారు.

హీరో మోటో నుంచి 'విడా ఎవూటర్ విఎక్స్2గో

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ తన ఎలక్ట్రిక్ మొబిలిటీ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. తన 'విడా' బ్రాండ్ క్రింద కొత్త ఎవూటర్ విఎక్స్2గో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1,02,000గా నిర్ణయించింది. దీన్ని ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని తెలిపింది.

కాప్‌స్టోన్ లాభాల్లో 80 % వృద్ధి

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో కాప్‌స్టోన్ సర్వీసెస్ లిమిటెడ్ నికర లాభాలు 79.64 శాతం పెరిగి రూ.7.06 కోట్లకు చేరాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3.93 కోట్ల లాభాలు ప్రకటించింది. కాగా.. గడిచిన క్యూ2లో కంపెనీ అమ్మకాలు 25 శాతం పెరిగి రూ.210.65 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.168.11 కోట్ల రెవెన్యూ చోటు చేసు కుంది.

నెప్రోప్లస్ ఐపిఒకు సెబీ ఆమోదం

ముంబయి : ప్రముఖ డయాలసిస్ సర్వీసెస్ సంస్థ నెప్రోప్లస్ ఐపిఒ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఈ హైదరాబాద్ కంపెనీ పబ్లిక్ ఇష్యూలో 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా రూ.353.4 కోట్ల నిధులు సమీకరించనున్నట్లు సెబీకి దరఖాస్తు చేసిన డిఆర్‌హెచ్‌పిలో పేర్కొంది. నాలుగు దేశాల్లో కార్యకలాపాలు కలిగిన నెప్రోప్లస్ ఏడాదికి 33 వేల మందికి డయాలసిస్ సేవలను అందిస్తుంది.

నిరాశపర్చిన లెన్స్‌కార్ట్ లిస్టింగ్

ముంబయి : ప్రముఖ కళ్లజోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ లిస్టింగ్ రోజే ఇన్వెస్టర్లను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ సంస్థ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్లలో లిస్టు అయ్యా యి. కాగా.. ఇష్యూ ధర రూ.402 కాగా.. ఎన్ఎస్ఇ లో రూ.7 డిస్కౌంట్‌తో రూ.395 వద్ద, బిఎస్ఇలో రూ.12 తక్కువతో రూ.390 వద్ద లిస్టు అయ్యాయి. లెన్స్‌కార్ట్ ఐపిఒ ద్వారా 9.97 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా రూ.7,278 కోట్ల నిధులు సమీకరించింది.

మహారాజశ్రీ గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వారి కోర్టులో, గుంటూరు
I.A. 1930/2019
In OS 246/2014 AS /2025

బిట్వీన్
1 షేక్ చింతపల్లి హుస్సేన్ బి W/o లేటు ఖాశిం
2 చింతపల్లి షేక్ యూసఫ్ S/o లేటు ఖాశిం
3 షేక్ మారంబి W/o సర్ధార్.
4 చింతపల్లి షేక్ అల్లాబక్షు ...పిటీషనర్లు/ అప్పిలెంట్లు
పై వారందరూ అయ్యప్ప నగర్, ఫైర్ స్టేషన్ రోడ్, జగ్గయ్యపేట పట్టణం మరియు మండలం కృష్ణాజిల్లా.
ఎదిరి
1 షేక్ చింతపల్లి ఖాశింబి W/o లేటు మస్తాన్
2 షేక్ బియామ్మ W/o ఖాశిం సయ్యద్
3 చిక్కం జానమ్మ W/o కొండ ...... రెస్పాండెంట్స్
4 షేక్ నాగుల్ బి W/o ఇస్మాయిల్
R1,R4 అందరు కిష్ణాపురం గ్రామం, మేళ్లచెరువు మండలం సూర్యపేట జిల్లా
5 రాయ కొండారెడ్డి S/o పిచ్చిరెడ్డి
గుడిపాడు గ్రామం క్రోసూరు మండలం, పల్నాడు జిల్లా

పై నెంబర్ I.A.1930/2019 లో పిటిషనర్ అప్పిలెంట్లు పలుమార్లు బత్తా కట్టి సమన్లు సర్వీస్ చేసినప్పటికీ మీరు ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్న నేపథ్యంలో పిటిషనర్లు శ్రీ కోర్టువారిని పర్యాయంగా పత్రికా ప్రకటన కోరిన కారణంగా శ్రీ కోర్టు వారు అనుమతించి ఇచ్చినఉత్తర్వుల ప్రకారము పై నంబరు I.A. 1930/2019 లో ది 4/12/2025 తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనలు నేరుగా గాని వకీలు ద్వారా గాని వినిపించుకో వలసి ఉన్నది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచటమైనది.

ఇట్లు
ఉల్లం శేషగిరిరావు,
ఉసిరికాయల సాంబశివరావు,
తేది: 12/11/2025 నర్రా శ్రీనివాసరావు,
గుంటూరు. పిటీషనర్ తరుపు న్యాయవాదులు,

ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

మహిళా టెన్నిస్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యాన విశాఖపట్నం పోస్టల్ రీజియన్ నిర్వహిస్తున్న 40వ అఖిల భారత తపాలా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ఎంవిపి కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ఏరినాలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బిపి.శ్రీదేవి, గౌరవ అతిథిగా ప్రముఖ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి హాజరయ్యారు. పోటీల్లో భాగంగా తొలిరోజు మొదటి మ్యాచ్‌లో పురుషుల విభాగంలో పశ్చిమ బెంగాల్ సర్కిల్, ఉత్తరప్రదేశ్ సర్కిల్ మధ్య, మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్, ఉత్తరప్రదేశ్ సర్కిల్ తలపడ్డాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బిపి.శ్రీదేవి మాట్లాడుతూ... క్రీడాకారులంతా ఉత్తమంగా రాణించి ఆయా సర్కిళ్లకు పేరు తీసుకురావాలన్నారు. గౌరవ అతిథి నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ...క్రీడలు మానసికోత్తేజంతో పాటు శారీరక ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. గెలుపోటముల కంటే తాము నేర్చుకున్న ఆటను ఎంతవరకు ప్రదర్శించామనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. విశాఖపట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వివిఎస్.జయశంకర్ మాట్లాడుతూ... నవంబర్ 14 వరకు జరగనున్న ఈ పోటీలలో దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 129 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, చత్తీస్‌గఢ్, అస్సాం, ఝార్ఖండ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొననున్నాయని వివరించారు. అనంతరం ఈ తపాలా క్రీడా కార్యక్రమానికి గుర్తుగా ఒక ప్రత్యేక కవర్‌ను విడుదల చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ నుండి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు జాహ్నవి

ప్రజాశక్తి-సోమందేపల్లి

సత్యసాయి జిల్లా సోమదేంపల్లి మండల కేంద్రమైన సోమందేపల్లికి చెందిన వాల్మీకి దాము, దీప దంపతుల కుమార్తె జాహ్నవి జాతీయ స్థాయి జూడోకు ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. జాహ్నవి స్థానిక క్రీస్తు జ్యోతి ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించింది. జాహ్నవి త్వరలో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో జాహ్నవిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామ స్తులు, విద్యార్థులు అభినందించారు.

అండర్ 19 ఖోఖో విజేత ప్రకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులు పాటు జరిగిన అండర్ 19 ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో బాల బాలికల విభాగాల్లో విజేతగా ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. ద్వితీయ స్థానంలో విజయనగరం బాలురు, బాలికల జట్లు, తృతీయ స్థానంలో బాలురు విశాఖపట్నం, బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఇంటర్ విద్యా శాఖ అధికారి ఎస్. తవిటినాయుడు చేతులమీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సిఐఆర్‌పి పరిధిలో రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల ఆడిట్ పుస్తకాలలో ఆసక్తి వ్యక్తపరుచుట కొరకు ఆహ్వానం.

ఆర్థిక సంవత్సరం 2018-20 నుండి 2024-25 మరియు 01.04.2025 నుండి 16.09.2025 వరకుగల కాలవ్యవధి కొరకు సిఐఆర్‌పి (సిఐఎన్: U70101AP2014PTC092285) పరిధిలో రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క చట్టబద్ధ ఆడిట్ పని చేపట్టుటకు ఆసక్తిగల ప్రాక్టీసింగ్ చార్టెడ్ అకౌంటంట్స్ నుండి ఆసక్తి వ్యక్తపరుటకు ఆహ్వానించబడుచున్నది.

ఆసక్తిగల సిఏ సంస్థలు సంస్థ మరియు పార్టనర్స్ ప్రొఫెషనల్ ప్రొఫైల్‌తోపాటు తమతమ కొటేషన్‌ను, శ్రీ ఎస్. ప్రభాకర్, ఇంటెరిమ్ రిసొల్యూషన్, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్. సిఐఆర్‌పి పరిధిలో, 18 నవంబర్, 2025న లేదా ముందుగా **slpl.rhpl@gmall.com** లేదా **sprabhakarip@gmail.com** వద్ద పంపవచ్చును.

సం/-
ఎస్. ప్రభాకర్,
ఇంటెరిమ్ రీసొల్యూషన్ ప్రొఫెషనల్,
రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సిఐఆర్‌పి పరిధిలో
IBBI/IPA-002/IP-N00577/2017-2018/11769
తేది మరియు ప్రదేశం: 11.11.2025 మరియు హైదరాబాద్.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ అనూ ఐరన్ సెంట్రింగ్ సప్లయర్స్, యజమానురాలు : తొట్టెంపూడి మస్తానమ్మ, డి.నెం.7-2, వెలమలవారిపాలెం వేలటిపాలెం, నగరం మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522268, **2) తొట్టెంపూడి మస్తానమ్మ,** డి.నెం.7-2, వెలమలవారిపాలెం వేలటిపాలెం, నగరం మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522268, **తనఖాదారులు/హామీదారులు : శ్రీ కొండ్రాజు జయ భరత్,** డి.నెం.12-8-23, మంగల్‌బావి వీధి, కొత్తపేట, గుంటూరు-522410.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ కొండ్రాజు జయ భరత్ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.06-11-2021**న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్ధేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్ధేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.17-10-2025** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనముగా స్వాధీనం** చేసుకోవడమైనది.

ఆస్తిని **లాంఛనముగా స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది.

ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

ఆస్తి నెం.1 : (గుంటూరు యస్‌ఆర్‌ఒ లోని గిఫ్ట్ డీడ్ దస్తావేజు నెం.9786/2017 ప్రకారం) : పాత గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లోని క్రిస్టియన్ పేట, టియస్ నెం.449, బ్లాక్ నెం.6, వార్డు నెం.6(పాత) మరియు 17(కొత్త), సమీప డి.నెం.16-6-21 నందు **శ్రీ కె. జయ భరత్‌కు** చెందిన 109 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** మునిసిపల్ రోడ్డు 19.00; **దక్షిణం :** మాతంగి సుందరరావు మరియు రాజారావు యొక్క ఆస్తి 52.00, **పడమర :** మాతంగి మస్తాన్ యొక్క ఆస్తి 19.00; **ఉత్తరం :** ఉమ్మడి నడకమార్గం 52.00.

ఆస్తి నెం.2 : (గుంటూరు యస్‌ఆర్‌ఒ లోని గిఫ్ట్ డీడ్ దస్తావేజు నెం.9787/2017 ప్రకారం) : పాత గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లోని క్రిస్టియన్ పేట, టియస్ నెం.449, బ్లాక్ నెం.6, వార్డు నెం.6(పాత) మరియు 17(కొత్త), సమీప డి.నెం.16-6-21 నందు **శ్రీ కె. జయ భరత్‌కు** చెందిన 54.00 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** ఇమ్మడి రాణి సంయుక్త కు చెందిన ఆస్తి; **దక్షిణం :** మిరియాల వెంకటేశ్వర్లు మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **పడమర :** ఇమ్మడి సత్యనారాయణకు చెందిన ఆస్తి; **ఉత్తరం :** బజారు.

స్థలం : విజయవాడ, తేది : 24-10-2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

బీహార్‌లో తుది సంగ్రామం

నేడు రెండోదశ పోలింగ్

122 నియోజకవర్గాల్లో ఓటింగ్‌కు సర్వం సిద్ధం
1302 మంది అభ్యర్థులు...
3.7 కోట్ల మంది ఓటర్లు
విధుల్లో 4 లక్షల మంది : ఎన్నికల సంఘం

రాంచీ : బీహార్ అసెంబ్లీ రెండోదశ ఎన్నికల సంగ్రామం తుది దశకు చేరుకుంది. 20 జిల్లాల్లోని 122 నియోజక వర్గాల్లో మంగళవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. 3 కోట్లా 70 లక్షల మంది ఓటర్ల కోసం ఎన్నికల కమిషన్ 45,399 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 40,073 పోలింగ్ బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఎన్నికల విధుల్లో నాలుగు లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తం 1,302 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకుగానూ మెజారిటీ స్థానాల్లో జరుగుతున్న రెండోవిడత పోల్‌పైనే అందరి దృష్టి నెలకొని ఉంది.

బరిలో 1,165 మంది పురుషులు, 136 మంది మహిళలు

రెండో విడత పోలింగ్ జరగనున్న 122 అసెంబ్లీ స్థానాల్లో 101 జనరల్ సీట్లు, 19 ఎస్‌సి రిజర్వుడ్ సీట్లు, 2 ఎస్‌టి రిజర్వుడ్ సీట్లు ఉన్నాయి. ఈ స్థానాల్లో మొత్తం 1,761 నామినేషన్లు దాఖలవగా, 1,372 నామినేషన్లే చెల్లుబాటయ్యాయి. వీరిలో 70 మంది అభ్యర్థులు నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 1,302 మంది మిగిలారు. వీరిలో 1,165 మంది పురుషులు, 136 మంది మహిళలు, ఒకరు థర్డ్ జెండర్ అభ్యర్థి. మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10 శాతం మంది మహిళలు ఉన్నారు. వనితలకు ఆర్‌జెడి 13, జన్ సురాజ్ 12, బిజెపి 10, జెడియు 9, కాంగ్రెస్ 2 టికెట్లు ఇచ్చాయి.

ఏ పార్టీ నుంచి ఎంతమంది అభ్యర్థులు ?

బిజెపి : 53, జెడియు : 44, ఆర్‌జెడి : 71, కాంగ్రెస్ : 37, జన్ సురాజ్ : 120, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి): 7, సిపిఐ (ఎంఎల్-ఎల్): 6, సిపిఐ(ఎం) 4, ఎల్‌జెపి (రామ్ విలాస్): 15, స్వతంత్రులు: 462, ఇతరులు : 487, స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులే ఎక్కువ

తుది విడత పోలింగ్ జరిగే 122 అసెంబ్లీ స్థానాల్లో 462 మంది స్వతంత్ర అభ్యర్థులు, 487 మంది ఇతరులు (చిన్న పార్టీలు) పోటీ చేస్తున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 11 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. బీహార్‌లోని ప్రధానమైన రాజకీయ పార్టీలు బిజెపి, జెడియు, ఆర్‌జెడి, కాంగ్రెస్, జన్ సురాజ్, విఐపి, వామపక్షాలు, ఎల్‌జెపి (రామ్ విలాస్) మాత్రమే. ఆసక్తికరంగా రెండోవిడత పోలింగ్ బరిలో ఏకంగా 109 రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఆశించి భంగపడిన నేతల్లో కొందరు చిన్న పార్టీల తరఫున ఎన్నికల బరిలోకి దిగారు. మరికొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

బీహార్‌లో 'ఓట్ల చోరీ' సహించం

- మహాఘట్‌బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వియాదవ్

పాట్నా : ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ బీహార్‌లో 'ఓట్ల చోరీ, వంచన'ను సహించదని ఆర్‌జెడి నేత, ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన బీహార్‌లో మొదటిదశ పోలింగ్ జరిగి నాలుగు రోజులైనా 'జెండర్ వైజ్ (స్త్రీ, పురుషులు, థర్డ్ జెండర్ ఓటర్ల) డేటా'ను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిళ్లతో ఇసి సక్రమంగా తన విధులు నిర్వహించడం లేదని విమర్శించారు. అమిత్ షాతో ఇసి కుమ్మక్కై సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే, అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు. "బిజెపి పాలిత రాష్ట్రాల నుంచి మొత్తం 208 కంపెనీల భద్రతా సిబ్బందిని బీహార్ ఎన్నికల విధుల కోసం మోహరించారు. మేం వారిపై నిఘా ఉంచుతున్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సహా బయటి వ్యక్తులు బీహార్‌ను నియంత్రించాలని అనుకుంటున్నారు. దీనిని బీహార్ ప్రజలు అనుమతించరు" అని తేజస్వియాదవ్ అన్నారు. "మోడీ తన ఎన్నికల ప్రచారంలో బీహార్‌లోని నిరుద్యోగం, వలసలు వంటి సమస్యలపై మాట్లాడలేదు. కేవలం కుటిల రాజకీయాలు మాత్రమే చేశారు" అని విమర్శించారు. బీహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని, ఈ నెల 18న ప్రమాణ స్వీకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, మహాఘట్‌బంధన్ బీహార్ ఎన్నికల్లో గెలిస్తే నేరస్థులు, మతతత్వ శక్తులు, అవినీతి పరులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హస్తినలో భారీ విస్ఫోటనాలివీ...

జనవరి 9, 1997: ఢిల్లీలోని ఐటిఓ ప్రాంతంలోని పోలీస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా జరిగిన బాంబు పేలుళ్లలో 50 మందికి గాయాలు
అక్టోబర్ 1, 1997: సదర్ బజార్ ప్రాంతంలో ఊరేగింపు సమీపంలో జరిగిన రెండు బాంబు పేలుళ్లలో 30 మందికి గాయాలు
అక్టోబర్ 10, 1997: శాంతివన్, కౌరియా పుల్, కింగ్స్‌వే క్యాంప్ ప్రాంతాల్లో జరిగిన మూడు బాంబు పేలుళ్లలో ఒకరు మృతి, 16 మందికి గాయాలు
అక్టోబర్ 18, 1997: రాణి బాగ్ మార్కెట్‌లో జరిగిన జంట బాంబు పేలుళ్లలో ఒకరు మృతి, 23 మందికి గాయాలు
అక్టోబర్ 26, 1997: కరోల్ బాగ్ మార్కెట్‌లో జరిగిన జంట బాంబు పేలుళ్లలో ఒకరు మృతి. 34 మందికి గాయాలు
నవంబర్ 30, 1997: ఎర్రకోట ప్రాంతంలో జరిగిన జంట పేలుళ్లలో ముగ్గురు మృతి. 70 మందికి గాయాలు
డిసెంబర్ 30, 1997: పంజాబీ బాగ్ సమీపంలో ఒక బస్సులో జరిగిన బాంబు పేలుడులో నలుగురు మృతి. 30 మందికి గాయాలు
జూలై 26, 1998: ఇంటర్-స్టేట్ బస్ టెర్మినల్ (ఐఎస్‌బిటి) కాశ్మీరీ గేట్ వద్ద నిలిపి ఉన్న బస్సులో జరిగిన భారీ పేలుడులో ఇద్దరు మృతి. ముగ్గురికి గాయాలు
జూన్ 18, 2000: ఎర్రకోట సమీపంలో జరిగిన రెండు శక్తివంతమైన బాంబు పేలుళ్లలో ఎనిమిదేళ్ల బాలికతో సహా ఇద్దరు మృతి. 15 మందికి గాయాలు
మే 22, 2005: ఢిల్లీలోని రెండు సినిమా హాళ్లలో జరిగిన వరుస పేలుళ్లలో ఒకరి మృతి. 60 మందికి గాయాలు.
అక్టోబర్ 29, 2005: సరోజినీ నగర్, పహార్‌గంజ్ మార్కెట్‌లను కుదిపేసిన మూడు పేలుళ్లలో 59 మంది మృతి. 100 మందికి పైగా గాయాలు. ఇదే రోజున ఢిల్లీలోని గోవింద్‌పురి ప్రాంతం వద్ద బస్సులో జరిగిన పేలుడులో ఒకరికి గాయాలు
ఏప్రిల్ 14, 2006: పాత ఢిల్లీలోని ప్రాకార నగరంలోని జామా మసీదు ప్రాంగణంలో జరిగిన రెండు పేలుళ్లలో 14 మందికి గాయాలు
సెప్టెంబర్ 13, 2008: దక్షిణ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్, కరోల్ బాగ్‌లోని గఫర్ మార్కెట్, గ్రేటర్ కైలాష్-1లోని ఎం-బ్లాక్ మార్కెట్‌ల్లో 45 నిమిషాల వ్యవధిలో జరిగిన ఐదు వరుస పేలుళ్లలో 25 మంది మృతి. 100 మందికి పైగా గాయాలు
సెప్టెంబర్ 27, 2008: కుతుబ్ మినార్ సమీపంలోని మెహ్రౌలీ పూల మార్కెట్ వద్ద పేలుడులో ముగ్గురు మృతి. 21 మందికి గాయాలు
మే 25, 2011: ఢిల్లీ హైకోర్టు వద్ద కార్ పార్కింగ్‌లో స్వల్ప పేలుడు.

అంతా గందరగోళమే !

- ఎన్యూమరేషన్ ఫారంపై తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కోసం ఎన్యూమరేషన్ ఫారమ్‌లో భారత ఎన్నికల సంఘం కోరిన వివరాలు బాగా చదువుకున్న ఓటర్లను కూడా గందరగోళానికి గురి చేస్తాయని డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ఫారమ్‌ను అందుకున్న స్టాలిన్ మాట్లాడుతూ, బంధువుల వివరాలు అంటే తల్లిదండ్రులు, సోదరులు, అక్కా చెల్లెళ్లు, భర్త లేదా భార్య వంటి వారి వివరాలా? కాదా? అనేది స్పష్టంగా లేదని అన్నారు. ఈ ప్రశ్నపై స్పష్టత ఏమైనా వుందా? బంధువులు అన్న కాలమ్‌లో వారు ఓటర్ గుర్తింపు కార్డు నెంబర్ అడుగుతున్నారు. మూడో కాలమ్‌లో మళ్లీ వారు బంధువుల పేర్లు అడుగుతున్నారు. ఎవరి పేరు రాయాలి? బంధువు పేరా లేదా దరఖాస్తుదారు పేరా? ఒక చిన్నపాటి తప్పు జరిగినా ఎన్నికల కమిషన్ ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం వుంది." అని స్టాలిన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ వివరాలు కోరడమనేది పెద్ద గందరగోళంలా వుందని ఆయన వ్యాఖ్యానించారు. తానేమీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం లేదని మరోసారి స్టాలిన్ స్పష్టం చేశారు. ఎందుకంటే స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరగాలంటే నిజాయితీ, పారదర్శకతతో కూడిన ఓటర్ల జాబితా చాలా అవసరమని వ్యాఖ్యానించారు. ఆ జాబితాను హడావిడిగా నిర్వహించరాదన్నది తమ వైఖరి అని స్పష్టం చేశారు. కేంద్రంలోని పాలక బిజెపి ఎన్నికల కమిషన్ సాయంతో ఓటర్ల జాబితాలో ఎలా తీవ్రమైన మోసాలకు పాల్పడిందో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విశదీకరించారని చెప్పారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇరువురూ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకమేనని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుండి ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి డిఎంకె సభ్యులు తీసుకువచ్చారన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) ఇళ్ళకు వెళ్లడం లేదని, ఒకవేళ వెళ్లినా వారి వెంట తగినన్ని ఫారాలు తీసుకెళ్లడం లేదని చెప్పారు. ఒక నియోజకవర్గంలో మూడు లక్షలకు పైగా ఫారాలను ఇఆర్ఓ (ఓటరు నమోదు అధికారి) ఎలా పంపిణీ చేస్తారని, ఈ ప్రక్రియను మొత్తంగా ఎలా పూర్తి చేస్తారని స్టాలిన్ ప్రశ్నించారు. 'డిసెంబరు 7న ముసాయిదా జాబితా విడుదల చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. ఆలోగా ఇది పూర్తవుతుందా అనే ఒక అనిశ్చితి కూడా నెలకొంది. డిఎంకె, మిత్రపక్షాలు భయాందోళనలు కూడా ఇవే. జాబితా నుండి పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించే ప్రమాదం వుందని.. అందువల్ల డిఎంకె సభ్యులు అప్రమత్తంగా వుండాలని' స్టాలిన్ కోరారు.

'అసైన్డ్' కు మళ్లీ సవరణ

(మొదటిపేజి తరువాయి)

తదితర ప్రాంతాల్లో 1863 కోట్ల రూపాయలతో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రోడ్లు, డ్రైనేజీలు, నీటిసరఫరా, మురుగునీరు, విద్యుత్తు, ఐసిటి కోసం యుటిలిటీ డక్టులు, రీయూజ్ వాటర్ లైన్, ఎస్‌టిపి, అవెన్యూ ప్లాంటేషన్ తదిరతాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఉండవల్లిలో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ -2 (సామర్థ్యం 8400 క్యూసెక్కులు) డిజైన్, నిర్మాణం, పరీక్ష, కమిషనింగ్, 15 సంవత్సరాల నిర్వహణ కోసం ప్యాకేజీ నెంబరు50కి రూ.595.01 కోట్లకు పరిపాలనా పరమైన అనుమతులను కేబినెట్ మంజూరు చేసింది. క్యాపిటల్ సిటీలో మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్‌కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిపిఎఫ్‌సిఎల్) నుంచి రూ.1500 కోట్లు రుణం తీసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

ముగ్గురు జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న వారికి క్షమాభిక్ష పెడుతూ కేబినెట్ నిర్ణయించింది. రాజమహేంద్రవరానికి చెందిన మధిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు, కడపకు చెందిన వడ్డే శ్రీనివాసులు ఈ నిర్ణయం వల్ల లబ్ధి పొందనున్నారు. ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీపాలసీ -2024 కింద బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాల్లోని కుందూరు, సంతమాగులూరు మండలంలో సుమారు 1000 ఎకరాలను రెన్యూవబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌కోసం ఎపిఎస్‌పిసిఎల్‌కు కేటాయించాలన్న ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. మచిలీపట్నం నార్త్ మండలంలోని మాచవరంలో టిడిపి కార్యాలయానికి 1.60 ఎకరాల భూమిని లీజుకు కేటాయింపు, ఎకరాకు వెయ్యి రూపాయల వంతున లీజు వసూలు చేయనున్నారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

గాయపడినవారు త్వరగా కోలుకోవాలి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఢిల్లీ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, స్నేహితులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి : సిఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జగన్

ఢిల్లీలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తిమంతమైన దేశంగా ఎదుగుతున్న సమయంలో ఇలాంటి నీచమైన చర్యలు దేశ ఐక్యతను, శాంతిని దెబ్బతీసే ప్రయత్నమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ ఘటన ఉగ్రదాడిగా నిర్ధారితమైతే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బాధ్యులను గుర్తించి అత్యంత కఠిన చర్యలు తీసుకుంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పేలుడు ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

మాటలుకాదు, చేతలు కావాలి!

(మొదటిపేజి తరువాయి)

ముందుకు సాగాలని ఆయన అన్నారు.

విజ్ఞాన శాస్త్రంపై దాడిని సహించకూడదు : బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు వాతావరణ మార్పులు అవాస్తవమంటూ విజ్ఞానశాస్త్రంపై దాడి చేస్తున్నారని, అటువంటి దాడిని సహించకూడదని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా అన్నారు. కాప్-30 ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు ఆయన విడుదల చేసిన ప్రకటనను సదస్సు అధ్యక్షుడు డి లాగో చదివి వినిపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దిశలో పదేపదే ప్రకటనలు చేస్తూ, ఉద్గారాల విషయంలో కఠిన చర్యలు అవసరం లేదని చెబుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ, బ్రెజిల్ అధ్యక్షుడు చేసిన ఈ వ్యాఖ్య చర్చనీయాంశంగా మారింది. మానవజాతి భవిష్యత్తు కోసం జీవ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఆదివాసీ సమాజాలను వాతావరణ చర్యలకు కేంద్ర బిందువుగా ఉంచాలని, అటవీ నరికివేతను తగ్గించడంతో పాటు, అడవులపై ఆదివాసీలకు పూర్తిస్థాయి లో హక్కులు కల్పించాలని సూచించారు. ట్రంప్ తిరస్కరించిన పారిస్ ఒప్పందాన్ని సమర్థిస్తూ లులా సమర్థించారు. 'ఆ ఒప్పందం లేకపోయి ఉంటే ఈ శతాబ్దం చివరికి ప్రపంచ ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగి భూమి ఘోర పరిస్థితుల్లోకి వెళ్తుంది' అని ఆయన అన్నారు. అమెజాన్ అడవుల ప్రశాంతత సభ్య దేశాలోల ఆలోచనను కలించడానికే సదస్సును బెలాంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత కాప్ అధ్యక్షుడు ముఖ్తార్ బబాయేవ్ మాట్లాడుతూ గత సంవత్సరం తీసుకున్న వాతావరణ ఆర్థిక నిబద్ధతలను కొనసాగించాలని అనప్నారు. 'బాకు ఫైనాన్స్ లక్ష్యాన్ని నెరవేర్చడమే ఈ కాప్ విజయానికి కీలకం' అని ఆయన అన్నారు.

వ్యయ బిల్లుకు సెనెట్ ఆమోదం

- త్వరలో ముగియనున్న షట్‌డౌన్
- అనుకూలంగా ఓటేసిన ఎనిమిదిమంది డెమొక్రాట్లు
- ఆరోగ్య సబ్సిడీల కొనసాగింపుపై ప్రభుత్వం హామీ ఇవ్వకపోయినా సమర్ధన
- దీనిపై వచ్చే నెలలో ఓటింగ్

డెమొక్రాట్ల శిబిరంలో దుమారం

వాషింగ్టన్ : అమెరికాలో 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు శుభం కార్డు పడబోతోంది. ప్రభుత్వ వ్యయ బిల్లుకు ఎట్టకేలకు సెనెట్ ఆమోదం లభించింది. బిల్లును 60 మంది సమర్థించగా 40 మంది వ్యతిరేకించారు. ఇప్పుడది ప్రతినిధుల సభ ముందుకు వెళ్తుంది. ఆ తర్వాత సంతకం కోసం దానిని దేశాధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ వద్దకు పంపుతారు. ఆయన సంతకం చేయగానే షట్‌డౌన్ ముగుస్తుంది. ఈ ప్రక్రియకు అనేక రోజుల సమయం పడుతుంది. ట్రంప్, రిపబ్లికన్లు ప్రతిపాదించిన ఒప్పందానికి ఎనిమిదిమంది డెమొక్రాట్లు మద్దతు తెలిపారు. దీంతో సెనెట్‌లో వ్యయ బిల్లు ఆమోదం పొందింది. కీలకమైన ఆరోగ్యపరమైన భరోసాను కల్పించే ఒబామా కేర్ ఒప్పందం లేకుండా డెమొక్రాట్లు వెనక్కి తగ్గి బిల్లుకు మద్దతు తెలిపి భయంకరమైన తప్పు చేశారని సోషలిస్టు, సెనేటర్ బెర్నీ స్టాండర్స్ విమర్శించారు.

ఏం జరుగుతుంది?

వ్యయ బిల్లును సెనెట్ ఆమోదించడంతో ప్రభుత్వం కొన్ని నిధులు మంజూరు చేయగలుగుతుంది. ఆహార సాయం, వృద్ధుల కార్యక్రమాలు, ఆరోగ్య రక్షణ వంటి పద్దులకు వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకూ నిధులు సమకూరుతాయి. రిపబ్లికన్లు, డెమొక్రాట్ల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు.... షట్‌డౌన్ కాలంలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటారు. నోటీసులు అందుకున్న వారు కూడా ఉద్యోగాలలో చేరతారు. షట్‌డౌన్ సమయంలో ప్రభుత్వ కార్యక్రమాలకు తమ సొంత నిధులు ఖర్చు చేసిన రాష్ట్రాలకు వాటిని రీయంబర్స్‌మెంట్ చేస్తారు. ప్రభుత్వానికి నిధులు అందించే ద్వైపాక్షిక బిల్లులను ఒప్పందంలో చేర్చారు.

ఆరోగ్య సబ్సిడీల పొడిగింపుపై వచ్చే నెలలో ఓటింగ్

సెనెట్‌లో రిపబ్లికన్లకే మెజారిటీ ఉంది. రిపబ్లికన్లు 53 మంది ఉండగా డెమొక్రాట్ల సంఖ్య 47 మాత్రమే. వ్యయ బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 60 ఓట్లు అవసరమవుతాయి. అంటే కనీసం మరో ఏడుగురు సభ్యుల మద్దతు అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును సమర్ధించేందుకు ఎనిమిదిమంది డెమొక్రాట్లు అంగీకరించారు. బిల్లుకు తాను మద్దతు ఇవ్వబోనని సెనెట్ మైనారిటీ నాయకుడు చక్ స్కమర్ స్పష్టం చేశారు. కొందరు డెమొక్రాట్లతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అఫోర్డబుల్ కేర్ చట్టం (ఆరోగ్య సంరక్షణ) కింద సబ్సిడీలను పొడిగించేందుకు ఉద్దేశించిన బిల్లుపై డిసెంబరులో ఓటింగ్ జరుగుతుంది.

డెమొక్రాట్ల శిబిరంలో అలజడి

వ్యయ బిల్లుపై సుమారు రెండు గంటల పాటు సెనెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. టెక్సాస్ సెనెటర్ జాన్ కార్నిన్ వ్యయ బిల్లుకు అనుకూలంగా చిట్టచివరి ఓటు వేశారు. మితవాద డెమొక్రాట్లు బిల్లుకు అనుకూలంగా ఓటేయడంతో అది గట్టెక్కింది. దీనిపై డెమొక్రాట్ల శిబిరంలో అలజడి రేగింది. ట్రంప్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని పలువురు డెమొక్రాట్లు గుర్తు చేశారు.

న్యూ హ్యాంప్‌షైర్, నెవాడాలకు చెందిన ఇద్దరేసి డెమొక్రాట్ సెనెటర్లతో పాటు వర్జీనియా, ఇల్లినాయిస్, పెన్సిల్వేనియా సెనెటర్లు కూడా బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. డెమొక్రాట్ల శిబిరంలో ఉన్న ఒక స్వతంత్ర సెనెటర్ సైతం బిల్లును సమర్ధించారు. దీంతో బిల్లు ఆమోదానికి అవసరమైన అదనపు ఓట్లు లభించాయి. షట్ డౌన్ కాలంలో దాదాపు 75 వేల మంది ఫెడరల్ ఉద్యోగులను తొలగించారు. లక్షలాది పేదలకు ఆహారం సరఫరాకు అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా విమానాలకు అంతరాయం ఏర్పడింది. ఆరోగ్య సంరక్షణ, సబ్సిడీలను కొనసాగించేందుకు స్పష్టమైన హామీ ప్రభుత్వం ఇవ్వకపోయినప్పటికీ బిల్లుకు కొందరు డెమొక్రాట్లు మద్దతు తెలపడం గమనార్హం.

ప్రాణాలను హరించేలా రోడ్లా..?

- ఎన్‌హెచ్ఎఐ, కేంద్రం వివరణ ఇవ్వాలన్న సుప్రీం

న్యూఢిల్లీ : హైవేలపై జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారిపై, ఆ ప్రమాదాలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రహదారులు అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకోవడంపై వివరణ ఇవ్వాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ)ను, కేంద్రాన్ని ఆదేశించింది. "కేవలం రెండు రోజుల్లో రెండు భయంకరమైన ప్రమాదాలు, దాదాపు 40మంది మరణించారు. వీరిలో పిల్లలే ఎక్కువమంది." అని జస్టిస్ జెకె మహేశ్వరి వ్యాఖ్యానించారు. బెంచ్‌లో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ వున్నారు. రాజస్థాన్‌లోని ఫలోదిలో ఈ నెల 2న హైవే ప్రమాదంలో 15మంది మరణించారు. ఈ ప్రమాదాన్ని తనకు తానుగా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఆ మరుసటి రోజునే హైదరాబాద్ - బీజాపూర్ హైవేపై లారీ, బస్సు ఢీకొనడంతో మూడు మాసాల పసిపాపతోసహా 19మంది మరణించారు. 163వ నెంబరు హైవేపై గల గుంటలో బస్సు పడకుండా తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రెండు ప్రమాదాల వెనుక గల కారణాలను మీడియా వార్తలు స్పష్టంగానే ఇచ్చాయని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. క్రమం తప్పకుండా టోల్ ఫీజులు చెల్లిస్తూనే వున్నా హైవేల పరిస్థితి అస్సలేమాత్రం బాగోలేదని తెలుస్తోందన్నారు. పైగా సేద తీరేందుకు నిర్దేశించిన ప్రాంతాలు కాదని స్పష్టంగా పేర్కొన్నా, హైవేల పొడవునా అక్రమంగా కాఫీ, టీలతోపాటూ తినే హోటళ్లు కూడా పెరిగిపోతున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఫలితంగా, రోడ్లపై తిరిగే వాహనాలు, హైవేల పక్కన నిలిపివుంచిన ట్రక్కులు లేదా ఇతర వాహనాలను గుర్తించలేకపోతున్నాయని జస్టిస్ మహేశ్వరి పేర్కొన్నారు. ఆ రెండు హైవేల పరిస్థితిపై నివేదికను అందజేయాల్సిందిగా రహదారుల మంత్రిత్వ శాఖకు, ఎన్‌హెచ్ఎఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ రెండు హైవేల పొడవునా నోటిపై చేయని ప్రాంతాలను ఆక్రమించి అక్రమంగా ఏర్పాటుచేసిన దాబాలు లేదా ఈటరీల సంఖ్య, వివరాలు అందజేయాల్సిందిగా ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, ఎన్‌హెచ్ఎఐని ఆదేశించింది. ఈ రెండు హైవేలు ప్రయాణిస్తున్న రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు కూడా నోటీసులు జారీ చేయాలని కోర్టు పేర్కొంది. అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది నాద్‌కర్ణి మాట్లాడుతూ, ఈ సుమోటో కేసు పరిధిని దేశవ్యాప్త పరిధికి విస్తరించాలని కోరారు. మొదట ఈ కేసులో ఏం జరిగిందో ముందుగా మనం చూద్దామని జస్టిస్ మహేశ్వరి స్పందించారు.

మొంథాతో రూ.6,384 కోట్ల నష్టం

(మొదటిపేజి తరువాయి)

చేపల చెరువులు ధ్వంసమయ్యాయని తెలిపారు. అదేవిధంగా తపాను కారణంగా 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయని, 1,853 పాఠశాలలకు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఆర్‌అండ్‌బి శాఖకు సంబంధించి 4,794 కిలోమీటర్ల రోడ్లు, 311 వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. జలవనరుల శాఖకు సంబంధించి 3,437 మైనర్ ఇరిగేషన్ పనులు 2,417 మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ వర్షాల వల్ల 58 పట్టణ స్థానిక సంస్థలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విపత్తు కలిగించిన విధ్వంసం నుంచి బాధితులు కోలుకోవడానికి కేంద్రం ఉదారంగా వ్యవహరించాలని కోరారు. సర్వం కోల్పోయిన బాధితులు మళ్లీ కోలుకోవడానికి కేంద్రం అందించే సహాయం, సహకారాలు ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తుపాను ఎదుర్కోవడానికి ఎంతో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం వల్ల పెద్దయెత్తున ప్రాణనష్టం జరగకుండా నివారించగలిగినట్లు అధికారులు వివరించారు. సహాయ కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. బుడమేరు వరదల అనుభవంతో వరద సహాయక చర్యల కోసం 680 డ్రోన్లు ఉపయోగించామన్నారు. అక్టోబరు 27-29వ తేదీల మధ్య 82.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది సాధారణ వర్షపాతం కంటే 9 రెట్లు అధికమని వెల్లడించారు. 443 మండలాలపై తుపాను ప్రభావం చూపిందని, ఈ విపత్తు కారణంగా ముగ్గురు మృతి చెందారని, 9,960 ఇళ్లు నీట మునిగాయని, 1,11,402 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. తుపాను సహాయక చర్యల్లో 12 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 13 ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 1,702 వాహనాలు, 110 మంది ఈతగాళ్లను వినియోగించామని తెలిపారు. 22 జిల్లాల్లో 2,471 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 1,92,441 మందికి పునరావాసం కల్పించామని వెల్లడించారు.

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

పేలాయి. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉలిక్కిపడింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు ఎగిసిపడ్డాయి. ఆ పక్కనే ఉన్న అనేక వాహనాలు మంటలధాటికి తునాతునకలయ్యాయి. పేలుడుతో ఘటనాస్థలిలో ఉన్న ప్రజలు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు అగ్నిమాపక దళాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఏడు ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో ఆఘమేఘాలపై మరిన్ని అగ్నిమాపక వాహనాలను తెప్పించారు. పేలుళ్లపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చాతో మాట్లాడారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేసింది.

క్షతగాత్రులకు వైద్యసేవలు

పేలుడులో గాయపడిన క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎల్ఎన్‌జెపి ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

ఢిల్లీలో హైఅలర్ట్

ఢిల్లీ మెట్రోస్టేషన్ వద్ద భీతావహ పరిస్థితిని చూస్తే ఇది పకడ్బందీగా జరిగిన దాడిలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి గందరగోళంగా మారటంతో.. ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. కార్లు, ఆటోలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమీపంలోని షాపులు, భవనాలు ధ్వంసం అయ్యాయి. ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు. అందువల్ల ప్రమాదం తీవ్రత, ప్రాణ నష్టం కాస్త తగ్గిందని తెలుస్తోంది.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

హైదరాబాద్‌లో హైఅలర్ట్

ఢిల్లీ పేలుళ్ల ఘటనతో హైదరాబాద్‌తో సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతపరమైన ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాల్లోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆ రాష్ట్ర డిజిపి తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలోని రైల్వే స్టేషన్లలో తనిఖీలు

రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్లలో సోమవారం రాత్రి పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. విజయవాడ, విశాఖపట్నం తదితర స్టేషన్లలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బలగాలు జాగిలాలతో అణువణువూ గాలించారు. రాజమండ్రి, ఏలూరు తదితర స్టేషన్లలోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఫరీదాబాద్‌లో పేలుడు తయారీ పదార్థాలు స్వాధీనం

తాజాగా ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో దాదాపు మూడు వేల కిలోల పేలుడు తయారీ పదార్థాలను జమ్మూకాశ్మీర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న ముగ్గురు వైద్యులను అరెస్టు చేశారు. అటు గుజరాత్‌లో ముగ్గురు ఐఎస్ సానుభూతిపరులు అరెస్టైన వేళ ఈ పేలుళ్లు జరగటంతో అనుమానాలు బలపడుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు..

క్షతగాత్రులకు అమిత్‌షా పరామర్శ

క్షతగాత్రులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరామర్శించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ గేట్‌కు సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్‌లో ఉన్న లోక్‌నాయక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న అమిత్ షా క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సను పరిశీలించారు.

ఉత్తమ వైద్యం అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆసుపత్రిలోనే ఢిల్లీ పోలీస్ సిపి సతీష్ గోల్చా, ఇతర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

శాస్త్రీయ భావాలను పెంచుకుందాం..

'కలలు కనండి...వాటిని సాకారం చేసుకోండి' అంటూ మాజీ రాష్ట్రపతి ఎబిజె అబ్దుల్‌కలాం ఇచ్చిన పిలుపును అందుపుచ్చుకుని మా లాంటి బాలలంతా జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతాం. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను చక్కగా వింటాం. పాఠశాలలో చెప్పే సబ్జెక్టు అంశాల్లోనూ ముందుంటాం. ఆటపాటల్లోనూ ఉత్సాహంగా పాల్గొంటాం. ప్రకృతి, పర్యావరణం, సమాజం గురించి అవగాహన పెంచుకుంటాం. మూఢనమ్మకాలను కాకుండా శాస్త్రీయ భావాలను పెంచుకుంటాం. మూఢ నమ్మకాలు వద్దు..సైన్స్ అంశాలే ముద్దు..అంటూ శాస్త్ర, సాంతికే రంగాల్లో పురోభివృద్ధి గురించి మా ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు. సైన్స్‌తోనే సమాజం పురోభివృద్ధి చెందుతుందని నమ్ముతున్నాం.

– పి.తారకేశ్వర్
6వ తరగతి, అక్షర స్కూలు, గురజాల, పల్నాడు జిల్లా.

నేను గీసిన బొమ్మ

మరకాల వీణ
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంభంపాడు, ఎ.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.

నేను గీసిన బొమ్మ

కె.జాన్ వేస్లీ
5వ తరగతి
ఎంపిపిఎస్ టి టెంపుల్ విస్సన్నపేట, విస్సన్నపేట మండలం ఎన్టీఆర్ జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రజల గొంతుకల్లో పాటయ్యాడు..

'గొర్లుబర్లు కాసేటోడు.. అమ్మఅయ్య లేనోడు.. అక్షరం ముక్క రానోడు.. ఏమౌతాడు..' అంటే.. 'అనాథ' అవుతాడు అంటుంది లోకం. కానీ అతడు అనాథ అవ్వలేదు.. 'అందెశ్రీ' అయ్యాడు. పల్లెని ప్రకృతిని ప్రేమించినోడు, సమాజాన్ని దగ్గరుండి చూసినోడు, మనిషిలోని మానవత్వాన్ని తట్టిలేపినోడు, ఉద్యమాన్ని ముందుకు నడిపించిన పాటగాడు అన్నీ ఆయనే.. అక్షరజ్ఞానం లేకపోతేనేం ఆయన పద్యాలు, పాటలు జనం నోళ్లల్లో నీరాజనాలయ్యాయి. 'ఒకటే మరణం.. ఒకటే జననం..' ఆయన శరీరానికే.. పాటకి, మాటకి కాదు.. 'కొమ్మ చెక్కితే బొమ్మ అయినట్లు.. కొలిచి మొక్కితే అమ్మ అయినట్లు..' అక్షరం వెలుగులో అందెశ్రీ ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటాడు..

కవులు ఎందరో ఉన్నా.. అందెశ్రీ గురించి ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాలి అంటే.. సమాజంలో చూసిన, విన్న విషయాలపై ఆయన కవితలు, పాటలు పాడలేదు. ఆయన పాడిన పాటల్లోని ప్రతి పదం ఆయన స్వయంగా అనుభవించింది. కూలిపనికి పోయేటోడు, జీతగాడు, పశువుల కాపరిగా దుర్భర దారిద్ర్యం అనుభవించిన అందె ఎల్లయ్య.. ఆకలి తీర్చుకోవడం కోసం ఇల్లు ఇల్లు తిరిగి భిక్షం ఎత్తుకున్నాడు. కూలి చేయడం కోసం తాపీ కర్ర, మూటముల్లె భుజాన తగిలించుకుని ఊరూర తిరిగాడు. ఈ జీవితం గురించి చెప్పడానికి అతను ఎప్పుడూ సిగ్గుపడలేదు.. పైగా గర్వంగా చెబుతాడు. 'ఆ కష్టాలను మర్చిపోడానికే పదాలు కట్టి పాటలు పాడాను' అంటారు. 'తల్లిదండ్రుల ప్రేమకి నోచని వాడ్ని నేను.. ఓ అనామకుడిని ఇంతమంది ప్రేమకి పాత్రుడిని చేసింది ఆ పాటలే. కళ్లముందున్న ప్రపంచమే నా పాఠశాల.. ప్రకృతే నాకు అమ్మ.. నా ఆలోచనలే నా అయ్య' అని చెబుతారు.

అక్షరాలు రాకపోతేనేం..

తెలంగాణ మారుమూల పల్లె(1961 సిద్ధిపేట జిల్లా రేబర్తి గ్రామం)లో పుట్టిన అందెశ్రీకి అక్షరాలు రాకపోతేనేం, అతని నోటివెంట ఆశువులా వచ్చే ప్రతి కవితా ఎంతో భావుకత ఉట్టిపడుతుంది. పదగాంభీర్యం ఉట్టిపడే ఆ కవితల్లో లోతైన సాహిత్యం ఉంటుంది. దీనిపై ఆయన మాట్లాడుతూ 'నేను బళ్లోకి పోలేదు. కానీ నా తొలి గురువు జక్కిరెడ్డి మల్లారెడ్డి అని చెబుతాను. ఎందుకంటే ఆయన, నాతో పనులు చకచకా చేయించుకోవడానికి పురాణాలని కథలుగా చెప్పేవాడు. ఆ మాటలు వింటున్న నాలో తెలియకుండానే వైరాగ్యం, ఆధ్యాత్మికత ప్రవేశించాయి. అయితే నేను ఆశువుగా పాడే ప్రతి పాటలో నేను పడ్డ కష్టాలు, అనుభవించిన అవమానాలు ముందు నా పాటని, తరువాత నన్ను ఎంతోమందికి దగ్గర చేశాయి' అని చెబుతారు. 'అందె ఎల్లయ్య కాస్తా, అందె శ్రీగా మారడానికి గల కారణం కూడా అదే' అంటారు.

ఆధ్యాత్మికత అంటే..

ఆధ్యాత్మికం గురించి ఆయన చెప్పిన మాటలు చాలామందికి రుచించవు. కానీ ఆయన మాత్రం తనకు తెలిసిన జ్ఞానాన్ని నిక్కచ్చిగా, నిర్భయంగా వెలుగెత్తి చాటారు. 'ఆధ్యాత్మికత అంటే దేవుడిలో లీనమవ్వడం కాదు. ప్రకృతికి దగ్గరగా బతకడం. మనిషితనం చెడకుండా జీవించడం. నేలమీద బతకడం. పంచ భౌతికతత్వంతో పరాచకమాడకపోవడం' అంటారు.

పల్లెకి దగ్గరగా..

'కష్టాలను మర్చిపోవడానికి పద్యానికి అలవాటు పడ్డాను' అనే ఆయన నోటివెంట వచ్చిన ఈ పద్యం ఆయన జీవితానికి దర్పణం పడుతుంది. 'పల్లె నీకు వందనాలు అమ్మ../ నను‌గన్న పల్లె తల్లి నీకు వందనాలు అమ్మ../ నాకు పాట నేర్పి, మాట నేర్పి, బతుకు బాట చూపినందుకు/ పల్లె నీకు వందనాలు అమ్మ../ పాలు మరిసి జీతగాన్నై పశులు గాసే రోజులల్లో../ పాడు గోదలు ఎలుగులు దుంకి పంటచేలు పాడుచేస్తే../ పల్లె కాపులు కళ్లురిమి పశుల మాదిరి తరిమికొడితే../ వెక్కి వెక్కి ఏడ్సి నేను..దిక్కు లేని పక్షినైతే/ ఉసికికప్పుల పాన్పువేసి ఊరడించిన పల్లె నీకు వందనాలు అమ్మ..' అన్న పాట ఒక్క అందెశ్రీ అనుభవించిన కష్టాలనే బహిర్గతం చేయదు. ఎందరో వెట్టి బానిసల వెతలకి అది ప్రతిబింబం.

శరీరాన్ని ముక్కలు చేసిన వ్యవస్థ ఇది..

చాతుర్వర్ణ వ్యవస్థ గురించి అందెశ్రీ ఒకసారి ఇలా చెప్పారు. 'తలలో పుట్టిన బాపడు.. పాదాల్లో పుట్టిన శూద్రుడు.. భుజస్కందాల్లో పుట్టిన క్షత్రియుడు. నాభితొడల మధ్యలో పుట్టిన వైశ్యుడు.. ఈ నలుగురు కాదు.. పంచమ వర్ణం కూడా నా శరీరంలో భాగమే.. ఈ వ్యవస్థ మనిషిని తెగనరికిన తరువాత వచ్చిన వ్యవస్థ. ఒక్క మనిషిని ఐదు ముక్కలుగా తెగనరికినారు. ఈ ముక్కలన్నీ అతికితే ఒక మనిషి ఉంటాడు. ఆ మనిషితనం ఎక్కడ ఉంటాడో.. ఆ మనిషితనపు ఆనవాళ్లు ఎక్కడుంటాయో.. అతని చిరునామా ఎక్కడుంటదో.. అక్కడ నేనుంటా!' అంటారు.

'నా కవిత్వం ప్రపంచాన్ని మార్చదు.. కానీ..

సమాజంలో పేరుకుపోతున్న కుళ్లని, అన్యాయాలని, అక్రమాలని తన పాటలలో, పద్యాలలో వల్లెవేసిన అందెశ్రీ 'తన కవిత్వం ప్రపంచాన్ని మారుస్తుందని ఎప్పుడూ అనుకోలేదు' అంటారు. అయితే తన భావాలని చెప్పడంలో మాత్రం ఆయన ఎప్పుడూ ముందుంటారు. అలా వచ్చిందే ఈ కవిత. 'కనరా.. కనరా.. ప్రపంచాన్ని కనులారా../ వినరా.. వినరా.. విశ్వాన్ని చెవులారా../ ప్రవక్తలెందరు వచ్చినా.. ప్రపంచమేమన్నా మారెనా../ ఎవరివల్ల మారినదెంత.. కన్నీళ్లే ఈ జగమంతా.. మనలో మనమే మారకపోతే.. మారెదెప్పుడు మానవ చరిత../ అంటూనే మరో కవితలో పాండిత్యం.. పండితుల కుటుంబాల్లో../ ప్రతిభ పెట్టుబడి ఉన్న వర్గాల్లోనే పుట్టదు/ కళ.. ఏదైనా ప్రజల నుండి.. ప్రకృతి నుండి పుడుతుంది. దానికి కులం, మతం అంటూ మాట్లాడితే అది ఇంత ముక్కే మిగులుతుంది' అని పదునైన మాటల్లో పలికారు.

సినిమారంగం..

ఇంత ప్రతిభ ఉన్న అందెశ్రీ దుర్భర దారిద్ర్యంలో జీవితాన్ని అంతం చేసుకోవాలన్న ఆలోచన చేశారంటే నమ్మశక్యం కాదు. కానీ ఆ పరిస్థితిని కూడా ఆయన అధిగమించారు. 1994 నుండి సినిమారంగంలో ప్రవేశించి ఎన్నో జనరంజక పాటలు పాడి జనం మనిషిగా జీవించారు. పాడిన పాటలు కొన్నే అయినా అవి జనబాహుళ్యంలో చూపించిన ప్రభావం అజరామరం. ఆయన పాడిన పాటలకి, కవితలకి ఎన్నో ప్రశంసలు, అవార్డులు కూడా దక్కాయి.

సామాజిక ఇతివృత్తాలతో నారాయణమూర్తి తెరకెక్కించిన ప్రతి సినిమాలో అందెశ్రీ పాటలు పాడారు. 'పల్లెనీకు వందనాలమ్మా/ 'మాయమై పోతున్నడమ్మో మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు/ 'గలగల గజ్జెలబండి/ 'కొమ్మ చెక్కితే బొమ్మరా.../ 'జన జాతరలో మన గీతం/ 'యెల్లిపోతున్నావా తల్లి/ 'చూడ చక్కని..' వంటి ఎన్నో జనరంజక పాటలు ఆయన గళం నుండి జాలువారాయి.

తెలంగాణ రాష్ట్ర గీతం.. అందెశ్రీదే

తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ప్రభావం చూపించిన విప్లవ కవుల్లో అందెశ్రీ కూడా ఒకరు. ఆయన పాడిన పాటలు, కవితలు ఇప్పటికీ జనం గుండెల్లో చైతన్యదీపికలుగా నిలిచిపోయాయి. అందెశ్రీ పాడిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం..' పాట తెలంగాణ జాతీయగీతంగా ప్రకటించడం అందెశ్రీ ప్రతిభకి అద్దం పడుతుంది. 'మాయమైపోతున్నడమ్మో..' అన్న పాట డిగ్రీ విద్యార్థుల తెలుగు వాచకంలో ప్రచురించి, 'వందేమాతరం, మా తెలుగు తల్లి.. వంటి గీతాల వరుసలో చేర్చారు. దీని గురించి ఆయన ఒకసారి ఇలా స్పందించారు. 'ఈ స్థాయి నేను ఊహించలేదు.. అయినా మనిషి ఏది ఊహిస్తే అది జరుగుతుందా ఈ ప్రపంచంలో.. వైదికం, విప్లవోద్యమాలు, దళితోద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమం ఏదైనా మనిషిని నిటారుగా నిలబెట్టాలని కలలుగన్నవే. దానిని త్రికరణశుద్ధిగా ఆచరించేవాడు అలాగే ఉంటాడు. అది లేనివాడే పడుతుంటాడు.. లేస్తుంటాడు..' అంటారు.

నా గుర్తింపు.. నా పాటే..

గుర్తింపు రావడం గురించి ఆయన ఒకసారి ఇలా అన్నారు. 'నా పాట ఆగిపోతే.. అంటే నేను పాడలేకపోతేనే బాధపడతాను.. నా పాటకి గుర్తింపు వచ్చిందా.. లేదా అనేది నేను ఎప్పుడూ పట్టించుకోను. సమాజాన్ని చదివే క్రమంలో నాకు తెలియకుండానే చాలా దూరం ప్రయాణం చేస్తాను.. ప్రపంచానికి సంగీత భిక్ష పెట్టింది జానపదుడు. లోకసాహిత్యమే సంగీతానికి ఆది. కన్నోలెవరో.. అని కంటిధారగా ఏడ్సిన నాకు.. ఈ కథలెందుకు.. ఈ యశస్సులేవీ నేను కోరుకోలేదు. 22 ఏళ్లు.. ఉప్పరోడిగా పనిచేశాను. 10 ఏళ్ల జీతగాడిగా బతికాను. కడలి మీద వచ్చే అల ఆకాశాన్ని అందుకోవాలని ఎగిసిఎగిసి పడుతుంది. చివరికి తీరంలో తలకొట్టుకుని వెనక్కి పోతుంది. అచ్చం ఆ అల మాదిరే నా గీతాలు ఆకాశాన్ని కాదు.. నేల మీద, నేల మీది మనుషుల చుట్టూ ఉండాలనుకుంటాను. నది నడిసిపోతున్నది.. నన్ను నావనై రమ్మన్నది.. పలుమారు పిలుచున్నది.. నాలో ప్రాణమై దాగున్నది.. పాదాలే లేకున్నా.. పయనమెపుడు ఆగదు.. ఎదురేది నిలుచున్నా.. బెదిరి వెనుదిరగదు.. నేనూ అలానే.. ఆ నదిలా ప్రజలకి అనుసంధానంగా సాగిపోతాను..'

– జ్యోతిర్మయి

ఆంధ్రాలో చిత్ర పరిశ్రమకు ప్రోత్సాహాలివ్వాలి

ఎపి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్

రాష్ట్ర విభజన జరిగి పుష్కరకాలమైనా రాష్ట్రంలో చిత్రపరిశ్రమ ఆశించినంత అభివృద్ధి సాధించలేకపోయిందని ఎపి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో మాదిరిగానే నేటికీ ఆంధ్రాకు చెందిన వారు హైదరాబాద్ వెళ్లి షూటింగులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొనటం బాధగా ఉందని పేర్కొన్నారు. చిత్రపరిశ్రమకు చెందిన పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సిఎంగానూ, హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణ సినీరంగం నుంచి ఆంధ్రాలో ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ కూడా పవన్‌కళ్యాణ్ హయాంలోనే ఉన్నా చిత్రపరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆశించిన ఆశావాహులు నిరాశతో ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ నుంచి వస్తున్న సినిమా పెద్దలు కేవలం తాము తీసిన సినిమాలకు టిక్కెట్ల రేట్లు పెంచేసుకుని వెళ్లిపోతున్నారే తప్ప ఇక్కడ చిత్రపరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వటం లేదన్నారు. ఆంధ్రాలో షూటింగులు చేసుకోవడానికి తగిన అవుట్‌డోర్ యూనిట్లు, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేసుకోవడానికి ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లు సరిగా లేవని చాలామంది నిర్మాతలు వాపోతున్నారని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి యూనిట్లు తీసుకొచ్చి ఆంధ్రాలో షూటింగ్‌లు చేసుకోవడం ఖర్చుతో కూడిన పనిగా నిర్మాతలు భావిస్తున్నారన్నారు. హైదరాబాద్ మాదిరిగా కాకుండా ప్రభుత్వమే విశాఖ, విజయవాడ, తిరుపతి కేంద్రాలుగా అవుట్ డోర్ యూనిట్లను, ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లను ఏర్పాటుచేసి సబ్సిడీ ధరలకు ఇస్తే ఖచ్చితంగా ఆంధ్రాలో షూటింగులు చేయడానికి ఇష్టపడతారని తెలిపారు. 8 సంవత్సరాల క్రితం చిన్న సినిమాలకు ఇచ్చిన రూ.10 లక్షల సబ్సిడీ జీవో వల్ల ఇంతవరకు ఏ ఒక్క సినిమాకు కూడా వర్తించలేదని పేర్కొన్నారు. సినీ ఆర్టిస్టులకు ఇచ్చే నంది అవార్డులను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఎఫ్‌డిసి చైర్మన్ పోస్టును కూడా త్వరలోనే భర్తీ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి మోహన్‌గౌడ్ విజ్ఞప్తిచేశారు.

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' గ్లింప్స్

కథానాయకుడు రవితేజ నటిస్తున్న కొత్త సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను నిర్మాతలు విడుదల చేశారు. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ లాంటి సినిమాలతో ఆకట్టుకున్న కిశోర్ తిరుమల ఈ చిత్రానికి దర్శకుడు. గ్లింప్స్ కామెడీగా సాగింది. రామసత్యనారాయణ (రవితేజ)ని అతడి జీవితంలోని ఇద్దరు ఆడోళ్లు రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇంతకీ ఆ ప్రశ్నలేంటి? వాటికి ఎవరూ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేదే స్టోరీలా అనిపిస్తుంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు.. సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ.. ఇలా అన్నింటినీ అడిగారు. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో' అని రవితేజ చెప్పిన డైలాగులు ఫన్నీగా ఉన్నాయి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. భీమ్స్ సంగీతం. వచ్చే సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.

డిసెంబర్ 25న 'దండోరా' విడుదల

లౌక్య ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఈ సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నామని నిర్మాతలు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పోస్టర్ రిలీజైంది. పోస్టర్‌ను గమనిస్తే ఇన్నోవేటివ్‌గా ఉంది. ఓ ఖాళీ ప్రాంతంలో తవ్విన గొయ్యి కనిపిస్తోంది. అందులో ఈ ఏడాదికి డ్రామటిక్‌గా ముగింపునిస్తున్నాం అనే క్యాప్షన్‌తో రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫొటో', బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురు లంక 2012' చిత్రాలను నిర్మించిన దర్శకుడు కావటంతో అంచనాలు పెరిగాయి. సామాజిక స్పృహను కల్గించే అంశంతో ఈ సినిమా తెరకెక్కు తోంది. పెత్తందారుల కుటుంబానికి చెందిన అమ్మాయిలను ప్రేమించి పెళ్లి చేసుకున్నా, వారికి ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో అక్కడున్న పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, బిందు మాధవి, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మార్క్ కె.రాబిన్ సంగీతం. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ పేరజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్. పాటలు టి సిరీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అథర్వణ భద్రకాళి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్‌లో విడుదల చేయనుంది.

'ఇరువురు భామల కౌగిలిలో' షూటింగ్ ప్రారంభం

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో దీపా ఆర్ట్స్ శ్రీనివాస గౌడ్ నిర్మాతగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో 'ఇరువురు భామల కౌగిలిలో' సినిమా షూటింగ్ ప్రారంభమైంది. కె.రాఘవేంద్రరావు స్క్రిప్ట్‌ను నటీనటులు, దర్శక, నిర్మాతలకు అందచేశారు.

'కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ త్రిన్యాద్ వర్మ కథానాయకుడిగా, వైష్ణవి కొల్లూరు, మలినా కథానాయకులు. అక్షర గౌడ కీలకపాత్ర పోషిస్తున్నారు. పలువురు ప్రముఖ నటులు ఇతర పాత్రల్లో నటించనున్నారు. నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా, ప్రముఖ దర్శకులు బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్‌షాట్‌కి ప్రముఖ దర్శకులు ఎ.కోదండరామిరెడ్డితో పాటు నిర్మాత, కెమెరామెన్ ఎస్.గోపాల్‌రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభిస్తామని నిర్మాతలు తెలిపారు. సంగీతం శ్రీను బీట్స్, డిఒపి శశాంక్ శ్రీరామ్, మాటల రచయిత శ్రీధర్ సీపాన, ఎడిటర్ రాఘవేంద్ర వర్మ, లైన్ ప్రొడ్యూసర్ సౌజన్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాయిరామ్ దేవర్ల.

పంత్, జురెల్‌కు చోటుపై కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు

- 14నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

ముంబయి: దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు రిషభ్ పంత్, ధృవ్ జురెల్‌లకు చోటు కల్పించడంపై టీమిండియా కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌లో వీరిద్దరూ ఆడతారని, వీరిద్దరి చోటు కల్పిస్తే ఎవరెవరిని బెంచ్‌కి పరిమితం చేయాలనే అంశంపై వీరు సుదీర్ఘ చర్చలు జరుపుతున్నట్లు మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. వీరిద్దరూ వికెట్ కీపర్ కోటాలో పోటీపడుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. దక్షిణాఫ్రికా–ఎతో జరిగిన రెండో అనధికారిక టెస్ట్‌లో వీరిద్దరూ ఫామ్‌లోకి సెంచరీ, అర్ధసెంచరీలతో రాణించారు. వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ హోదాలో రిషభ్ పంత్‌కు తొలిటెస్ట్‌లో చోటు దక్కవచ్చని, కానీ దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రాణించిన జురెల్‌కు తప్పక చోటు దక్కాలని తాను కోరుకుంటున్నానని ఆకాశ్ చోప్రా తెలిపాడు. వీరికి చోటు కల్పించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే.. సాయి సుదర్శన్, నితీశ్‌కుమార్ రెడ్డిలలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. 3వ స్థానంలో బ్యాటింగ్‌కు సాయి సుదర్శన్ సరిపోతాడని, లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు మాత్రమే నితీశ్ కుమార్ రెడ్డి ఉపయోగపడతాడని, ఈ క్రమంలో తాను సాయి సుదర్శన్ తొలి టెస్ట్ ఆడాలని కోరుకుంటున్నానని తెలిపాడు.

టి20 ప్రపంచకప్‌కు సన్నద్ధం కండి: గంభీర్

భారత్ వేదికగా జరిగే టి20 ప్రపంచకప్‌కు ఆటగాళ్లు సన్నద్ధం కావాలని టీమిండియా కోచ్ గౌతం గంభీర్ ఆటగాళ్లకు దిశా నిర్దేశం చేశాడు. ఇంకా మూడు నెలల సమయం మాత్రమే మిగిలిఉందని, ఆటగాళ్లు ప్రపంచకప్ కోసం పూర్తిగా సన్నద్ధం కావాలని, ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని ఆటగాళ్లకు పలు కీలక సూచనలు చేశాడు.

కోచ్ గౌతం గంభీర్ మాట్లాడిన వీడియో క్లిప్‌ను బిసిసిఐ సోమవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'మా డ్రెస్సింగ్ రూం పారదర్శకంగా ఉంది. దాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నాం. టి20 వరల్డ్ కప్ కోసం పూర్తిగా సన్నద్ధం కావాల్సి ఉంది. మన చేతిలో ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఫిట్‌నెస్ ప్రాముఖ్యాన్ని ఆటగాళ్లంతా అర్థం చేసుకుంటారనుకుంటున్నా' అని గంభీర్ సూటిగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. భారత్, శ్రీలంక వేదికలుగా 2026 ఫిబ్రవరిలో టి20 వరల్డ్ కప్ జరగనుంది.

అహ్మదాబాద్‌లో ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు

టి20 ప్రపంచకప్ ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లో జరగనున్నట్లు సమాచారం. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ రెండు మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. పాకిస్తాన్ జట్టు ఫైనల్‌కు చేరితే మాత్రం వేదిక మారడం ఖాయం. అలాగే సెమీఫైనల్ మ్యాచ్‌లు ముంబయిలోని వాంఖడే స్టేడియం, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతాయని, ముంబయిలో రెండో సెమీస్, కోల్‌కతాలో తొలి సెమీస్ పోరు జరుగుతుందని బిసిసిఐ సూచన ప్రాయంగా తెలియజేసింది. పాకిస్తాన్, శ్రీలంక జట్లు తొలి నాలుగు స్థానాల్లో నిలిస్తే ఒక సెమీస్ కొలంబోలో జరుగుతుంది. ఫిబ్రవరి 7నుంచి మార్చి 8వరకు టి20 ప్రపంచకప్ జరగనున్నట్లు సమాచారం.

ఫైనల్‌కు భారత ఆర్చరీ జట్లు

- ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. సోమవారం జరిగిన పురుషుల రికర్వు, మహిళల కాంపౌండ్ విభాగాల్లో భారతజట్లు ఫైనల్‌కు చేరి పతకాలు ఖాయం చేశాయి. మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ వెన్నం, ప్రతిక ప్రదీప్, దీప్శిఖల బృందం క్వార్టర్ ఫైనల్లో 235–225పాయింట్ల తేడాతో వియత్నాంను ఓడించారు. సెమీస్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్‌పై 234–227పాయింట్ల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరారు. ఫైనల్‌కు చేరడం ద్వారా దీప్శిఖ వ్యక్తిగతంగా 705పాయింట్లతో తన ఖాతాలో వేసుకున్నారు. ఇక అతాను దాస్, యశ్‌దీప్ భోగే, రాహుల్‌తో కూడిన పురుషుల రికర్వు జట్టు సెమీఫైనల్లో 5–3పాయింట్ల తేడాతో కజకిస్తాన్‌ను ఓడించింది. అంతకుముందు టర్కెమిస్తాన్, మలేషియాలను 6–2, 6–0తో ఓడించి సెమీస్‌కు చేరింది. 13న జరిగే ఫైనల్లో భారత జట్టు స్వర్ణ పతక పోటీకి దక్షిణాఫ్రికా జట్లతో పోటీపడనున్నాయి.

తమిళనాడుకు ఆంధ్ర ఝలక్

అభిషేక్, కరణ్ షిండే అర్ధసెంచరీలు రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్



విశాఖపట్నం: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–ఎలో తమిళనాడుపై ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. తమిళనాడు జట్టు నిర్దేశించిన 201పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి(70), కరణ్ షిండే(51) అర్ధసెంచరీలకి తోడు లోయర్ ఆర్డర్‌లో అశ్విన్ హెబ్బర్(21), సత్యనారాయణ(20) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. తొలి ఇన్నింగ్స్‌లో తమిళనాడుకు 5పరుగుల స్వల్ప ఆధిక్యత లభించినా.. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 102పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన తమిళనాడును ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. సౌరభ్ కుమార్(4/46)కి తోడు విజయ్, పృథ్వీరాజ్ రెండేసి వికెట్లతో రాణించారు. దీంతో తమిళనాడు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 195పరుగులకే పరిమితమైంది. దీంతో ఆంధ్ర జట్టు 201పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. ఈ గెలుపుతో ఆంధ్ర ఖాతాలో మరో మూడు పాయింట్లు జమ అయ్యాయి. పాయింట్ల పట్టికలోనూ 2వ స్థానానికి ఆంధ్ర ఎగబాకింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68